నేడు జేసీగా గోపాలకృష్ణ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 31 : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా రోణంకి గోపాలకృష్ణ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఆయన్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. కాగా ఇప్పటి వరకూ ఇక్కడ జేసీగా పనిచేసిన డాక్టర్ శ్రీనివాసులు బుధవారం మధ్యాహ్నం రిలీవ్ అయ్యారు. ప్రభుత్వం ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి నంద్యాల కలెక్టర్‌గా నియమించింది. ఆయన గురువారం అక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఓదార్పు.. భరోసా..

- చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన వారి కుటుంబాలకు పరామర్శ
- ఆర్థిక సాయం అందజేత
- భారీగా పాల్గొన్న టీడీపీ, జనసేన శ్రేణులు

దర్శి, కొండపి నియోజకవర్గాల్లో భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర


టంగుటూరులో అరుణ్‌కుమార్ తల్లిని ఓదార్చుతున్న భువనేశ్వరి

ఒంగోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో కలత చెంది ప్రాణాలు వదిలిన జిల్లాలోని ఆరు కుటుంబాలను నారా భువనేశ్వరి బుధవారం పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి, మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా నిజం గెలవాలి పేరుతో ప్రత్యేకంగా యాత్ర చేపట్టిన భువనేశ్వరి బుధవారం జిల్లాలోని దర్శి కొండపి నియోజకవర్గాల్లో పర్యటించారు. మంగళవారం సాయంత్రం ముక్తినూతలపాడులో పర్యటించి రాత్రికి ఒంగోలు నగర పరిధిలోని బృందావనం కల్యాణ మండపంలో బస చేసిన ఆమె బుధవారం ఉదయం ఇక్కడి నుంచి నేరుగా దర్శి వెళ్లారు. దర్శి పట్టణంలోని ఐదో వార్డులో మరణించిన పరిశుద్ధరావు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ముండ్లమూరు మండలం శింగన్నపాలెం చేరుకొని అక్కడ హనుమంతరావు కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాత తాళ్లూరు మండలం తూర్పుగంగవరం చేరుకొని అక్కడి ఆశ్రమంలో ఉంటున్న జంపాని నరసింహారావు సతీమణిని పరామర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని గంగవరం వద్ద ముగించిన భువనేశ్వరి నేరుగా కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు చేరుకొన్నారు. అక్కడ మరణించిన దుగ్గినేని అరుణ్‌కుమార్ కుటుంబాన్ని, తర్వాత కొండపి మండలంలోని కె.ఉప్పలపాడులో జంగాల అంజయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని చోట్లా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల వంతున ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు.


ఒంగోలులో భువనేశ్వరితో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్, జిల్లా అధ్యక్షుడు బాలాజీ, రవికుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ తదితరులు


శింగన్నపాలెంలో హనుమంతరావు కుటుంబ సభ్యులకు చెక్కును అందించిన భువనేశ్వరి

పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళలు

భువనేశ్వరి పర్యటనలో ఆద్యంతం టీడీపీ, జనసేన శ్రేణులు, ప్రత్యేకించి మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం ఒంగోలులో ఆమె బస చేసిన బృందావనం కల్యాణ మండపం వద్దకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, దర్శి నియోజకవర్గ నేత గోరంట్ల రవికుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌లతోపాటు పెద్దసంఖ్యలో రెండు పార్టీల కార్యకర్తలు వచ్చి భువనేశ్వరిని కలిశారు. నగరానికి చెందిన పలువురు మహిళా డాక్టర్లు ఆమె వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. అనంతరం ముఖ్యనేతలతో కలిసి దర్శి నియోజకవర్గ పర్యటనకు వెళ్లిన భువనేశ్వరికి అక్కడి టీడీపీ మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేల నేతృత్వంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి. అన్ని గ్రామాల్లో ముఖ్యనేతలు పాల్గొన్నారు. దర్శిలో దివ్యాంగులు పెద్దసంఖ్యలో వచ్చి ఆమెను కలిశారు. అనంతరం కొండపి సెగ్మెంట్‌లోని టంగుటూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్న భువనేశ్వరికి ఎమ్మెల్యే డీఎస్‌బీవీ స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య నేతృత్వంలో వందలాది మంది పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. టంగుటూరు, కె.ఉప్పలపాడులో పర్యటన ముగిసే వరకు వెంట సాగాయి. పలు గ్రామాల్లో భువనేశ్వరిని చూసేందుకు మహిళలు పెద్దసంఖ్యలో తరలిరావడంతోపాటు కలిసేందుకు ఆసక్తి చూపారు. అలాంటి వారికి చిరునవ్వుతో అభివాదం చేస్తూ ఆమె ముందుకు సాగారు. రాత్రికి కందుకూరు సమీపంలోని ఆలావారి కల్యాణ మండపంలో బస చేశారు.

చెవిరెడ్డికే చాన్స్!

బాలినేనికి చుక్కెదురు

ఎవరు అవునన్నా, కాదన్నా సీఎం జగన్మోహన్‌రెడ్డి తాను అనుకున్నదే చేశారు. మాగుంటను వద్దనుకోవడంతోపాటు సీనియర్ నాయకుడు బాలినేని పట్టుబట్టినా ఆయన ప్రతిపాదనను తోసిపుచ్చారు. గత 24 గంటల్లో రకరకాల ప్రతిపాదనల మధ్య చివరకు అనుకున్న విధంగానే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డిని రంగంలోకి తెచ్చారు. ఇప్పటిదాకా వైసీపీలో లేనివిధంగా ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల పార్టీ బాధ్యతలు అప్పజెప్పారు. రేపోమాపో ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా కూడా ప్రకటించనున్నారు. ఒంగోలు లోక్‌సభతోపాటు అదనంగా ఎస్‌ఎన్‌పాడు, కందుకూరు, కావలి బాధ్యతలు కూడా చెవిరెడ్డికి అప్పగించారు. దీంతో రాజకీయంతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న గ్రానైట్ పరిశ్రమ, పోర్టుల ఆదాయాలను చేజిక్కించుకోవడమే లక్ష్యంగా ముందడుగు వేశారన్న అనుమానాలను విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

- నేడు భాస్కర్‌రెడ్డికి పార్టీ పదవి.. రేపు ఎంపీ టికెట్
- గ్రానైట్, పోర్టుపైనే అసలు దృష్టి
- ఒంగోలు లోక్‌సభతోపాటు ఎస్‌ఎన్‌పాడు,కందుకూరు, కావలి పార్టీ బాధ్యతల ఆంతర్యం అదే
- వైసీపీ శ్రేణుల్లో విస్మయం
- అనుచరులతో భేటీ అయిన మద్దిశెట్టి





(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వైసీపీ అభ్యర్థుల ఐదో జాబితాలో ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నియోజకవర్గాల అంశం ప్రస్తావనకు రాలేదు. దర్శి ఎమ్మెల్యే మాత్రం అనుచరులతో సమావేశం ఏర్పాటుచేసి అధిష్ఠానంకు హెచ్చరిక పంపారు. గత కొంతకాలంగా వైసీపీలో అలజడి సృష్టిస్తున్న ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి ఎంపిక వ్యవహారానికి సీఎం జగన్ తాను అనుకున్న పద్ధతిలోనే ఫుల్‌స్టాప్ పెట్టారు. ఎంపీ మాగుంటకే తిరిగి అవకాశం ఇవ్వాలని పట్టుబట్టి అలకబూనిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట ఏమాత్రం నెగ్గలేదు. అదేసమయంలో పార్టీ బాధ్యతలను కూడా విజయసాయిరెడ్డి నుంచి తప్పించి చెవిరెడ్డికి అప్పగించారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డే పోటీచేస్తారని నాయకులకు స్పష్టం చేసిన జగన్ బుధవారం నుంచి పార్టీ బాధ్యతలు కూడా ఆయనకే ఇస్తున్నట్లు సంకేతం ఇచ్చారు. తీవ్ర అభ్యంతరం చెప్పిన బాలినేనికి బుధవారం ఉదయం ఆ పార్టీ ముఖ్య నాయకులు ఫోన్ చేసి చెవిరెడ్డి ఎంపీ అభ్యర్థిగా వస్తారు, పార్టీ బాధ్యతలు మాత్రం ఎప్పటి లాగే విజయసాయిరెడ్డి చేతిలో ఉంటాయని చెప్పి పంపారు. దీంతోపాటు ఒంగోలులో నివేశన స్థల పట్టాల పంపిణీకి అడ్డంకులు లేకుండా ముందుకు సాగనిస్తామని హామీ ఇచ్చారు. కొందరు జిల్లా అధికారుల బదిలీలకు బాలినేని సిఫార్సులను అమలు చేస్తామని చెప్పారు. దీంతో ఒంగోలు వచ్చి తాను మినహా ఎవరూ మాగుంట కావాలని కోరలేదని తానొక్కడినే సీఎంను వ్యతిరేకించాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అభ్యర్థి విషయంలో సీఎం నిర్ణయమే ఫైనల్ అని ప్రకటించారు. పార్టీ బాధ్యతలు కాకుండా ఎంపీ టికెట్‌కే చెవిరెడ్డిని పరిమితం చేస్తారని బాలినేని భావించారు. కానీ బుధవారం రాత్రికి అధిష్ఠానం నాయకులు బాలినేనికి ఫోన్ చేసి చెవిరెడ్డికి ఎంపీ టికెట్‌తోపాటు పార్టీ బాధ్యతలు ఇస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. అనుకున్న ప్రకారమే రాత్రి వైసీపీ అధికారిక ప్రకటనలో ఒంగోలు లోక్‌సభతోపాటు ఎస్‌ఎన్‌పాడు, కందుకూరు, కావలి నియోజకవర్గాల పార్టీ కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాయిరెడ్డి ఆ మూడు నియోజకవర్గాలు మినహా మిగిలిన బాపట్ల, నెల్లూరు లోక్‌సభ బాధ్యతలను చూస్తారు. అదనంగా ఆయనకు గుంటూరు లోక్‌సభను అప్పగించారు.

టార్గెట్ గ్రానైట్, పోర్టులే..

ఇప్పటివరకు ఎక్కడా అనుసరించని విధంగా చెవిరెడ్డికి ఒంగోలు లోక్‌సభతోపాటు అటు బాపట్ల లోక్‌సభలోని ఎస్‌ఎన్‌పాడు, ఇటు నెల్లూరు లోక్‌సభ పరిధిలోని కందుకూరు, కావలి నియోజకవర్గాల కోఆర్డినేటర్ బాధ్యతలు ఇవ్వడంలో లోతైన లక్ష్యం ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదాయ వనరులున్న ప్రాంతాలను, విభాగాలను తనకు అనుగుణంగా ఉండే కొందరి నేతల చేతిలో జగన్ పెట్టి పాలన సాగిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం జగన్‌కు ఆ కోవలోని అనుచరగణంలో చెవిరెడ్డి కూడా ప్రముఖంగా ఉన్నారు. కొంతకాలం నుంచి ఆయన ప్రాతినిథ్యం వహించే తిరుపతి జిల్లా చంద్రగిరి బాధ్యతలను కుమారుడికి అప్పగించి తన మకాంను తాడేపల్లికి మార్చారు. సీఎంకు అందుబాటులో ఉంటూ కొన్ని అంశాలను ఆయన ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. అందుకే ఆయనను ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి తేవాలన్న లక్ష్యంతోనే ముందుగా పార్టీ బాధ్యతలు అప్పగించారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే ఒంగోలు లోక్‌సభకే ఆయన్ను పరిమితం చేయకుండా ఎస్‌ఎన్‌పాడును ఆయన పరిధిలోకి తేవడం విశేషం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ మొత్తం ఆ నియోజకవర్గంలోని చీమకుర్తి ప్రాంతంలోనే ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కడప జిల్లాకు చెందిన జగన్ అనుయాయులంతా అక్కడ చేరిపోయారు. మరోవైపు నెల్లూరు లోక్‌సభ పరిధిలోని కందుకూరు, కావలి స్థానాల పార్టీ బాధ్యతలను కూడా చెవిరెడ్డికి అప్పగించారు. రామాయపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతం వాటి పరిధిలో ఉంది. దీంతో ఆ ప్రాంతాల అధికార పెత్తనం కూడా ఆయన చేతిలో ఉండేందుకు వీలుగానే బాధ్యతలను చెవిరెడ్డికి అప్పగించినట్లు విశ్లేషకుల అంచనా. ఇక బుధవారం సాయంత్రం వైసీపీ ప్రకటించిన అభ్యర్థుల ఐదో జాబితాలో ఒంగోలు లోక్‌సభ లేకపోవడానికి కూడా కొన్ని కారణాలు ఉన్నాయని భావిస్తున్నారు. ముందుగా పార్టీ ఇన్‌చార్జిగా చెవిరెడ్డి ఈ ప్రాంతంలో పరిచయ కార్యక్రమాలు నిర్వహించి పరిస్థితిని చక్కబెట్టుకోవాలని చూస్తున్నట్లు తెలిసింది. అంతే గాక తనకు టికెట్ లేదని తెలిసినా తనదారి తాను చూసుకునే విషయంలో పార్టీ అధికారిక నిర్ణయం వచ్చాకే ముందుకుపోవాలని ఎంపీ మాగుంట నిర్ణయించుకుని ఉన్నారు. దీంతో కాస్తంత జాప్యం చేసి మాగుంటను టీడీపీవైపు నుంచి కూడా రంగంలోకి రాకుండా దెబ్బతీయాలన్న ఉద్దేశం కూడా ఉందని అంటున్నారు.

పట్టాల పేరుతో బాలినేనికి చెక్

బాలినేని కస్సుబుస్సులాడకుండా చెక్‌పెట్టే ప్రయత్నం కూడా వైసీపీ అధిష్ఠానం చేసినట్లు తెలిసింది. ఒంగోలులో స్థలాల కోసం సేకరించిన భూమి కొనుగోలుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ వాటిని రైతులకు ఇవ్వకుండా నాలుగు రోజులుగా అధికారులు కాలం గడుపుతున్నారు. బాలినేని మాట వినకపోతే ఈ విషయంలోనూ చెక్ పెట్టాలన్న లక్ష్యంతోనే అలా చేస్తున్నట్లు తెలిసింది. బుధవారం బాలినేని ఒంగోలు వచ్చి ఎంపీ అభ్యర్థి విషయంలో తగ్గినట్లు ప్రకటించిన తర్వాత అధికారులు ఆ ఫైలుపై దృష్టి సారించారు. బుధవారం రాత్రి లేక గురువారం రైతుల అకౌంట్లకు డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకున్నారు. దీనికితోడు పార్టీ కోఆర్డినేటర్‌గా నియోజకవర్గానికి వచ్చి బాలినేనితోపాటు ఇతర వైసీపీ నాయకులను మచ్చిక చేసుకునేందుకు చెవిరెడ్డికి అవకాశం ఇచ్చి తర్వాత ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలని కూడా అధిష్ఠానం వ్యూహం పన్నినట్లు భావిస్తున్నారు. సామ,దాన,భేద దండోపాయాలతో ఎంతటి వారినైనా తనవైపునకు తిప్పుకోవడంలో చెవిరెడ్డి ఘటికుడిగా పేరు. అందుకే ముందుగా ఆయనకు పార్టీ బాధ్యతలు ఇచ్చి ఒంగోలుకు పంపి ఆ తర్వాత ఎంపీ అభ్యర్థిగా ప్రకటించ నున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా ఈ నిర్ణయంతో జిల్లాలోని వైసీపీ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మాగుంట అభిమానులైతే ఇక టీడీపీ జెండా పట్టకతప్పదన్న నిర్ధారణకు వచ్చేశారు. ఆ విషయంలో తొందరగా నిర్ణయం తీసుకోవాలని మాగుంటపై వారు ఒత్తిడి పెంచారు.

మద్దిశెట్టి వ్యూహం

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఒంగోలు ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డాడు. బుధవారం ఆయన దర్శిలో అనుచరులతో భేటీ అయ్యారు. ఎక్కువ మంది తాడోపేడో తేల్చుకుందాం.. మీరు ఏ పార్టీలో అయినా టికెట్ తెచ్చుకోండి మేము మద్దతిస్తామని అక్కడికక్కడే తేల్చిచెప్పారు. మద్దిశెట్టి మాట్లాడుతూ తాను ఇప్పటికీ ఎమ్మెల్యేనే. నియోజకవర్గంలో నా అనుచరులను వేధిస్తున్నారు. దానికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటారని పరోక్షంగా బూచేపల్లిని, అధికారులను హెచ్చరించారు. 'మీకు నేను అండగా ఉంటా దర్శిని వదిలిపోను, ఏమి జరుగుతుందో చూడండంటూ' ఆయన అనుచరులు చేజారకుండా చూసుకునే ప్రయత్నం చేశారు. అయితే సమావేశానికి హాజరైన ఆయన సోదరులు, ఇతర అంతరంగిక నాయకులు 'వైసీపీ అనవసరం టీడీపీనో లేక జనసేనలోనో చేరి రంగంలోకి రండి మంచి ఫలితం వస్తుంది. కాదు కూడదంటే ఇండిపెండెంట్‌గానైనా రంగంలో నిలవండి మనసత్తా చాటుదాం' అని తేల్చిచెప్పినట్లు తెలిసింది.

గ్రానైట్ వ్యాపారుల్లో అలజడి

- ప్రభుత్వ వేధింపులపై ఒక్కటవుతున్న పరిశ్రమ
- మూగబోయిన కటింగ్ ఫ్యాక్టరీలు
- వ్యాపారుల ఫిర్యాదులపై కేసు పెట్టని పోలీసులు
- బలగాల వలయంలో మార్టూరు


మైనింగ్ అధికారుల వాహనంలో లభించిన కారంపొడి ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ వ్యాపారుల్లో అలజడి ఆరంభమైంది. ప్రభుత్వ వేధింపులకు నిరసనగా తరతమ బేధాలకతీతంగా వ్యాపారులు ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో బుధవారం మార్టూరులోని వందకుపైగా గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లలో పనులు నిలిచిపోయాయి. పోలీసుల కేసులను ఎదుర్కొనేందుకు వ్యాపారులు ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. మరోవైపు పోలీసులు.. అటు టీడీపీ ఎమ్మెల్యేపైన, వ్యాపారులపైన కేసులు నమోదు చేసి వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

వ్యాపారులపైనే కేసులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును టార్గెట్ చేసుకొని ప్రైవేట్ సైన్యం ఆధ్వర్యంలో మైనింగ్ అధికారులు మంగళవారం మార్టూరులోని కొన్ని పాలిషింగ్ యూనిట్లలో తనిఖీలు నిర్వహించిన విషయం విదితమే. ఆ సందర్భంగా మైనింగ్ అధికారులతో వచ్చిన ప్రైవేటు వ్యక్తులు తెచ్చిన కర్రలు, కారంపొడిని పోలీసులకు ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో వ్యాపారులు అప్పగించారు. అయితే పోలీసులు వ్యాపారులపైనే కేసులు పెట్టి వారు ఇచ్చిన ఫిర్యాదులను పక్కన పడేశారు. అంతేకాక వ్యాపారులపై నమోదు చేసిన కేసుపై వెంటనే చర్యలు ప్రారంభించారు. అందులోభాగంగా ఆరుగురు వ్యాపారులను అరెస్టు చేశారు. అంతటితో ఆగక బుధవారం భారీగా బలగాలను దింపి మార్టూరును పోలీసుల వలయంలోకి తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో భారీగా పోలీసులు.. అటు వ్యాపారులు, ఇటు టీడీపీ శ్రేణులు నిరసనలకు దిగకుండా అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు.

90శాతానికిపైగా ఫ్యాక్టరీల్లో పనులు నిలిపివేత

వ్యాపారులంతా ఏకతాటిపైకి వచ్చారు. మార్టూరులో సుమారు వంద గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. అందులో 90 శాతం పైగా ఫ్యాక్టరీల్లో బుధవారం పనులు నిలిపివేశారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాపారులు ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఒకేబాటలో నడవాలని నిర్ణయించుకున్నారు. పాలిషింగ్ రాయి ఎగుమతిని కూడా ఆపేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడే అవకాశం నెలకొంది.

నిత్యం వేధింపులే

ఎమ్మెల్యే ఏలూరితోపాటు గ్రానైట్ వ్యాపారంలో ఉన్న టీడీపీ అభిమానులను వేధించే ప్రభుత్వ చర్యల్లో భాగంగా పోలీసులు, మైనింగ్ అధికారుల తనిఖీలు ఒకవైపు కొనసాగుతుండగా.. మరో వైపు ఇతర ప్రాంతాల్లో గ్రానైట్ వ్యాపారుల్లో కూడా అలజడి మొదలైంది. మార్టూరులో ఫ్యాక్టరీలకు ముడి సరుకులు ఇచ్చే బల్లికురవ ప్రాంతం, చీమకుర్తి వద్ద ఉన్న ప్రపంచ ప్రఖ్యాతి చెందిన గెలాక్సీ గ్రానైట్ క్వారీ, అలాగే ఉమ్మడి జిల్లాలోని ఇతరప్రాంతాల్లో ఉన్న పాలిషింగ్ ఫ్యాక్టరీల యజమానుల్లో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రానైట్ పరిశ్రమకు ఎలాంటి చేయూత ఇవ్వలేదు. జగన్ ముఖ్యమంత్రి కాకముందు పాదయాత్రలోనూ, ముఖ్యమంత్రిగా జిల్లాకు వచ్చిన సందర్భంలోనూ గ్రానైట్ పరిశ్రమల చేయూతకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. పైగా అన్ని రకాల అదనపు బారాలు మోపారు. అనునిత్యం తనిఖీల పేరుతో వేధింపులకు దిగారు. వీటికితోడు టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన నాయకులను వదిలేసి టీడీపీలో ఉన్న ఎమ్మెల్యే రవికుమార్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు క్వారీలు, ఫ్యాక్టరీలు మూతపడేలా చేశారు. మొన్నటికి మొన్న అద్దంకిలో కొత్త ఇన్‌చార్జికి సహకరించడం లేదనే నెపంతో వైసీపీలోనే ఉన్న బాచిన కృష్ణచైతన్య క్వారీలోనూ తనిఖీలు నిర్వహించి గ్రానైట్ రాయి అమ్మకం అనుమతులు నిలిపివేశారు. భారీగా జరిమానా విధించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్టూరులో మంగళవారం జరిగిన ఘటనతో పరిస్థితి పరాకాష్టకు చేరింది. దీంతో గ్రానైట్ వ్యాపారుల్లో అలజడి ప్రారంభమై తరతమ బేధాలకు అతీతంగా ప్రభుత్వ చర్యలను నిరసించే దిశగా అడుగులు వేస్తున్నారు.

46మంది తహసీల్దార్లు బదిలీ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31: జిల్లాలో పనిచేస్తున్న 46మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈమేరకు సీసీఎల్‌ఏ అడిషనల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో 59మంది తహసీల్దార్లు పనిచేస్తుండగా 13మంది ఉద్యోగ విరమణకు దగ్గర్లో ఉన్నారు. ఆ తహసీల్దార్లను మినహాయించి మిగిలిన వారిని బదిలీ చేశారు. జోన్-3 పరిధిలో పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. ఆయా తహసీల్దార్లు గుంటూరు, నెల్లూరు జిల్లాలకు బదిలీలు కాగా, ఆ రెండు జిల్లాల్లో అదే కేడర్‌లో పనిచేస్తున్న వారిని మన జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నలుగురు అరెస్టు

- వారిలో ముగ్గురు ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బందే
- 200 బాటిళ్లు స్వాధీనం

త్రిపురాంతకం, జనవరి 31 : సర్కారు వైన్ షాపు నుంచి బెల్టు దుకాణాలకు మద్యం బాటిళ్లను తరలిస్తున్న నలుగురిని ఎర్రగొండపాలెం ఎస్‌ఈబీ అధికారులు బుధవారం వలపన్ని పట్టుకున్నారు. పక్కా సమాచారం అందడంతో ఎస్‌ఈబీ సీఐ పి.నాగేశ్వరరావు తన సిబ్బందితో స్థానిక టూరిజం మద్యం దుకాణం సమీపంలో కాపుకాశారు. బైకులపై మద్యాన్ని తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 200 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిలో గుమ్మా అంజయ్య పులిగొర్ల నరసింహులు త్రిపురాంతకంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్లు కాగా, కోంద్రు రామారావు సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దూదేకుల మీరావలి గణపవరంలో బెల్టు దుకాణాన్ని నడుపుతున్నట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న నిందితులను వైపాలెం ఎస్‌ఈబీ కార్యాలయానికి తరలించి, అనంతరం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో ఎక్కడైనా బెల్టు దుకాణాలు నిర్వహించినా, సారా తయారు చేసినా, అమ్మినా తమకు సమాచారం ఇవ్వాలని సీఐ నాగేశ్వరరావు ప్రజలను కోరారు. ఈదాడులలో ఎస్‌ఈబీ ఎస్పై వై.మోహన్, సిబ్బంది రమేస్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.


పట్టుబడిన నిందితులు, మద్యం బాటిళ్లతో ఎస్‌ఈబీ పోలీసులు

వైసీపీని వీడి..టీడీపీలోకి చేరిక..!

● సాదరంగా ఆహ్వానించిన దామచర్ల



పార్టీలో చేరిన వారితో దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 31: ఒంగోలు నగరంలోని పలువురు వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక 29 డివిజన్‌కు చెందిన పోతంశెట్టి దుర్గాప్రసాద్, 38 డివిజన్‌కు చెందిన కొట్టె వెంకటేశ్వర్లుతోపాటు మరో వంద కుటుంబాలు బుధవారం స్థానిక గుంటూరు రోడ్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల వారికి పార్టీ జెండాలు కప్పి సాదరంగా ఆహ్వానించి మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విసుగు చెందిన ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపు అడుగులు వేయడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని, అందరికీ అన్ని వేళలా అండగా ఉంటానని దామచర్ల తెలిపారు. కార్యక్రమంలో వజీతా మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, నాయకులు కమ్మ వెంకటేశ్వర్లు, షేక్ కపిల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఒంగోలు(విద్య), జనవరి 31 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల(థియరీ) షెడ్యూల్‌ను ఇంటర్ విద్యా కార్యదర్శి సౌరభ్ గౌర్ విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు రోజు మార్చి రోజు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మార్చి 1నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. 1న ద్వితీయ భాష పేపర్-1, 4న ఇంగ్లీషు పేపర్-1, 6న గణితం పేపర్-1ఎ, బోటని, సివిక్స్ అలాగే 9న గణితం 1బి, జువాలజీ, హిస్టరీ, 12వ తేదీన ఎకనామిక్స్, 14న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ ఫైన్ ఆర్ట్స్, 16న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు గణితం, 19న జియోగ్రఫీ, మోడ్రన్ లాంగ్వేజి పరీక్షలు జరుగుతాయి.

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్చి 2 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. 2న ద్వితీయ భాష పేపరు-2, 5న ఇంగ్లీషు, 7, గణితం-2ఎ, బోటని, సివిక్స్ 11న గణితం 2బి, జువాలజీ, హిస్టరీ, 13న ఫిజిక్స్, ఎకనామిక్స్, 15వ తేదీన కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజి, ఫైన్ ఆర్ట్స్ అలాగే 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు గణితం, 20న మోడ్రన్ లాంగ్వేజి, జియాగ్రఫీ పరీక్షలు జరుగుతాయని ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు.

పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి : యూటీఎఫ్

ఒంగోలు(విద్య), జనవరి 31 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పీఎఫ్, డీఏ పీఆర్సీ, సరెండర్ బకాయిలు రూ.18 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఓవీ.వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు, సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించాలన్నారు. సీఐటీయూ నాయకుడు కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలోకి వెళ్లిందని, చివరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు 1వతేదీన జీతాలు ఇవ్వలేని దుస్థితికి చేరుకుందని విమర్శించారు. యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు జి.శేషయ్య, ఎస్.రవి, అబ్దుల్ హై, ఎన్.చిన్నస్వామి, జయరాజు, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నారాయణ, కోటేశ్వరరావు, అక్బర్, శ్రీనివాసరావు, వెంకయ్య పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల కోసమే ‘ఆడుదాం ఆంధ్ర’ పోటీలు : కలెక్టర్



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 31: గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించి, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను నిర్వహిస్తుందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఒంగోలులోని మినీ స్టేడియంలో ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల ద్వారా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి ఐదు క్రీడా విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తొలుత గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను జిల్లా పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటినవారు రాష్ట్ర పోటీలకు ఎంపిక అవుతారని వివరించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జడ్పీ సీఈవో జాలిరెడ్డి, కార్పొరేటర్ ఈదర వెంకటసురేష్‌బాబు, ఆడుదాం ఆంధ్ర అంబాసిడర్ ఇమాంసా, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ పోస్టర్ విడుదల

ఒంగోలు(కల్చరల్), జనవరి 31: పదో తరగతి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్.సుబ్బారావు, విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్‌లు ఆవిష్కరించారు. బుధవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పదో తరగతి విద్యార్థులకు ఈ టాలెంట్ టెస్ట్ ఒక మంచి అవకాశం అన్నారు. జగదీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ, సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఫిబ్రవరి 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి టాలెంట్ టెస్ట్ జరుగుతుందని, 100 మార్కులకు జరిగే పరీక్షలో మొదటి పది రాంకులు సాధించిన వారికి కార్పొరేట్ కళాశాలలో ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 20మంది ర్యాంకర్లకు స్కాలర్‌షిప్ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి, విద్యార్థి జేఏసీ నాయకులు కార్తీక్ సూర్య, కృష్ణ, కరుణాకర్, సతీష్, రాము, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి ఆహ్వాన ఫ్లెక్సీలు ధ్వంసం

టంగుటూరు టోల్‌గేట్ వద్ద నాలుగు ఏర్పాటు

మంత్రి సురేష్ పీఏ ఆదేశాలతోనే ఈ చర్యకు పాల్పడ్డారని టీడీపీ ఆరోపణ

టంగుటూరు, జనవరి 31 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై మృతిచెందిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు నారా భువనేశ్వరి బుధవారం టంగుటూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఆహ్వానం పలుకుతూ టోల్‌గేట్ వద్ద టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన నాలుగు ఫ్లెక్సీలను కొందరు ధ్వంసం చేశారు. మంత్రి సురేష్ పీఏ ఒత్తిడితో టోల్‌గేట్ యాజమాన్యం ఈ చర్యకు పాల్పడిందని టీడీపీ టంగుటూరు పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను ఆరోపించారు. ముందుగా టోల్‌గేట్ యాజమాన్యం అనుమతి కూడా తీసుకున్నామన్నారు. బుధవారం తెల్లవారేసరికి నాలుగు ఫ్లెక్సీల్లో రెండు పడిపోగా, మరో రెండు చించివేసి ఉన్నాయి. విషయం తెలియగానే పార్టీ పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, పార్టీ జరుగుమల్లి మండల అధ్యక్షుడు రవి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫ్లెక్సీలను వాహనంతో బలంగా ఢీకొట్టినట్లు గుర్తించారు. రెండు ఫ్లెక్సీలను చించివేశారు. పడిపోయిన ఫ్లెక్సీలను తిరిగి నిలబెట్టారు. అనంతరం వారిద్దరూ టోల్‌గేట్ యాజమాన్యాన్ని కలసి ప్రశ్నించారు. టోల్‌గేట్ పీడీ ఆదేశాలతో ఫ్లెక్సీలను తొలగించామని అక్కడి సిబ్బంది నింపాదిగా సమాధానం చెప్పారు. దీంతో వారిపై టీడీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు తిరిగి ఏర్పాటు చేశామని, వాటికి ఏదైనా నష్టం జరిగితే టోల్‌గేట్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

అవస్థల ఆటలు..!

ఆడుదాం ఆంధ్రలో యువత ఎండలో పడిగాపులు

రెండుగంటల ఆలస్యంగా అధికారులు రాక

తాగునీరు లేదు.. టాయిలెట్లు నిల్

అల్పాహారం తెచ్చినా క్రీడాకారులకు ఇవ్వని వైనం

వైసీపీ సభను తలపించేలా పార్టీ రంగులతో క్రీడా వేదిక





ఆటలు పోటీలను సమయానికి ప్రారంభించకపోవడంతో క్రీడాకారుల ఎదురుచూపులు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 31 : ప్రజల్లో తమ పార్టీ పేరు వినిపించేలా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు పిల్లలకు కష్టాలు తెచ్చిపెట్టాయి. ఇప్పటి వరకు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించారు. అయితే అవి కూడా పాల్గొనేవారు రాకపోయినా మొక్కుబడిగా ముగించేసి, ఎట్టకేలకు జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ మేరకు మూడు రోజులపాటు ఒంగోలులోని మినీ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలు ఏర్పాటు చేశారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఇతర క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభించారు. అయితే ఉదయం 10 గంటలకు ఆటల పోటీలు ప్రారంభం కావాల్సి ఉన్నా మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పోటీలు కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించాల్సి ఉంది. విధి నిర్వహణలో కలెక్టర్ మధ్యాహ్నం వరకు హాజరు కాలేకపోయారు. దీంతో క్రీడాకారులు కలెక్టర్ వచ్చే వరకు మండుటెండలో పడిగాపులు కాశారు. ఇదిలా ఉండగా, కనీసం క్రీడాశాఖ అధికారులు గాని, ఇతర అధికారులు క్రీడాకారులను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆకలితో పిల్లలు అల్లాడిపోయారు. రోజంతా టిఫిన్ చేయకుండానే అలాగే ఎదురు చూడగా, మధ్యాహ్నం మూడు గంటలకు భోజనం ఏర్పాటు చేసినా కనీసం కడుపునిండా కూడా తినలేని పరిస్థితి కనిపించింది.

ఏర్పాట్లలో విఫలం



ఎండలోనే..

వైసీపీ సభ అంటే హడావుడి చేసే అధికారులు క్రీడాకారుల పట్ల ఉత్సాహం తప్ప, అవసరమైన ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యంగా ఆటలు పోటీలు జరిగే ప్రదేశంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి. అందులో నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. అయితే ఇక్కడ అలాంటి ఏర్పాట్లు చేయలేదు. మరోవైపు ఎండలు మండిపోతుండగా కనీసం తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో క్రీడాకారులు దాహం తీర్చుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ముఖ్యమంగా మహిళా క్రీడాకారులకు ప్రత్యేక టాయిలెట్లు లేవు. దీంతో సంబంధిత క్రీడా శాఖ అధికారులకు తమ సమస్యను విన్నవించినా ఆలకించే నాధుడు కరువయ్యారు. ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి లేక ఆడపిల్లల బాధ వర్ణనాతీతం.

ఆలస్యంగా కలెక్టర్ రాక

ఆసలే జిల్లా స్థాయి అధికారి, ఆపై ఉద్యోగ బాధ్యతలు బోలెడన్ని. వాటిలో ఒకటైన ఆడుదాం ఆంధ్ర పోటీలల ప్రారంభోత్సవం ఒకటి. అయితే కలెక్టర్ రాక ఆలస్యమైంది. షెడ్యూలు ప్రకారం ఉదయం 10 గంటల రావాల్సి ఉండగా, మధ్యాహ్నం 12 గంటలకు విచ్చేశారు. అయితే అప్పటి వరకు అధికారులు కలెక్టర్ మెప్పు కోసం, అధికారులకు స్వాగతం పలికేందుకు ఆసక్తి చూపారే తప్ప క్రీడాకారులు సమస్యలు ఎవరూ పట్టించుకోకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంచితే మధ్యాహ్నం వరకు టిఫిన్ కూడా పెట్టకపోవడంతో ఆకలి బాధతో అవస్థలు పడ్డారు. అయితే కలెక్టర్ వచ్చి పోటీలు ప్రారంభించిన తర్వాత కూడా వారికి టిఫిన్ పెట్టకపోగా తెచ్చిన టిఫిన్ అలాగే స్టేడియంలోకి తీసుకెళ్ళారు. దీంతో కలెక్టర్ పోటీలు ప్రారంభించి కబడ్డీ, వాలీబాల్ పోటీలను కొనసాగించారు. మ్యాచ్‌లు ముగిసేటప్పటికి సమయం 3 గంటలు కాగా అప్పటి వరకు భోజనం కూడా రాకపోవడంతో అక్కడ క్రీడాకారుల పరిస్థితి ఎవరికి చెప్పుకోలేని విధంగా మారింది.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

వైసీపీ సభలా...

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు వైసీపీ సభలా మార్చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన రంగులు, సభా వేదిక ముస్తాబు, వేదిక అలంకరణ అంతా వైసీపీ సభను మరిపించేలా ఉంది. క్రీడలు రాజకీయపార్టీలకు అతీతంగా నిర్వహించాల్సింది పోయి, యువతను ఆకట్టుకునేలా, వారి మనసులో వైసీపీ ముద్ర కనిపించేలా సభా వేదికను నిర్వహించారు. ఇదిలా పోటీల ప్రారంభానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఇక మిగిలిన వారంతా వైసీపీ నాయకులే వేదికపై కనిపించారు. మేయర్ గంగాడ సుజాత,తోపాటు పలువురు వైసీపీ కార్పొరేటర్లు తమ అధికార దర్పణం ప్రదర్శించారు. దీంతో విచ్చేసిన క్రీడాకారులు వైసీపీ సభకు వచ్చామా...క్రీడా పోటీలకు వచ్చామా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

వైసీపీ సమావేశానికి పలువురు డుమ్మా!

మంత్రి ఎదుట నాయకుల వాదులాట

కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సురేష్ సూచన

కొండపి, జనవరి 31 : కొండపి మండల వైసీపీ కార్యకర్తల సమావేశానికి పలువురు నాయకులు డుమ్మా కొట్టారు. హాజరైన నేతల్లో కూడా కొందరు మంత్రి సురేష్ ఎదుట వాగ్వివాదానికి దిగారు. ఒకరిపై ఒకరు విమర్శలు, ఫిర్యాదులు చేసుకున్నారు. వారిని వారించిన మంత్రి కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. స్థానిక కామేపల్లి రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఈ సమావేశం మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకూ జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన మంత్రి సురేష్ పాల్గొని గ్రామాల వారీ సమీక్ష నిర్వహించారు. ఒక్కో గ్రామానికి చెందిన ముఖ్యనాయకులను పిలిచి వారితో అర్ధగంటపాటు చర్చించారు. ఈసందర్భంగా నేతివారిపాలెం గ్రామంలోని ఇరువర్గాలవారు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నట్లు తెలిసింది. కొండపి, కట్టావారిపాలెం గ్రామాల నాయకుల మధ్య కూడా ఇదే పరిస్థితి చోటుచేసుకున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొండపిలోని నాయకులు వెంకయ్యకు చేయనందున అక్కడ టీడీపీకి మెజారిటీ వచ్చిందని కట్టావారిపాలెం గ్రామ నాయకులు మంత్రికి చెప్పగా, కట్టావారిపాలెం నాయకులు వెంకయ్య కోసం బాగా పని చేసినా ఆగ్రామంలో కూడా టీడీపీకే మెజారిటీ వచ్చిందని కొండపి నాయకులు వ్యంగ్యంగా మాట్లాడినట్లు సమాచారం. కాగా నియోజకవర్గ కేంద్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఏమాత్రం అనువుగాని చోట నాయకుల స్వార్థం కోసం ఇచ్చారని, ఇప్పుడు ఒక్కరు కూడా ఇల్లు కట్టుకోలేదని కొందరు మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ముప్పవరం, వెన్నూరు గ్రామాల్లో శ్మశానంలో ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో లబ్ధిదారులు తీసుకోలేదని చెప్పినట్లు సమాచారం. మరికొన్ని గ్రామాల్లో కూడా ఇళ్ల నిర్మాణాలకు అనువుగా లేని, గ్రామాలకు దూరంగా ఉన్న స్థలాలను ఎంపిక చేయడంతో పట్టాలు ఇచ్చినా పేదలు ఇళ్లు నిర్మించుకోలేదని పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్తున్నారు. కొండపిలో తాను నడుపుతున్న రేషన్ దుకాణాన్ని సంవత్సరం క్రితం తొలగించారని ఓ యువకుడు మంత్రికి ఫిర్యాదు చేయడంతోపాటు చేతిలోని కాగితాలు విసరడంతో సురేష్ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమావేశానికి ముందు మంత్రి సురేష్‌ను కలిసిన పలువురు వైసీపీ మండల ముఖ్యనాయకులు మాట్లాడుతూ ‘మీ దగ్గరికి వస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులతో ఎన్నికలు చేయడం కష్టం. ఇప్పటికీ అన్ని గ్రామాల్లో ముఖ్యనాయకులు మీవద్దకు రావడం లేదు. దాన్ని పరిష్కరించుకోండి’ అని మంత్రికి సూచించినట్లు సమాచారం.

రాబోయే రోజుల్లో మరింత లోతుగా విశ్లేషిస్తానని మంత్రి వారితో అన్నట్లు సమాచారం. కాగా దాదాపు నాలుగు గ్రామాల నుంచి ప్రధానమైన నాయకులు వివిధ కారణాలు చెప్పి కార్యకర్తల సమావేశానికి దూరంగా ఉండగా, కొన్ని గ్రామాల నుంచి ఓవర్గం నాయకులు గైర్హాజరవడం చర్చనీయాంశమైంది.

సెర్ప్ ఉద్యోగుల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి

● ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు నగరం, జనవరి 31: తమ డిమాండ్లను సాధించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా వ్యాప్తంగా సమ్మె చేస్తున్న సెర్ప్ ఆందోళనపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగుల సమ్మె బుధవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. సమ్మెపాటిస్తున్న సెర్ప్ ఉద్యోగులు స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను ఉద్దేశించి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్ మాట్లాడుతూ ఏళ్ళ తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయటంలో సెర్ప్ ఉద్యోగులనే కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు విధి నిర్వహణలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం కోర్టు తీర్పులను కూడా పట్టించుకోవటం లేదన్నారు. స్వయానా ముఖ్యమంత్రే సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించి మాట తప్పారని ఆయన విమర్శించారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్‌ల పేరుతో ప్రభుత్వం శ్రమదోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు. మహాజన్ సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ పే స్కేలు అమలు చేయాలనే సెర్ప్ ఉద్యోగుల డిమాండ్ సాహేతుకంగా ఉందన్నారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలన్నారు. ధర్నాలో ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరిస్తే సెర్ప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నాయకులు గోపీనాథ్, నారాయణరావు, ఎజ్రా, కల్యాణ్, కోటేశ్వరరావు, కృపారావు, నరసింహారావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పారదర్శకంగా ఉద్యోగాలకు ఎంపిక

● రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 31: రిమ్స్ వైద్య కళాశాల, జీజీహెచ్‌లో ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేశామని, అభ్యర్థుల ఎంపిక అంతా పారదర్శకంగా జరుగుతుందని రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు వెల్లడించారు. బుధవారం ఒంగోలులోని రిమ్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీజీహెచ్, రిమ్స్‌లో ఉద్యోగాల ఎంపికకు అభ్యర్థుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. మెరిట్ జాబితా ప్రకారం ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందని, అదేవిధంగా అభ్యంతరాలకు సమయం కూడా ఉంటుందని చెప్పారు. ఉద్యోగాల విషయంలో ఎవరు కూడా మధ్యవర్తులు, దళారులు మాటల నమ్మి మోసపోవద్దని స్పష్టం చేశారు. మొత్తం 44 కేటగిరిల్లో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించగా 12,591 దరఖాస్తులు వచ్చాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచుతామని, అభ్యంతరాలు ఉంటే ఆఫీస్‌లో సంప్రదించి లిఖితపూర్వకంగా అందజేయాలని సూచించారు. సమావేశంలో ఏడీ విజయలక్ష్మి, ఏవో ప్రకాశరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

దళారులను నమ్మి మోసపోవద్దు : డీఎంహెచ్‌వో

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31 : జిల్లాలోవైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల్లో అర్హత ఉన్నవారందరినీ రెగ్యులరైజ్ చేస్తామని, అందువల్ల దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల అర్హతలను బట్టి రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. జిల్లాలో ఎవరైనా తాము రెగ్యులరైజ్ చేయిస్తామని చెప్పి డబ్బులు అడిగితే ఇవ్వొద్దని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని, అర్హత ఉన్న వారందరిని రెగ్యులరైజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు ఇవ్వాలని అడిగితే తన దృష్టికి తెస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

కొవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31 : ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కొవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన ఏపీ మునిసిపల్ వర్కర్స్‌అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సమావేశానికి ఖాదర్‌బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కొవిడ్ సమయంలో నగరంలో తీసుకున్న 50 మంది కార్మికులకు 16 రోజుల సమ్మె పోరాటంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలలో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, జీవీ.కొండారెడ్డి, తంగిరాల మహేష్ పాల్గొన్నారు. అనంతరం మునిసిపల్ కార్మికులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పాల సేకరణ చట్టంపై అవగాహన సదస్సు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31 : ఆంధ్రప్రదేశ్ పాల సేకరణ, పాల రక్షిత ప్రమాణాల అమలు చట్టం -23పై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి సూచించారు ఒంగోలులోని పశుసంవర్థకశాఖ కార్యాలయంలో జిల్లాలోని పశువైద్యాధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ ఈ చట్టం అమలు ద్వారా రైతుల నుంచి పాలు సేకరించే మిల్క్ అనలైజర్లు ప్రామాణికం చేసి అధికార ముద్ర వేసిన తర్వాతనే ఉపయోగించాలన్నారు. తద్వారా రైతుల పాల వెన్నశాతం, ఎస్ఎన్ఎఫ్ సక్రమంగా గుర్తించి గిట్టుబాటు ధర లభించేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలోని పశువైద్యాధికారులందరూ పాల సేకరణలో నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ రమేష్, వైద్యులు ఎస్‌కే.కాలేషా, పి.చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సబ్ డివిజన్‌లో 30 పోలీసు చట్టం : డీఎస్పీ

ఒంగోలు (క్రైం) జనవరి 31: శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్ డివిజన్ లో 30 పోలీసు చట్టం అమలులో ఉందని డీఎస్పీ కె.నారాయణస్వామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 29 వరకు ఈ చట్టం అమలులో ఉంటుందని, పోలీసు అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యహరించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కొనసాగిన జనచైతన్య యాత్ర



కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31: ఒంగోలు నగరంలోని అన్నవరప్పాడులో బుధవారం రాత్రి జనసేన పార్టీ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ నేతృత్వంలో ఏర్పడే ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌ను ఆదరించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు మర్రిపూడి ఉదయ్, సాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముత్యాల కళ్యాణ్, గోవింద్ కోమలి, ఆకుపాటి ఉష, మాదాసు సాయి, ఉంగరాల వాసు, సుంకర కళ్యాణి, బొందిల మధు, కోట సుధీర్, వాసుకి నాయుడు, పల్ల అపర్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘అమ్మ తలపులో’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 31: ప్రముఖ రచయిత డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు రచించిన అమ్మ తలపులో పుస్తక ఆవిష్కరణ బుధవారం ఘనంగా జరిగింది. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని యుగాలు గడిచినా, ఆది అంతం లేని ఒక గొప్ప ప్రేమమూర్తి అమ్మ అని, అటువంటి అమ్మను తలుచుకుంటూ రచించిన పుస్తకం ఎంతో విలువైనదన్నారు. ఇందులో అమ్మ మనసును తన కవితల్లో డాక్టర్ భూసురపల్లి ఆవిష్కరించారని కొనియాడారు. కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ తల్లీబిడ్డకు ఉండే గొప్ప అనుబంధం ప్రాధాన్యతగా ఈ కవితా సంపుటి రూపొందిందని, ఇది ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే మంచి పుస్తకమన్నారు. రచయిత భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమ్మ ఓ విశ్వవిద్యాలయం అని, ప్రతి ఒక్కరికీ తొలి ఉపాధ్యాయిని అమ్మే అన్నారు. అటువంటి తల్లి గురించి ఎంత రాసినా తక్కువే అవుతుందని, తన మనసులో అమ్మ గురించి మెదిలిన భావాలను ఈ పుస్తకంలో అక్షరీకరించానన్నారు. కార్యక్రమంలో నరసం కోశాధికారి బీరం అరుణ, పొన్నాడ ప్రదీప్తి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి

ఒంగోలు(కల్చరల్), జనవరి 31: మనకు చేతనైన విధంగా సమాజానికి సేవ చేయటంలోనే సంతృప్తి ఉందని ప్రముఖ న్యాయ వాది పోకల వెంకట రామారావు పేర్కొన్నారు. బుధవారం ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శివం ఫౌండేషన్ ద్వారా ఒంగోలులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో పలువురు నిరుపేదలు, అనాథలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ప్రముఖ రచయిత డాక్టర్ మొగిలి దేవ, కొమ్మి రమణయ్య, మన్నం శేషయ్య, నాగాంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.

కేవోజీఆర్పీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సునీల్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31 : కేవోజీఆర్పీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా టి.వెంకటసునీల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భారీగా డిప్యూటీ కలెక్టర్లను బదిలీలు చేయగా వెంకటసునీల్‌ను జిల్లాకు నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

టీడీపీకి చెందిన గ్రానైట్ యజమానులకు రిమాండ్

మార్టూరు, జనవరి 31: మార్టూరులో పోలీసులు అరెస్ట్ చేసిన తెలుగుదేశం పార్టీ మద్దతుదారులైన గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆరుగురికి బుధవారం అద్దంకి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి ప్రియదర్శిని ఫిబ్రవరి 13 వరకూ రిమాండ్ విధించారు. బుధవారం ఉదయం 7 గంటలకు మార్టూరు స్టేషన్ నుంచి అద్దంకి కోర్టుకు తీసుకెళ్లిన గ్రానైట్ పరిశ్రమల యజమానులకు అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎంతో ఉత్కంఠగా కోర్టులో న్యాయాధికారి తీర్పుకోసం వేచి ఉండగా ఎట్టకేలకు రాత్రి 12 గంటల సమయంలో తీర్పును ప్రకటించారు. పోలీసులు కోర్టుకు హాజరుపరిచిన గ్రానైట్ పరిశ్రమ యజమానుల్లో మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ప్రసాద్, కామినేని జనార్దన్, షేక్ రజాక్, మిన్నెకంటి రవికుమార్, అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు ఉన్నారు. నెల్లూరు విజిలెన్సు ఏడీ బాలాజీనాయక్ మంగళవారం మార్టూరులోని అనంత గ్రానైట్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా విధులకు ఆటంకం కలిగించారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు ఏడుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులపై కేసు పెట్టారు. వారిలో ఆరుగురుని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచారు. తీర్పు అనంతరం వారిని మార్టూరు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాత్రి ఒంగోలులోని జైలుకు తరలించారు.

కొండపి అభివృద్ధికి రూ.82.90కోట్లు ఇవ్వండి

● సీఎం జగన్‌ను కోరిన మంత్రి సురేష్

కొండపి, జనవరి 31 : కొండపి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.82.90కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి, వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం సచివాలయంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. ఆమేరకు మంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. టంగుటూరు మండలం అనంతవరం నుంచి తేటుపురం వరకు రోడ్డు కం బ్రిడ్జి కోసం రూ.2.4కోట్లు, సింగరాయకొండ పట్టణంలోని ఎన్‌హెచ్-5 రోడ్డు విస్తరణ, అభివృద్ధికి రూ.4కోట్లు, ఒంగోలు-నంద్యాల వయా కొండపి రోడ్డు పనులకు రూ.50 కోట్లు మంజూరు చేయాలని మంత్రి కోరారు. కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు నుంచి జరుగుమల్లి మండలానికి కనెక్టివిటీ కోసం ఎం.నిడమనూరు రోడ్డుకు రూ.1.50 కోట్లు, మర్రిపూడి మండలం చిలంకూరు వద్ద రోడ్డుతోపాటు చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ప్రతిపాదనలు సమర్పించారు.

కారులో తరలిస్తున్న రూ.79.95 లక్షలు స్వాధీనం

టంగుటూరు టోల్‌గేట్ వద్ద పట్టుకున్న పోలీసులు

ముందురోజు పట్టుబడింది రూ.కోటిపైనే..

టంగుటూరు, జనవరి 31 : టంగుటూరు టోల్‌గేట్ వద్ద పోలీసుల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న నగదు భారీ మొత్తంలో పట్టుబడుతోంది. మంగళవారం కారులో రూ.కోటికి పైగా నగదు దొరకగా, బుధవారం ఇంకో కారులో రూ.79.95లక్షలు స్వాధీనం చేసుకున్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టోల్‌గేట్ వద్ద ప్రతి రోజూ వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. డీఎస్పీ, సీఐ, ముగ్గురు ఎస్సైల పర్యవేక్షిస్తున్నారు. రోజుకు మూడు షిఫ్టులలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం సింగరాయకొండ ఎస్సై శ్రీరామ్ చెన్నై నుంచి హైద్రాబాద్ వెళ్తున్న కారును తనిఖీ చేస్తుండగా అందులో రూ.79,95,500 పట్టుబడింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని నగదును పోలీసు స్టేషన్‌కు తరలించారు. వెంటనే నగదును ట్రెజరీలో జమ చేయగా అక్కడి నుంచి ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు ప్రభుత్వమే అప్పగించింది. అయితే బుధవారం పట్టుబడిన నగదు వివరాలను వెల్లడించిన పోలీసులు, మంగళవారం దొరికింది ఎంతన్నది ప్రకటించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

పృథులగిరి రహదారికి అభివృద్ధికి రూ.8.50కోట్లు మంజూరు

● ఎంపీపీ వెంకటరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

మర్రిపూడి, జనవరి 31 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి రహదారి అభివృద్ధికి రూ.8.50కోట్లు మంజూరైనట్లు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. మర్రిపూడి నుంచి పృథులగిరి సోపానాల వరకు, అక్కడి నుంచి ఎస్టీకాలనీ వరకు 10.5కి.మీ తారురోడ్డు వేయనున్నట్లు తెలిపారు. ఇది పూర్తయితే పృథులగిరికి వెళ్లే భక్తులకు రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు. రోడ్డు పనులకు ఫిబ్రవరి 2వతేదీన రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శంకుస్థాపన చేస్తారన్నారు. విలేకరుల సమావేశంలో సర్పంచ్ కదిరి భాస్కర్‌రావు, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బీవీ.భాస్కర్‌రెడ్డి, మాచేపల్లి నాగయ్య పాల్గొన్నారు.

29 మంది ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఉమ్మడి జిల్లాకు కేటాయించిన 29 మంది మండలపరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా నుంచి 23 మంది, నెల్లూరు జిల్లా నుంచి ఆరుగురు ఎంపీడీవోలకు కలెక్టర్ పోస్టింగ్‌లు ఇచ్చారు. బి.బాబురావు (కారంచేడు), వీజే. విలియమ్స్ (పుల్లలచెరువు), పిశివ సుబ్రహ్మణ్యం(యద్దనపూడి), ఎస్‌కే.గౌసియా బేగం(పొదిలి), కె.సమంతవాణి(కొరిశపాడు), వై.హనుమారెడ్డి(బల్లికురవ), ఆర్‌ఈవీ.ఫణికుమార్‌నాయక్ (సంతనూతలపాడు), బి మహేష్‌బాబు(కనిగిరి), యూబీ. వరప్రసాద్(చినగంజాం), పి.పుట్టారెడ్డి(పామూరు) మండలాలకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీఎస్.పద్మాకర్(కొత్తపట్నం), బి. శ్రీనివాస రెడ్డి(కొనకనమిట్ల), కె.నరసింహారావు(కొమరోలు), జి.కాశయ్య(సంతమాగులూరు), కేఎం.బాబు(పంగులూరు), జీవీ.సత్యనారాయ ణ(అద్దంకి), పిసీతారామయ్య(కురిచేడు), ఎం. శ్రీదేవి (ఇంకొల్లు), టి సుగుణమ్మ(మద్దిపాడు)లను నియమించారు. వి.విజయల క్ష్మి (రాచర్ల), ఎం.శోభారాణి (చీరాల), వై.రాజగోపాల్(పర్చూరు), వై.మహాలక్ష్మి(నాగులుప్పలపాడు), ఎ.ప్రమీలారాణి(కందుకూరు), టి.నాగేష్‌కుమారి(సింగరాయకొండ), పి.నాగమణి(కొండపి), ఎవి సుబ్బారావు (గుడ్లూరు), ఎం.శ్రీహరి(ఉలవపాడు), వీఈ .సుబ్రహ్మణ్యం(టంగుటూరు)మండలాలకు నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం !

చంద్రబాబు అరెస్టుతో మరణించిన వారి కుటుంబాలను ఓదార్చిన నారా భువనేశ్వరి



అరుణ్ తల్లికి రూ.3లక్షల చెక్కును అందిస్తున్న భువనేశ్వరి



సంతనూతలపాడులో భువనేశ్వరికి ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు

కొండపి, జనవరి 31: 'కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరం. అధైర్యపడొద్దు. మీకు అన్ని విధాలా అండగా ఉంటాం' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి భరోసా ఇచ్చారు. చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై మృతిచెందిన కె.ఉప్పలపాడుకు చెందిన జంగాల అంజయ్య భార్య అజంత, కుమారుడు అన్వేష్‌కుమార్‌లను ఆమె బుధవారం పరామర్శించారు. వారిని ఓదార్చారు. అంజయ్య చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళి అర్పించారు. అనంతరం 3 లక్షల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ యువగళం యాత్ర సందర్భంగా ఆయనతో అంజయ్య తీయించుకున్న ఫొటోను భువనేశ్వరికి చూపించి అజంత కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ, జిల్లా నాయకులు దామచర్ల జనార్దన్‌రావు, బీఎన్ విజయ్ కుమార్, నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, పార్టీ పరిశీలకుడు అడకా స్వాములు, నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కె.ఉప్పలపాడు గ్రామ పార్టీ నాయకుడు గుండపనేని రామ్మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు. భువనేశ్వరి కె.ఉప్పలపాడుకు వస్తున్న విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు భారీగా గ్రామానికి చేరుకున్నారు. ప్రధానంగా మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అంజయ్య భార్యకు చెక్కు ఇచ్చిన అనంతరం బయటకు వచ్చిన భువనేశ్వరి అక్కడ ఉన్న ప్రజలకు అభివాదం చేశారు. కొందరు మహిళలను దగ్గరకు పిలిచి నమస్కరించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ బాబుగారు ఏతప్పూ చేయరు, ఆయన తప్పకుండా మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ వ్యాఖ్యానించారు.

టంగుటూరులో..

టంగుటూరు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అక్రమ అరెస్టుతో తీవ్ర మనో వేదనకు గురై గుండెపోటుతో మృతిచెందిన టంగుటూరులోని అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. కొడుకు మృతితో దుఃఖంలో ఉన్న తల్లి సులోచనను ఓదార్చారు. ఆమెకు రూ.3లక్షల చెక్కును అందజేశారు. ఈసందర్భంగా పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు అరుణ్ గృహం వద్దకు చేరుకున్నారు. ఇతరులను లోపలికి అనుమతించకపోవడంతో అందరూ బయటే నిలబడ్డారు. భువనేశ్వరి బయటకు రాగానే టీడీపీకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారికి ఆమె అభివాదం చేసి ముందుకు సాగారు. భువనేశ్వరి రాక సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య నేతృత్వంలో ఏర్పాట్లు జరిగాయి. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో వీరిద్దరితో పాటు టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున టోల్‌గేట్ వద్దకు చేరుకున్నాయి. భువనేశ్వరి రాగానే ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి నేరుగా ఆమె టంగుటూరులోని విష్ణాలయం వీధిలో నివాసం ఉండే వారి సమీప బంధువు మక్కెన పద్మ గృహానికి చేరుకున్నారు. కొంత సమయం అక్కడ గడిపారు. అనంతరం అరుణ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు.

కుంభరాజ్ కుటుంబం కృతజ్ఞతలు

కొండపి: కొండపిలోని హెరిటేజ్ డెయిరీలో వాచ్‌మన్‌గా పనిచేసే నేపాల్‌కు చెందిన కుంభరాజ్ ఏడాదిన్నర క్రితం పిడుగుపాటుకు గురై మృతి చెందారు. హెరిటేజ్ యాజమాన్యం ఆయన కుటుంబానికి దాదాపు రూ.15 లక్షలకు పైగా ఆర్థికసాయం అందించింది. అందుకు నారా భువనేశ్వరికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు కుంభరాజ్ భార్య తులసి, ఇద్దరు కుమార్తెలు బుధవారం సాయంత్రం కె.ఉప్పలపాడు వచ్చి ఆమెను కలిశారు. భువనేశ్వరి కాళ్లు పట్టుకుని చిన్నారులు కృతజ్ఞతలు తెలియజేయబోగా వారించిన ఆమె కుంభరాజ్ భార్యకు పింఛన్ అందించేందుకు కృషి చేస్తానని, హెరిటేజ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని, పిల్లలను చదివిస్తానని హామీ ఇచ్చారు.

మహిళల స్వాగతం

సంతనూతలపాడు: చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించిన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తోన్న నారా భువనేశ్వరి గురువారం మార్గమధ్యలో సంతనూతలపాడుకు చేరుకోవడంతో టీడీపీ మహిళ నాయకుల ఆధ్వర్యంలో పూలుచల్లుతూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొన్ని నిమిషాలు మహిళలు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో ముచ్చటించారు. రెండు నెలలు కష్టపడండి, చంద్రన్నరాజ్యం వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మన్నం రంగనాయకమ్మ, మాధవీలత, పద్మ, ఝాన్సీ, మద్దినేని హరిబాబు, ఎం.శ్రీను, ఎ.రాము, సురేష్, శ్రీరామ్మూర్తి. అంకారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల వీడ్కోలు

ఒంగోలు(కార్పొరేషన్): నిజం గెలవాలి పర్యటనలో భాగంగా మంగళవారం ఒంగోలు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి బుధవారం ఇక్కడి పార్టీ నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక త్రోవగుంటలోని బృందావన్‌లో బస చేసిన ఆమె తన పర్యటనలో భాగంగా ముండ్లమూరు, దర్శి, కొండపి ప్రాంతాల్లో పర్యటన కొనసాగించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, ఆయన సతీమణి నాగసత్యలత, జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, జనసేన జిల్లా ఇన్‌చార్జి షేక్ రియాజ్‌తోపాటు నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, ఆర్ల వెంకటరత్నం, కుసుమకుమారి, అలాగే నగరంలోని పలువురు వైద్యులు, పార్టీ శ్రేణులు భువనేశ్వరికి బొకేలు అందజేసి వీడ్కోలు పలికారు.



భువనేశ్వరికి జ్ఞాపికను అందజేస్తున్న దామచర్ల జనార్దన్, నాగసత్యలత దంపతులు

టీడీపీతోనే కాపుల సంక్షేమం

● ఎమ్మెల్యే స్వామి



పాకలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 31 : రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేసింది టీడీపీనేనని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని పాకలలో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాపులకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 5 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కల్పిస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక రద్దుచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 50 శాతం సబ్సిడీతో రుణాలను అందించామని గుర్తు చేశారు. కాపులను బీసీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి వారిపట్ల పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నామని స్వామి చెప్పారు. చంద్రన్న విదేశీ విద్యా పథకం ద్వారా విదేశాల్లో కాపు విద్యార్థులు చదువుకునేందుకు రూ.10 లక్షలు అందజేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సింగరాయకొండలో కాపు భవనం నిర్మాణానికి రూ.25లక్షలు కేటాయిస్తే వైసీపీ రద్దు చేసిందని స్వామి విమర్శించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. బావితరాల భవిష్యత్ కోసం వచ్చే ఎన్నికల్లో టీడీపీకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, నేతలు షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, రాజగోపాల్ రెడ్డి, బ్రహ్మేశ్వరరావు యస్థాని, కళ్లగుంట నరసింహ, జమ్ము శంకర్ తదితరులు పాల్గొన్నారు.

23 రోడ్లకు మంజూరైన రూ.33 కోట్లు రద్దు చేసిన జగన్

కొండపి: కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి 23 రోడ్ల అభివృద్ధికి టీడీపీ హయాంలో మంజూరు చేసిన రూ.33 కోట్లను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి విమర్శించారు. ఆ నిధులను సీఎం జగన్ పక్కదారి పట్టించారన్నారు. బుధవారం కె.ఉప్పలపాడులో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా తయారై ప్రయాణికులు, వాహనదారులు అల్లాడిపోతున్నారన్నారు. ఇప్పుడు ఎన్నికలకు ముందుగా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అంటూ కొత్త నాటకానికి మంత్రి సురేష్, సీఎం జగన్ తెరలేపారని ధ్వజమెత్తారు. ఇంతకుముందు కూడా పలు మండలాల అభివృద్ధికి నిధులు సీఎంవో మంజూరు చేసిందని ప్రచారం చేసుకున్న వైసీపీ నాయకులు ఒక్క రూపాయి కూడా విడుదల చేయించలేకపోయారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ కేంద్రమైన కొండపికి మంజూరై నిర్మాణంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాలుకు నిధులు ఆపి పాడుబెట్టారన్నారు. క్రీడా ప్రాంగణాన్ని, వెటర్నరీ ఏడీ కార్యాలయాలను కూడా నాలుగున్నరేళ్లుగా పట్టించుకోలేదని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వానికి అభివృద్ధిపై ధ్యాస లేదని, కేవలం ధ్వంసం చేయడం మాత్రమే తెలుసని విమర్శించారు. ఎన్నికల ముందు ఇటువంటి జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ఓటమి భయంతో ఇటువంటి ప్రకటనలు చేయడం సహజమని స్వామి ఎద్దేవా చేశారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

ఒంగోలు(క్రైం), జనవరి 31: వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కొని పరారీ అయ్యారు దుండగులు. ఈ సంఘటన ఒంగోలు నగరం శ్రీనగర్ కాలనీలోని నాల్గోలైన్‌లో బుధవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. ఉండ్రాళ రాములమ్మ అనే 80 ఏళ్ల వృద్ధురాలు శ్రీనగర్ 4లైన్‌లో గల పశువుల పాకా వద్ద ఉండగా స్కూటీ పైన వచ్చిన ఇరువురు దుండగులు ఆమెతో మాట్లాడుతూ ముఖంపై గుద్దేరు. దీంతో ఆమె కింద పడిపోవడంతో మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కొని పరారీ అయ్యారు. అయితే సాయంత్రం నాలుగు గంటల సమయంలో దుండగులు స్కూటీపై రెక్కీ నిర్వహించారు. రాములమ్మతో పశువుల నయిదిబ్బ అమ్ముతారా అని అడిగారు. అమ్ము తామని రాములమ్మ చెప్పారు. దీంతో రాత్రి మరలా వచ్చి ఆమెపై దాడి చేసి బంగారం గొలుసు లాక్కొని పరారీ అయ్యారు.

ఎన్నికల విధులపై అవగాహన పెంచుకోవాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31: రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నియమించిన నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులపై పూర్తిగా అవగాహన పెంచుకొని అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సార్వత్రిక ఎన్నికలకు నియమితులైన నోడల్ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ మేనేజ్‌మెంట్, ఎంసీఎంసీ, ఎలక్ట్రోరల్స్, ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎనిర్వహించే ముందస్తు విధులకు సంబంధించి నోడల్ అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలన్నారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎన్నికల సిబ్బందికి సమర్థవంతంగా శిక్షణ అవసరమన్నారు. అందుకు అనుగుణంగా అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కు నమోదుతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన పెంచేలా స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వచ్చేనెల 10వ తేదీ నాటికి అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రాథమిక చర్యలపై నివేదికను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో ఆర్ శ్రీలత, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీకి సత్కారం



మరియదాస్‌ను సత్కరిస్తున్న ఎస్పీ మలికగర్గ్ తదితరులు

ఒంగోలు(క్రైం), జనవరి 31: పోలీసుశాఖలో 33 ఏళ్ళు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎం.మరియదాస్‌ను ఎస్పీ మలికగర్గ్ ఘనంగా సత్కరించారు. ఒంగోలులోని పోలీసు కళ్యాణమండపంలో బుధవారం రాత్రి డీఎస్పీ మరియదాస్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. జిల్లాలో ఎస్సై, సీఐ, డీఎస్పీగా విధులు నిర్వహించిన మరియదాసు సుమారు మూడేళ్ళపాటు స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిచారు. ఆయన ఉద్యోగమిరమణ సందర్భంగా ఎస్పీతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ

ఒంగోలు (క్రైం) జనవరి 31: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బదిలీలు జరిగాయి. బుధవారం రాత్రి గుంటూరు రేంజి ఐజీ జి.పాల్‌రాజ్ ఉత్తర్వుల మేరకు వీఆర్‌లో ఉన్న ఎస్.సుబ్బారావును త్రిపురాంతకం సర్కిల్‌కు, దాసరి ప్రసాద్‌ను గిద్దలూరు రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా జె.రామకోటయ్యను కంభం సర్కిల్‌కు బదిలీ చేశారు. కె.వెంకటేశ్వరరావును పీసీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా కంభంలో పనిచేస్తున్న ఎం.రాజేష్‌కుమార్‌ను పల్నాడు జిల్లాలోని సత్తేనపల్లి రూరల్‌కు బదిలీ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు : టీడీపీ



మాట్లాడుతున్న హరిబాబు

సంతనూతలపాడు, జనవరి 31: చంద్రబాబుపై పెట్టిన అక్రమకేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని, వైసీపీ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కోర్టుల్లో నిలబడవని టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. గురువారం సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులూబిలోకి నెట్టిందని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వంలో ప్రజలు కోరుకునే పాలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దినేని హరిబాబు, ఎం.శ్రీను, ఎ.రాము, సురేష్, శ్రీరామ్మూర్తి, అంకారావు, సీహెచ్.సుబ్బారావు మన్నం రంగనాయకమ్మ, మాధవీలత, పద్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి మున్సిపాలిటీలో రూ.7.48 కోట్ల మిగులు బడ్జెట్

● నూతన కమిషనర్‌గా ఈశ్వరరాజు బాధ్యతల స్వీకరణ

చీమకుర్తి, జనవరి 31 : రాబోయే ఆర్థిక సంవత్సరం 2024-25కు చీమకుర్తి మున్సిపాలిటీలో రూ.7.48కోట్ల మిగులుతో అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ ఛైర్మన్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని బుధవారం నూతన కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. కాగా రెవెన్యూ మూలధన ఆదాయం మొత్తం రూ.17,06,03,000, రెవెన్యూ మూలధన వ్యయం రూ.16,77,39,000. కాగా ప్రారంభనిల్వ రూ.7,19,89,578తో కలిపి రూ.7,48,53,578కోట్ల మిగులు బడ్జెకు సవరించిన అంచనాలతో కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కాగా నూతన కమిషనర్‌గా ఎస్.ఈశ్వరరాజు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ విధులు నిర్వర్తించిన కమిషనర్ ఫజూలుల్లాను సత్కరించారు. ఫజూలుల్లా అందించిన సేవలను కొనియాడారు.

రైతులను వెంటాడుతున్న నీటి కష్టాలు

- కాలానికి ఎదురీదుతున్న పొగాకు సాగుదారులు
- రెట్టింపైన పెట్టుబడి ఖర్చులు

పొదిలి, జనవరి 31 : వర్షాభావ పరిస్థితులు, సాగు నీటి కష్టాలు నిత్యం రైతులను వెంటాడుతున్నాయి. ప్రస్తుతం పొగాకు రైతులను వర్షాభావ పరిస్థితులు ఆందోళనలో పడేశాయి. ఆరుగాలం కష్టం చేయడం ఒకెత్తైతే పంటను రక్షించుకోవడం మరో ఎత్తవుతుంది. పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియని పరిస్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడుతున్నారు. సాగులో ఉన్నవాటిని రక్షించుకోవాలనే ఆశతో అన్నదాతలు కాలానికి ఎదురీదుతున్నారు. ఇందు కోసం పెట్టుబడి ఖర్చులను రెట్టింపు చేస్తున్నారు. సొంతంగా బోర్లను ఏర్పాటు చేయడంలో కొందరు రైతులు తలమునకలై ఉన్నారు. ఒకపక్క బోర్లు వేసే పనిలో, మరోపక్క పైపులు అందుబాటులో లేక అదనపు ధరలు చెల్లించేందుకు వెనుకాడకుండా ముందుకు సాగుతున్నారు. ఆ క్రమంలో రైతులకు పెట్టిబడి ఖర్చుల భారం తడిసిమోపెడవుతుందని వాపోతున్నారు. పొలం సమీపంలో బోర్లు వేసినా నీళ్లు పడకపోవడంతో సుమారుగా కిలోమీటర్ దూరంలో బోరు వేయించి జనరేటర్ సాయంతో పొగాకుకు నీటి తడులు అందిస్తున్నామని చె ప్తున్నారు. ఈపరిస్థితి పచ్చిమ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. గత ఏడాదిని దృష్టిలో పెట్టుకొని పొగాకు రైతులు అధికంగా వెచ్చించి బ్యారన్‌లు, కౌలుపొలాలలను సాగుచేస్తున్నారు. అంతే కాకుండా గత ఏడాది కూలీలకు రూ. 600ఇస్తే ఈఏడాది రూ.1000 డిమాండ్ ఉందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నా రు. పొగాకు బోర్డు అధికారులు పలురకాలుగా హెచ్చరిస్తున్నా అనుమతి మే రకే సాగుచేయాలని చెప్తున్నా రైతులు ఈ ఏడాది గతంకంటే అధికం గా సా గు చేశారు. అన్నదాతల సహనాన్ని వరుణ దేవుడు ఆది నుంచి పరీక్షి స్తూనే ఉన్నాడు. ఈ ఏడాది రైతులను వానదేవుడు ఎలా కాపాడుతాడో చూడాలి.


నీటి తడులు పెట్టేందుకు 2 కిలోమీటర్ల దూరం నుంచి వేసిన పైపులు... రేయింబవళ్లు పొలం వద్దే పడిగాపులు కాస్తున్న రైతులు

రెండు కిలో మీటర్ల దూరం నుంచి తడి ఇస్తున్నాం



ఆరు ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నాం. వర్షం లేకపోవడంతో రెండు కాలోమీటర్ల దూరంలో బోర్లు ఏర్పాటు చేసి పొగాకు తోటకు నీటి తడి అందిస్తున్నా. కరెంట్ సరఫరా అందుబాటులో లేకపోవడంతో అధికంగా అద్దె చెల్లించి జనరేటర్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నాం. అందుకు అదనంగా ఎకరాకు సుమారుగా రూ.30వేల నుంచి రూ.60వేల ఖర్చు అవుతుంది. అయినా పంటను పోగొట్టుకోలేక భారాన్ని మోస్తున్నాం.

\- ఆదిలక్ష్మి, రైతు

ఆరు బోర్లు వేసి పొగ తోటకు నీరు అందిస్తున్నాం



సొంతపొలం, కౌలు పొలంతో కలిపి 25 ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నా. వర్షాలు పడకపోవడంతో నీటి వసతి లేదు. రూ.2లక్షలు వెచ్చించి ఆరు బోర్లు వేశాను. వాటిలో ఒక్క బోరులో నుంచి మాత్రమే ఒక ఇంచి నీళ్లు పడ్డాయి. అది ఏటూ సరిపోకపోవడంతో మరోబోరు వేశా అందులో కొంత నీరు ఉన్నాయి. రెండు కలిపి నాలుగురోజు నుంచి నాలుగు ఎకరాలకు నీటితడి ఇస్తున్నాం. కరెంట్ అందుబాటులో ఉండడంతో ఎకరాకు సుమారుగా రూ.10వేల నుంచి రూ.20వేలు ఖర్చు అవుతుంది. అయినా వదలలేక తప్పక చేస్తున్నాం.

\- దామిరెడ్డి నాగేంద్రారెడ్డి, రైతు

ఈ ఏడాది రైతు కష్టం నెరవేరుతుందా..?

ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉంటాయి. పంటలు బాగా పండుతాయని ఆశిస్తున్నాం. కానీ రైతుల పరిస్థితి ఎప్పటికప్పుడు అగమ్యగోచరంగా మారుతోంది. గత ఏడాది ధరలు అనుకూలంగా ఉండడంతో కొంతమేర రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఈఏడాది సాగు బాగా ఉంది. వర్షాలు అనుకూలంగా లేవు. బోర్లు, జనరేటర్లు, కూలి ఖర్చులను అధికంగా ఖర్చుపెట్టి పొగాకు సాగు చేశాం. ఈఏడాది రైతు కష్టం నెరవేరుతుందో లేదో, అప్పులు ఎలా తీరుతాయోనన్న భయం అందరిలోనూ ఆందోళన కల్గిస్తోంది.

\- వెంకట్రావు, తలమళ్ల

వెలిగొండపై తప్పుడు ప్రచారం

- ఎన్నికల్లో మభ్యపెట్టేందుకు వైసీపీ కుట్ర
- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న నారాయణ

ఎర్రగొండపాలెం, జనవరి 31 : వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే పూర్తయినట్ల ప్రచారం చేస్తూ 2024 ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టడానికి వైసీపీ కుట్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. ఎర్రగొండపాలెం సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. 2023 అక్టోబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లిచ్చి, 2024 ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వస్తానని మార్కాపురం జరిగిన బహిరంగసభ లో చెప్పిన ముఖ్యమంత్రి మాట తప్పారన్నారు. 2024 ఫిబ్రవరిలో వచ్చినా నేటికీ పనులు పూర్తి కాలేదన్నారు. నీళ్లిచ్చే పరిస్థితి లేదని నారాయణ స్పష్టం చేశారు. ని ర్వాసితులు ముంపు గ్రామాల్లోనే ఇంకా ఉన్నారన్నారు. ఏదీ పూర్తి కాకుండా నీళ్లి స్తామని చెప్పడం, ప్రాజెక్టు పూర్తయిందని చెప్పడం ప్రజలను మోసగించడమే నని అన్నారు. హిందూమతాన్ని అడ్డుపెట్టుకొని మళ్లీ అధికారంలోకి రావాలని మోదీ ప్ర యత్నిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు మోదీ ని, జగన్‌రెడ్డిని ఓడించాలని ప్రజలను నారాయణ కోరారు. సమావేశంలో సీపీఐ ని యోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కార్యవర్గ సభ్యుడు కిష్టగౌడ్, కార్యదర్శులు గుర్నాథం, రామయ్య, విశ్వరూపాచారి పాల్గొన్నారు.

రేపు నూతన గోశాలకు శంకుస్థాపన


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 31 : మార్కాపురం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న గోశాలకు ఫిబ్రవరి 2వ తేదీన శంకుస్థాపన నిర్వహిస్తున్నట్లు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి గోశాల సేవా కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఛైర్మన్, గోశాల కమిటీ అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి రోడ్డులో చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన 1.79ఎకరాల స్థలాన్ని ఐదేళ్ల పాటు గోశాలకు లీజుకు ఇచ్చారని తెలిపారు. ఆలయాలకు చెం దిన గోవులతో పాటు బజారులలో తిరుగుతున్న గోవుల ను కూడా తరలిస్తామన్నారు. గోశాల అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. స మావేశంలో గోశాల సేవా కమిటీ ఉపాధ్యాక్షుడు పిన్నిక లక్ష్మీప్రసాద్, గుంటక వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుంటక వనజాక్షి, కార్యదర్శి ఐ.రంగస్వామి, జక్కి వాసు, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్థోమత లేనివారికి ఉచిత న్యాయం

అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి మేరీ సారాదానమ్మ


మాట్లాడుతున్న న్యాయాధికారి

గిద్దలూరు టౌన్, జనవరి 31 : ఏదైనా కేసులో న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమతలేని వారికి ఉచితంగా న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయవాదులను నియమిస్తామని అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బీ మేరీసారాదానమ్మ అన్నారు. బుధవారం గిద్దలూరు పట్టణంలోని సబ్ జైలును జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉన్న మగ, ఆడ ఖైదీల ఆరోగ్యం గురించి, వారి కేసు వివరాలను అడిగారు. భోజన వసతులు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మేరీసారాదానమ్మ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే తప్పులకు జైలుకు రావలసి వచ్చిందని, మీ కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇక నుంచి మంచి ప్రవర్తనతో ఉండాలన్నారు. కార్యక్రమంలో జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవీంద్రనాథ్, న్యాయవాదులు ఎం.పిచ్చయ్య, షేక్ ఫాజిల్, కె.జనార్దన్, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వీధిబాలల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని అర్బన్ కాలనీలో ప్యానల్ న్యాయవాదులు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలని సూచించారు. చదువుకు దూరంగా ఉన్న పిల్లలు ఉంటే తమకు తెలియచేయాలన్నారు.

ఉత్తమ అధికారులకు సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 31 : మార్కాపురంలో వివిధ రంగాల్లో సేవలందించి కలెక్టర్ ద్వారా ఉత్తమ అవార్డులు పొందిన అధికారులను రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, వీఆర్‌వో సుబ్బరామిరెడ్డి, దరిమడుగు సర్పంచ్ గోపాల్‌రెడ్డిను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి, ఆర్వీ సుబ్బారెడ్డి, టీవీ రామిరెడ్డి, కే.రమణారెడ్డి, కె.బలరాంరెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్‌గా శ్రీనివాసరావు

గిద్దలూరు, జనవరి 31 : గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా యూ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా నాయుడుపేట నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాసరావు బుధవారం గిద్దలూరు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించగా మున్సిపల్ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబును కమిషనర్ శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పని చేస్తానని కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

బంగారు భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించండి

- మాజీ ఎమ్మెల్యే కందుల
- ఆకట్టుకున్న తండ్రీ కొడుకుల ప్రచారం


బాబు ష్యూరిటీ కార్యక్రమంలో ప్రచారం నిర్వహిస్తున్న విఘ్నేష్‌రెడ్డి

పొదిలి, జనవరి 31 : రాష్ట్ర, యువత భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో 14, 15 వార్డుల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందులతోపాటు ఆయన తనయుడు విఘ్నేష్‌రెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విఘ్నేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో కి వచ్చిన వెంటనే మహిళల కోసం అమల చేసే పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. తల్లికివందనం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డ నిధి, బీసీ రక్షణచ ట్టం, తాగునీరు ద్వారా మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను పొందుపరిచారన్నారు. యువతకు పెద్దపీటవేయనున్నట్లు చెప్పారు. ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పి స్తారన్నారు. ప్రజలు విజ్ఞతతో రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని, మీ పిల్లల భవిష్యత్ కోసం సుపరిపాలన అందించే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని మహిళలకు వి జ్ఞప్తి చేశారు. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం నా త్రండి కందుల నారాయణరెడ్డిని భారీ మెజారిటీతో గెటిపించాలని విఘ్నేష్‌రెడ్డి కోరారు. అదే క్రమంలో వైసీపీ పాలనలో గ్రామ నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఎక్కడా అభివృద్ధి జరగలేదని, అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయాలను విఘ్నేష్‌రెడ్డి తనదైన శైలిలో ప్రజలకు ఆకట్టుకునేలా చెప్తూ ముందుకుసాగారు. జగన్‌రెడ్డి వచ్చాక దౌర్జన్యా లు, అవినీతి పెరిగిపోయిందన్నారు.

మరోపక్క కందుల నారాయణరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత టీడీపీ, ప్రస్తుత వైసీపీ పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. ఎన్నికల సమీపిస్తున్నందున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుల కోరారు. వైసీపీ అడ్డదారులు, కుట్రలను గమనిస్తుండాలన్నారు. మీ బిడ్డగా నన్ను, ప్రజలందరికీ భరోసా ఇచ్చేందుకు చంద్రబాబును అఖండ మెజారిటీతో గెలిపించాలని కందుల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కాసులకు కక్కుర్తిపడే వీఆర్వోలపై చర్యలు

సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధుల డిమాండ్


సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చిన్నకంభం సర్పంచ్ రసూల్

కంభం, జనవరి 31 : ప్రతి పనికీ ఓ రేటు కట్టి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న అవినీతి వీఆర్వోలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం కంభం ఎంపీడీవో సమావేశం హాలులో ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలువురు రెవెన్యూ అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నకంభం సర్పంచ్ రసూల్, కోఆప్షన్ సభ్యుడు సలీమ్ తదితరులు మాట్లాడుతూ చిన్నకంభం పంచాయతీ వీఆర్వో సమస్యలపై వచ్చే ప్రజల నుంచి డబ్బులు గుంజుతున్నారని ఆరోపించారు. ఈవిషయంపై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదన్నారు. పేదల దగ్గర ముక్కుపిండి లంచం తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. తక్షణం అతనిపై చర్యలు తీసుకోకవడమేకాక చిన్నకంభం పంచాయతీ నుంచి అతడిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఒక మహిళకు ఒకటిన్నర సెంట్ స్థలాన్ని ప్రభు త్వం కేటాయిస్తే ఆమె చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ స్థలం మొత్తాన్ని ఆక్రమించిందని, ఈవిషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చి ఆక్రమణలకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదు చేసినందుకు ఆ మహిళ నాపై కక్షగట్టి తనను లైంగికంగా వేధిస్తున్నారని కేసు పెట్టిందని సర్పంచ్ తెలిపారు. ఇలాంటి కేసులకు తాను బెదిరేవాడిని కానన్నారు. కంభం సర్పంచ్ బోడయ్య మాట్లాడుతూ అంబేద్కర్ భవనానికి కందులాపురం పంచాయతీలో స్థలం ఉందని, నిర్మాణానికి రూ.25లక్షలు నిధులు కూడా మంజూరయ్యాయని, ఆస్థలానికి పట్టా మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యానికి ఏర్పాటు చేసిన వాహనాలు ఎక్కడా సక్రమంగా తిరగడం లేదని, దీని వలన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ చిన్నకంభం వీఆర్వోపై ప్రజాప్రతినిధులైన మీరు జేసీకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కోఆప్షన్ మెంబర్ సలీమ్ మాట్లాడుతూ కంభం చెరువులో ఆరున్నర అడుగుల మేర నీరు ఉందని, ఇరిగేషన్ అధికారులు చెరువు నీటిని పంట కాలువల ద్వారా వృథాగా వదులుతున్నారని, ఆ నీరు అడుగంటిపోతే వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని, వెంటనే నీటి విడుదలను ఆపివేయాలని కోరగా ఇరిగేషన్ ఏఈ మాట్లాడుతూ తాము నీరు వదలడం లేదని, తూము గుండా లీకేజీ అవుతుందని, తూముల మరమ్మతులకు నిధులు లేవని తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఐసీడీఎస్, విద్యుత్‌శాఖ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు.

ఎంపీడీవోకు ఘన సన్మానం

కంభం ఎంపీడీవో ప్రసాద్ 31వ తేదీన ఉద్యోగ విరమణ చేస్తుండడంతో మండల సమావేశం అనంతరం మండల స్థాయి అధికారులు, ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, ఓబులరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు కొత్తపల్లి జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.

ఆక్రమణలు పెరుగుతుంటే చూస్తూ ఊరుకుంటారా..?

- వాటి ఆదాయం ఎవరికి
- మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ కొండయ్య సూటి ప్రశ్న


మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ .. సమస్యలపై నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్ కొండయ్య

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 31 : మార్కాపురం పట్టణంలో రోడ్లపై భారీగా ఆక్రమణలు వెలుస్తున్నాయని, వీటిపై ఎవరికి ఆదాయం వస్తుందని టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్ మున్సిపల్ సమావేశంలో సూటిగా ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం ఛైర్మన్ బాలమురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ.. పట్టణంలో రోడ్లపైనే బంకులను ఏర్పాటు చేసి, తోపుడు బండ్లు పెట్టి భారీగా ట్రాఫిక్ సమస్యలను కల్పిస్తున్నారని అన్నారు. సప్లై చానల్, కొచ్చెర్ల కోట కాలువలలో చెత్త తీయాలన్నారు. 5వ వార్డులోని రోడ్డుపై ఉన్న మరుగుదొడ్డి స్థలంలో షెడ్లు వేశారు. అవి ఉపయోగించకుండా ఎదురుగా బంకులు వేసుకున్నారని తెలిపారు. వైస్ ఛైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ పట్టణంలో విపరీతమైన దోమలు వ్యాధులు వ్యాపింపజేస్తున్నాయని, ఫాగింగ్ చేయించాలన్నారు. అభివృద్ధి పనులకు ఆదాయం లేదు అనే బదులు పట్టణంలో చాలా ఇళ్లకు పన్నులు వేయకుండా వదిలివేశారని, వెంటనే పన్నులు వేయాలన్నారు. పట్టణ ప్రణాళికా విభాగం పనితీరు అస్తవ్యస్తంగా మారిందన్నారు. కోఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి మాట్లాడుతూ.. మహిళలంటే నిర్లక్ష్యం బాగా కనిపిస్తుందని, మున్సిపల్ కౌన్సిల్‌లో సగానికి పైగా ఉన్న మహిళలకు వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయమంటే నేటికీ గతి లేదన్నారు. తాము ఉంటున్న 35వ వార్డు అంటే అతినిర్లక్ష్యం ఉందని, అభివృద్ధి పనులు చేయలేక రోడ్డు మీదకు వస్తే సిగ్గుపడాల్సిన పనులు ఏర్పడ్డాయన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ మొఘల్ సిరాజ్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు పిల్లలు, వ్యక్తులపై దాడిచేసి గాయపరుస్తున్న నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కోతుల బెడద అధికంగా ఉందని, ఆవులను గోశాలకు తరలించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ కుక్కలను పట్టుకొని అడవుల్లో వదిలి వేయాలంటే బ్లూ క్రాస్ అనే సంస్థతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వం స్నేహా అనే సంస్థకు కుక్కలకు సెరిలైజేషన్ చేసే కార్యక్రమం చేస్తుందన్నారు. పట్టణంలో కూడా ఈ విధానం అమలు చేస్తామన్నారు. వివిధ సమస్యలపై కౌన్సిలర్లు ప్రస్తావించారు.


ఆదిమూర్తిపల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న అశోక్‌రెడ్డి

సూపర్‌సిక్స్ పథకాలతో సంక్షేమం

మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 31 : సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలందరికీ సంక్షేమం అందించాలన్నదే చంద్రబాబు ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆదిమూర్తిపల్లి పంచాయతీలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి మానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. మహిళలకు కరపత్రాలను అందచేసి అవగాహన కల్పించారు. తెలుగుదేశం హయాంలో ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తే నేడు జగన్‌రెడ్డి నిరంకుశ విధానాలతో పాలిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు, రైతులకు, యువతకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టివేశారన్నారు. నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారని వైసీపీ వాళ్లు ఓట్లు అడగడానికి ప్రజల వద్దకు వస్తారని అశోక్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేనలకు ప్రజలు మద్దతు నిలువాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్నబోయిన అరుణ కుమారి, చెన్నబోయిన రామక్రిష్ణయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి దూదేకుల నరసింహులు, నాయకులు చింతంరెడ్డి పెద్దబుడ్డారెడ్డి, తిరుమల రెడ్డి, పర్వత మహేశ్వర్‌రెడ్డి, మార్తాల కొండారెడ్డి, నంద్యాల నాగిరెడ్డి, గానుగ పెంట రామయ్య, టీడీపీ నాయకులు కడియం శేషగిరి, కర్నాటి రామసుబ్బారెడ్డి, కుసుమాల మహానంది, గోపాలక్రిష్ణ, మందగిరి రంగస్వామి పాల్గొన్నారు.

మైనారిటీలంతా టీడీపీ అండగా ఉండాలి


అశోక్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న మైనారిటీ నాయకులు

మైనారిటీ సోదరులంతా తెలుగుదేశం పార్టీకి అండగా ఉండి వచ్చే ఎన్నికలలో పార్టీ విజయం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కోరారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో కంభం మండలం తురిమెళ్ళ గ్రామానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు అశోక్‌రెడ్డిని కలిసి తామంతా టీడీపీ వెంటే ఉంటామని అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షేక్ రసూల్, ఖాశింవలి, నీరుకంటి ఖాశింవలి, గోపానిపల్లి ఖాశింవలి, షేక్ తంగేళ్ల, చిన్నమస్తాన్ పాల్గొన్నారు.

పంటలకు నీటిని పొదుపుగా వాడుకోవాలి

మార్కాపురం రూరల్, జనవరి 31: పంటలకు నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలిని భూగర్భ జల శాఖ జాయింట్ డైరెక్టర్ కేఎస్ శాస్త్రి రైతులకు సూచించారు. పెద్దారవీడు వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం రైతులకు పంట నీరు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూగర్భ జల శాఖ జేడీ శాస్త్రి మాట్లాడుతూ రైతులు సాగుచేసే పంటలకు ఏ మేరకు నీటి అవసరమో గుర్తించి నీరు అందించాలని కోరారు. ఈ పంట ఎంత నీరు వినియోగించుకోగలదో అంత నీటిని మాత్రమే పైరుకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డిడిఏ భూగర్భ జల శాఖ రాజవర్ధన్ రెడ్డి, ఏపీడీ రోశమ్మ, ఏవో బుజ్జిబాయి, ఉద్యాన శాఖ అధికారి ఆదిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు

మార్కాపురం రూరల్, జనవరి 31 : ఉపాధి హామీ పనులలో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ శీనారెడ్డి హెచ్చరించారు. పెద్దారవీడు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. అవకతవకలు జరిగిన పనులను గుర్తించి పాల్పడిన వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. 2022, 23 ఆర్థిక సంవత్సరంలో 11825 జాబ్ కార్డులకుగాను 663 716 పని దినాలలో రూ.1226778000 పనులు జరిగినట్లు తెలిపారు. వీటిలో సుమారు రూ.3కోట్ల వరకు అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని తె లిపారు. విచారించి రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్ కుమార్, ఏపీడీ నిర్మలాదేవి, ఏపీవో అన్నపూర్ణ, ఎస్‌ఆర్‌పీ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలతో మేలు

గిద్దలూరు టౌన్, జనవరి 31 : సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరి ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య అన్నారు. పట్టణంలోని యాదవ బజారులో గల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సురక్ష ఫేజ్-2 వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కుటుంబంలోని ప్రతి వ్యక్తి అనారోగ్య లక్షణాలను గుర్తించి చికిత్స చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కమిషనర్ ఉయ్యాల శ్రీనివాసులు, వైసీపీ నాయకులు పరుచూరి నాగేశ్వరరావు, వైద్యులు షరీఫ్, భార్గవరెడ్డి పాల్గొన్నారు.

నాటకీయం..మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

- తొలుత బడ్జెట్‌ను ఆమోదించకుండా సమావేశం నుంచి బయటికి వెళ్లిన కొందరు సభ్యులు
- కాదు.. కాదు బడ్జెట్‌ను ఓకే చేశారంటూ ఛైర్మన్ సమర్థన

కనిగిరి, జనవరి 31 : కనిగిరిలో మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ ఆమోదం బుధవారం నాటకీయ పరిణామాల మధ్య జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 16కోట్ల 35లక్షల రూపాయల ఆదాయం, 15కోట్ల 55లక్షల ఖర్చుతో బడ్జెట్ అంచనాలు రూపొందించారు. గత వార్షిక ఆదాయం రూ.14కోట్లు ఉండగా, రాబోయే సంవత్సరంలో ఆదాయం రూ.15.32 కోట్లు ఉండొచ్చని అంచనా వేశారు. అందులో దాదాపుగా అత్యధిక శాతం వాటర్ సరఫరా కోసమే ఖర్చు అయిందని మున్సిపల్ ఛైర్మన్ గఫార్ నిరుత్సాహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ ఛైర్మన్ గఫార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వివిధ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు హాజరయ్యారు. బడ్జెట్‌లో అంశాలను మేనేజర్ ప్రసాద్ వివరించారు. ఇంతలో కౌన్సిలర్ రాజీవ్ కలుగజేసుకుని అజెండాలోని అంశాలను చదివి అర్థం చేసుకోవటానికే రెండు రోజులు పడుతుంది.. మంగళవారం రాత్రి అజెండా కాపీని అందజేస్తే ఎలా అని ఛైర్మన్‌ను ప్రశ్నించారు. దీనికి ఛైర్మన్ మౌనం వహించగా, ము న్సిపల్ మేనేజర్ కలుగు చేసుకుని నెల రోజులుగా అకౌంటెంట్ సెలవులో ఉన్నారని వివరించారు. అందువల్ల కౌన్సిల్ సభ్యులకు అ జెం డా అందించటంలో జాప్యం జరిగిందన్నారు. దీనిపై మున్సిపల్ వైస్ ఛైర్మన్ పులి శాంతి, కౌన్సిలర్లు శ్రీరామ సతీష్, దేవికి రాజీవ్ వాకౌట్ చేశారు. ఈ సమయంలో కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపో యి పెద్ద చర్చకు లేపడంతోపాటు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వాకౌట్ చేసిన కౌన్సిలర్లు ఛైర్మన్ చాంబర్‌లోకి వెళ్లి వచ్చాక మంత్రం వేసిన మాదిరిగా బడ్జెట్ ఆమోదించామని మీడి యా ఎదుట చెప్పారు. ఛైర్మన్ గఫార్ మాత్రం బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్లుగా సభ్యుల ముందే సంతకాలు చేశారని చెప్పడం కొసమెరుపు.

సందిగ్ధతకు కారణమైన వైసీపీ ఇన్‌చార్జి దద్దాల రాక

బడ్జెట్ ఆమోదించలేదని కొంతమంది, వ్యతిరేకించామని మరికొంత మంది కౌన్సిలర్లు, ఆమోదిస్తూ సంతకాలు చేశారంటూ మున్సిపల్ ఛైర్మన్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావులు మీడియాకు వివరిస్తున్నారు. ఈ సమయంలో వెలిగండ్ల, కనిగిరి జడ్పీటీసీలు గుంటక తిరుపతిరెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ వైఎం ప్రసాద్‌రెడిలతో ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో కొద్దిసేపు కార్యాలయం ఆవరణలో సందిగ్ధ వాతావరణం నెలకొంది. ఇన్‌చార్జి కార్యాలయానికి రావటంతో కౌన్సిల్ సభ్యులతో పాటు అధికారులు చూస్తుండిపోయారు. కౌన్సిలర్లను కలిసేందుకే దద్దాల నారాయణయాదవ్ కార్యాలయానికి వచ్చారని సమాచారం.

పోలేపల్లిలో ఆరు నెలల శిశువు కిడ్నాప్‌నకు యత్నం

అప్రమత్తమైన బంధువులు

పసికందును ఇంటివెనుక పడేసి పరారైన దుండగుడు

దొనకొండ, జనవరి 31 : ఇంటి వరండాలోని ఉయ్యాలలో పడుకున్న ఆరునెలల శిశువు అపహరణకు యత్నించిన ఘటన మండలంలోని పోలేపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన యద్దనపూడి చిన్నకొండయ్య, సోనియా దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె అయిన ఆరు నెలల శిశువును వరండాలోని ఉయ్యాలలో పడుకోబెట్టి తల్లి బయట కూర్చొని ఉంది. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి సందులో నుంచి వచ్చి ఉయ్యాల్లో పడుకొని ఉన్న శిశువును ఎత్తుకొని పరారయ్యే ప్రయత్నం చేస్తుండగా బాలిక ఏడ్చింది. వెంటనే తల్లి అటువైపు చూసి కేకలు పెట్టింది. వెంటనే దుండగుడు పాపను ఇంటి వెనుక పడేసి పరారయ్యాడు. వెంటనే తల్లి పరిగెత్తి పాపను తీసుకొని ఎటువంటి సంఘటన జరగకపోవటంతో ఊపిరిపీల్చుకుంది. బంధువులు దుండగుడిని పట్టుకునేందుకు వెంబడించగా ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. సమాచారం మేరకు దొనకొండ, త్రిపురాంతకం పోలీసులు గ్రామానికి చేరుకొని జరిగిన సంఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ



చెక్కును అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

తాళ్లూరు, జనవరి 31 : మహిళల కష్టాలు లేకుండా ఆర్థికంగా వృద్ధి చెందాలన్నదే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ చెప్పారు. స్థానిక వీకే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద విడుదలైన నాల్గో విడత చెక్కులను పంపిణీ చేశారు. వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు బూచేపల్లి కుటుంబం ఎప్పుడూ సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుభాషిణి, గ్రామ సర్పంచ్ చార్లెస్ సర్జన్, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యామర్తి ప్రభుదాసు, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, రామిరెడ్డి, మోషే, మండల జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఎల్ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీవో యుగకీర్తి, ఏపీఎం దేవరాజ్ పాల్గొన్నారు.

డుమ్మాకొట్టిన జడ్పీటీసీ, ఎంపీపీ

చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దిశెట్టి అనుచరులుగా ఉన్న కీలక నేతలు డుమ్మాకొట్టి దర్శిలో ఎమ్మెల్యే కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి, వైస్‌ఎంపీపీ ప్రియాంక నాగార్జునరెడ్డి, కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, రాష్ట్రహౌస్ వేర్ డైరెక్టర్ ప్రసాదరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు మంచాల వలసారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమణారెడ్డి, బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ సుమలత శ్రీకాంత్‌రెడ్డి తదితరులు దూరంగా వున్నారు. మండలస్థాయి అధికారులు కూడా ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు వారికి తెలియకుండా తేదీ నిర్ణయించి ఏదో మొక్కుబడిగా సమాచారం ఇవ్వటంతోనే దూరంగా ఉన్నట్లు తెలిసింది. కార్యక్రమానికి హాజరైన వైసీపీ శ్రేణులు కూడా రెండు గ్రూపులుగా ఎవరికి వారే అన్నట్లు వ్యవహరించటం చర్చనీయాంశమైంది. ఫ్లెక్సీలలో ఎమ్మెల్యే మద్దిశెట్టి ఫొటో వేయకపోవటం విమర్శలకు దారితీసింది.

నేడు నేరేడుపల్లిలో జయహో బీసీ సభ

పీసీపల్లి, జనవరి 31 : మండలంలోని నేరేడుపల్లిలో గురువారం టీడీపీ అధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య తెలిపారు. ముఖ్యఅతిధులుగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. బీసీలు, మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు

పామూరు, జనవరి 31 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం నిరంతరంగా ప్రజాపోరాటాలు చేపడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ చెప్పారు. స్థానిక సుందరయ్యభవన్‌లో పట్టణ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కమిటీ కార్యదర్శి కె. మాల్యాద్రి, షేక్ అల్లబక్ష్, సయ్యద్ గౌస్‌బాష, వై వీరనారాయణ, షేక్ ఖాశింసాహెబ్ పాల్గొన్నారు.

4న ఉగ్రతో ఆత్మీయ పరిచయ కార్యక్రమం

పామూరు, జనవరి 31 : మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి ఉగ్రన్న బాటలో నడుద్దాం అనే నినాదంతో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న ఆదివారం స్థానిక ఆర్యవైశ్య యంగ్‌మెన్ కల్యాణ మండపంలో ఉగ్రతో ఆత్మీయ పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుబ్బారావు తెలిపారు.

వెలిగొండ పూర్తి చేయకుండా జాతికి అంకితమా?

కనిగిరి, జనవరి 31 : వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా ఉందని జిల్లా సీపీఎం కమిటీ కార్యదర్శి జీవీ కొండారెడ్డి చెప్పారు. స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం పట్టణ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు పీసీ కేశవరావు, ఏడుకొండలు, శాంతకుమారి, ప్రసన్న, వెంకటమ్మ, ఎలీషమ్మ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం



దర్శిలో కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి



సింగనపాలెంలో హనుమంతరావుకు నివాళి అర్పిస్తున్న భువనేశ్వరి



గుంటిగంగలో నరసింహారావుభార్య ప్రసన్నలక్ష్మిని పరామర్శిస్తున్న భువనేశ్వరి

దర్శి నియోజకవర్గంలో నిజం గెలవాలి కార్యక్రమంలో నారా భువనేశ్వరి

చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలకు పరామర్శ

మృతుల కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేత

దర్శి, జనవరి 31 : తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని బాధిత కుటుంబానికి టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరీ ధైర్యం చెప్పారు. దర్శి పట్టణంలోని క్రిష్టియన్‌పాలేనికి చెందిన తురిమెళ్ల పరిశుద్ధరావు టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి జైలులో పెట్టినప్పుడు తట్టుకోలేక గుండెపోటుతో మృతిచెందాడు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి బుధవారం దర్శికి వచ్చారు. బాధితురాలు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు అధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు అక్కడకు చేరుకొని భువనేశ్వరి నిర్వహిస్తున్న నిజం గెలవాలి కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మాజీ ఎంపీపీలు ఫణిదెపు వెంకట్రామయ్య, పార్టీ మాజీ అధ్యక్షుడు బొట్ల కోటేశ్వరరావు, నేతలు గొర్రె సుబ్బారెడ్డి, దారం సుబ్బారావు, దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బొటుకు రమేష్, ఆ పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు స్టీవెన్, తలారి కోటయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ దేవతి మహానంద, నాయకులు సంగా తిరుపతిరావు, నారపుశెట్టి మధు, పారా గాలయ్య, తెలుగు మహిళా నాయకురాలు ఎం శోభారాణి, పుల్లలచెరువు చిన్నా, గుర్రం బాలకృష్ణ పాల్గొన్నారు.

సింగనపాలెంలో భువనేశ్వరి

ముండ్లమూరు, జనవరి 31 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన మండలంలోని సింగనపాలేనికి చెందిన బత్తిన హనుమంతరావు తల్లిదండ్రులైన అంజయ్య, సుబ్బాయమ్మ వారి కుటుంబ సభ్యులను చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం ఉదయం పరామర్శించారు. ముందుగా హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హనుమంతరావు మృతి పార్టీపరంగా, వ్యక్తి గతంగా తీవ్రనష్టం చేకూర్చిందన్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట ఎంఎల్‌సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యేలు నారపశెట్టి పాపారావు, బీఎస్ విజయకుమార్, దర్శి నియోజక వర్గ జనసేన పార్టీ నాయకులు గరికపాటి వెంకట్, నేతలు గోరంట్ల రవికుమార్, నాదెండ్ల బ్రహ్మం, మానం బ్రహ్మం, మందలపు వెంకటరావు, కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, మానం నరసింహారావు, సర్పంచ్‌లు గజ్జల సుబ్బారెడ్డి, నారాయణ స్వామి, ఎంపీటీసీ సభ్యులు పాలపర్తి సుబ్బారావు, మాలెంపాటి నరసింహారావు, మల్లికార్జునరావు, నాగమల్లి అంకమరావు, చాగంటి హనుమంతరావు, మానం నాగేశ్వరరావు, ఇందూరి పిచ్చిరెడ్డి, నిడమానూరి శ్రీనివాసరావు, జిల్లెలమూడి చౌదరి, ఏరేసు వెంకటేశ్వర్‌రెడ్డి, కుంటా నాగేశ్వరరావు, మేదరమెట్ల కొండలరావు, కోయ శివరామకృష్ణ, కందిమళ్ల శివ, సుంకర రాఘవరెడ్డి, దిరిశాల శ్రీనివాసరావు, ఆకుల శేషయ్య పాల్గొన్నారు. తొలుత భువనేశ్వరికి టీడీపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున రావటాన్ని చూసిన భువనేశ్వరి నేరుగా వారి వద్దకు వెళ్లి పలుకరించారు.



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకట్

తాళ్లూరు మండలంలో 'నిజం గెలవాలి యాత్ర'

తాళ్లూరు, జనవరి 31 : 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా బుధవారం నారా భువనేశ్వరి గుంటిగంగ సన్నిధిలో గల తేజా వృద్ధాశ్రమంలో ఉంటున్న టీడీపీ కార్యకర్త జంపాని నరసింహారావు భార్యను పరామర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపగిలి మరణించిన నరసింహారావు(72)భార్య ప్రసన్నలక్ష్మిని పరామర్శించారు. ఆమెకు రూ.3లక్షల సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శులు శాగం కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, మానం రమేష్‌బాబు, వృద్ధాశ్రమ నిర్వాహకుడు అంబటి వెంకటేశ్వరరెడ్డి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కూటాల ప్రసాద్, టీడీపీ నేతలు షేక్ కాలేషావలి, వేణుబాబు, పిన్నిక రమేష్‌బాబు, రావినూతల పరిశుద్ధరావు, ఐ.శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, రాచకొండ వెంకట్రావు, నేరెళ్ల కిషోర్, మెలికా అంజమ్మ, మారాబత్తుల సుజాత, అనపర్తి సుబ్బారావు, కుమ్మిత సుబ్బారెడ్డి, వీరనాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత గుంటిగంగాభవానీ అమ్మవారిని భువనేశ్వరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరికి టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భువనేశ్వరి చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు.

అనుచరులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

కాపాడుకునేందుకు ఎంతవరకైనా పోరాడతాం

తాను ఎమ్మెల్యేనన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలి

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి, జనవరి 31 : తమ అనుచరులను ఇబ్బందిపెట్టాలని చూస్తే సహించేది లేదని, వారిని కాపాడుకునేందుకు ఎంతదూరమైనా వెళ్తానని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ స్పష్టం చేశారు. దర్శి పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం ఆయన అనుచరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధిష్టానం తనకు ఎమ్మెల్యే సీటు ఇవ్వకపోయినప్పటికీ మరో రకంగా అవకాశం కల్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆ వార్త సీఎం జగన్ నుంచి కొద్ది రోజుల్లో వస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు. ఇక్కడ సీటు పొందిన వ్యక్తి అందరినీ కలుపుకుపోవాలని సూచించారు. కొంతమంది బిల్లులను ఆపే ప్రయత్నం చేస్తున్నారని, మరికొందరిపై తప్పుడు కేసులు పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇప్పటికీ ఎమ్మెల్యే అనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. గత 15 ఏళ్లుగా తనకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. దర్శికి వచ్చే ముందు ఆయన ముండ్లమూరు మండలం శంఖరాపురం నుంచి సుమారు 70 వాహనాల్లో ర్యాలీగా ఇక్కడకు వచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నేతలు మద్దిశెట్టి రవీంద్ర, శ్రీధర్, వాసు, ఏఎంసీ చైర్మన్ షకీలా, అమీన్‌బాష, తాళ్లూరు జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, తాళ్లూరు ఎంపీపీ వెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేణుగోపాల్‌కు మద్దతుగా భారీగా వెళ్లిన అభిమానులు

ముండ్లమూరు, జనవరి 31 : దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు మద్దతుగా మండలంలోని ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పలు వాహనాలు, కార్లలో, ద్విచక్ర వాహనాల్లో దర్శికి తరలి వెళ్లారు. మారెళ్ల నుంచి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కుంచాల నాగరాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అలా వెళ్లిన వారిలో మండల వైసీపీ కన్వీనర్ బిజ్జం వెంకటసుబ్బారెడ్డి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కుంచాల నాగరాజు, వైస్ ఎంపీపీ వేముల జానకి రామయ్య, సర్పంచ్‌లు జనమాల పిచ్చయ్య, నాగేంద్రం, వేముల శ్రీనివాసులు, నలమోలు వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరెడ్డి, బద్రి సుబ్బారెడ్డి, కుమ్మిత వెంకటరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మొదుళ్ల వెంకటసుబ్బారెడ్డి, మానం వెంకటరావు, అన్నపురెడ్డి భిక్షాలరెడ్డి, కట్టా చినవెంకంబొట్లు, గంగిరెడ్డి, దుగ్గినేని వెంకట్, అడపాల వెంకటేశ్వర్లు, రవ్వారం గజ్జల రామముసలారెడ్డి, పుల్లంశెట్టి నరేష్, మేడికొండ శేషగిరి, గోపనబోయిన పిలిప్ రాజు, గురవయ్య ఉన్నారు.

టీడీపీలోకి వలసల ప్రవాహం

వైసీపీని వీడుతున్న నేతలు, వారి కుటుంబాలు

ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిక




ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వెలిగండ్ల మండల ప్రజలు

కనిగిరి, జనవరి 31 : నియోజకవర్గంలో టీడీపీలో వలసల పరంపర ప్రవాహంలా కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిపై అభిమానంతోపాటు, తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కార్యక్రమాలపై ఆకర్షితులై 10 రోజులుగా వైసీపీ నేతలతో పాటు, వివిధ మండలాల్లోని గ్రామాలకు చెందిన వందలాది మంది డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం డాక్టర్ ఉగ్ర సమక్షంలో తాజాగా వెలిగండ్ల మండలంలోని రామాగోపాలపురం, పందవ నాగులవరం, మోటుపల్లిలకు చెందిన వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి పెద్ద ఎత్తున టీడీపీలో చేరాయి. వారి మెడలో టీడీపీ కండువాలు వేసి డాక్టర్ ఉగ్ర సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక పురోగతికి బాటలు వేశారని గుర్తు చేశారు. చేతి వృత్తులు చేసుకునే వారికి ఉచితంగా పనిముట్లు అందించారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నాయీ బ్రాహ్మణులకు ఎలాంటి మేలు జరగకపోగా, రకరకాల పన్నుల రూపంలో, నిత్యావసర ధరలు పెంపు, రవాణా, కరెంటు చార్జీలు పెంపు రూపంలో వారి నెత్తిన మోయలేని భారం మోపారని డాక్టర్ ఉగ్ర విమర్శించారు. పార్టీలో చేరిన వారిలో ఎస్ నాగయ్య ఎస్ శ్రీనివాసులు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, సోమనపల్లి పెద్దశ్రీనివాసులు, వెంకటరత్నం, వెంకటేశం, ఏడుకొండలు, నాసరయ్య, దేవరపల్లి నరేంద్రబాబు, సుధాకర్, రమణయ్య, శివన్నారాయణ, నరేష్ చేరారు.

బీసీలకు రాజ్యాధికారం ఇచ్చింది టీడీపీనే

ముఖాముఖిలో ఉగ్ర నరసింహా రెడ్డి



మాట్లాడుతున్న ఉగ్ర

వెలిగండ్ల, జనవరి 31 : బీసీలకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్రం ఇచ్చింది అన్న ఎన్టీఆర్. బీసీలకు పుట్టినిల్లు టీడీపీ అని నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టరు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. వెలిగండ్ల బీసీ కాలనీలో బీసీ సామాజికవర్గ ప్రతినిధులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించింది టీడీపీ అని, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది ఒక్క టీడీపీ మాత్రమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శ్యామల కాశిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు మౌలాలీ, గవదకట్ల మాలకొండయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మల్లెబోయిన మీరాకుమారి, జిల్లా ఎస్సీసెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, కర్నాటి భాస్కర్ రెడ్డి, నేతలు మీనిగ కాశయ్య, మెటాటి సుబ్బారెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, ఒంగోలు శ్రీను, కృష్ణారావు, వెంకటేశ్వర్లు, మజహర్, బైసాని సుబ్రమణ్యం, నరేంద్ర, కోటిరెడ్డి, మాలకొండారెడ్డి, అక్కి శ్రీను పాల్గొన్నారు

ఒకరికి బదులుగా మరొకరు!

న్యాయాధికారికి దొరికిపోయిన నకిలీ జామీనుదారులు

ఒంగోలు లాయర్‌సహా.. నలుగురిపై కేసు

కనిగిరి, జనవరి 31: ఒకరికి బదులు మరొకరు జామీనుదారులుగా హాజరై.. న్యాయాధికారికి దొరికిపోయిన సంఘటన ప్రకాశం జిల్లా కనిగిరి జూనియర్ సివిల్ కోర్టులో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో న్యాయవాదితోపాటు జామీనుదారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసుకు సంబంధించి గతంలో ఒంగోలు ఒకటో అదనపు జిల్లా న్యాయాధికారి బెయిల్ మంజూరు చేశారు. ఆ కేసులో జామీనుదారులుగా గుంటూరు జిల్లాకు చెందిన షేక్ జానీ, వేముల శ్రీనివాసులు, కోటేశ్వరమ్మ, కమలమ్మ ఉన్నారు. వీరిని ఒంగోలుకు చెందిన లాయర్ కృష్ణారావు తన గుమస్తా ద్వారా కనిగిరి కోర్టులో హాజరుపరిచారు. కేసుకు సంబంధించిన జామీనుదారుల పత్రాలను గుమస్తా కోర్టుకు సమర్పించారు. వాటిని పరిశీలించిన న్యాయాధికారి భరత్‌చంద్రకు అనుమానం వచ్చింది. దీంతో జామీనుదారుల్లో ఒకరైన జానీని న్యాయాధికారి ప్రశ్నించగా.. ఆ జామీను పత్రాలు తనవి కావని, తాను కేవలం వేలిముద్రలు మాత్రమే వేశానని అంగీకరించాడు. దీనిని గమనించిన మిగతా ముగ్గురు నకిలీ జామీనుదారులు కోర్టు హాలు నుంచి బయటకు ఉడాయించారు. నకిలీ జామీనుదారులపై కోర్టు సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఒంగోలుకు చెందిన లాయర్ కృష్ణారావుతోపాటు నలుగురు జామీనుదారులపైనా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

8న ముక్కు కవిత గోశాల ప్రారంభం



గోశాల లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కవిత

పామూరు, జనవరి 31 : టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని మోట్రావులపాడులో డాక్టర్ ముక్కు కవిత గోశాలను ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మెడబలిమి వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని జననీ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ముక్కు కవిత వైద్యశాలలో గోశాలకు సంబంధించిన లోగోలను ఆమె బుధవారం ఆవిష్కరించారు. 8న జరిగే గోశాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. పామూరుకు చెందిన తుమ్మా కొండారెడ్డి, ఆవుల నరసింహారావు, ఉండేల పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఆనంద ఆశ్రమానికి నీటి సమస్యను తీర్చిన బూచేపల్లి


దొనకొండ, జనవరి 31 : స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్రమానికి ఎదురైన నీటి సమస్యను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తమ ట్రస్టు ద్వారా బుధవారం పరిష్కరించారు. ఆశ్రమంలో ఉన్న బోరులో నీరు అడుగంటడంతో నీటి సమస్య తీవ్రమైంది. ఈ సమస్యను ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఆశ్రమానికి బోరు బండిని పంపి బోరు వేయించటంతో పాటు అందుకు అవసరమైన విద్యుత్తు మోటారు, గోవులకు ఒక లారీ వరిగడ్డిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, మండల వైసీపీ మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, దగ్గుల చిన్నమంగిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు టీషర్టులు అందజేత

దొనకొండ, జనవరి 31 : దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలకు 34 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఒంగోలు యూనిట్ వారు నూతనంగా మంజూరు చేసిన టీ షర్టులను విద్యార్థులకు ఎంఈవో సాంబశివరావు గురువారం అందజేశారు. దొనకొండ జడ్పీ పాఠశాల ఏర్పడిన ఇన్నేళ్లకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరు కావటంపై ఎంఈవో ఆనందం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, పీడీ నరసింహారావులను అభినందించారు.

ఉగ్ర గెలుపులో అందరూ భాగస్వామ్యం కావాలి

పామూరు, జనవరి 31 : వైసీపీ అవినీతి, అరాచక పాలనతో విసిగెత్తిన ప్రజలు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గెలుపులో పాత, కొత్త నేతలందరూ కీలకపాత్ర పోషించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని పాబోలువారిపల్లిలో జరిగిన కార్యక్రమంలో పామూరు మాజీ ఎంపీపీ ఆవులతో బుధవారం ముచ్చటించారు. బొట్లగూడూరు, పామూరులో పలువురు బీసీ సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్నారని వివరించారు. ఆవులను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కమిటీ రాష్ట్ర కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, అవులూరి మురళి, ఉప్పుటూరి రాజశేఖర్‌లు ఉన్నారు.



తహసీల్దార్ల బదిలీలు

- ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీలు
- తక్షణమే రిలీవింగ్ చేయాలని కలెక్టర్లకు సీసీఎల్‌ఏ ఆదేశం
- బదిలీపై వచ్చేవారిని విధుల్లోకి చేర్చుకుని పోస్టింగ్‌లు కల్పించాలి

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ప్రస్తుతం పని చేస్తున్న జిల్లాలో మూడేళ్లుగా కొనసాగుతున్న తహసీల్దార్లను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం బదిలీ చేసింది. అలానే మాతృ జిల్లాకు చెందిన వారిని కూడా వేరే జిల్లాలో నియమించింది. ఉద్యోగ విరమణకు మరికొన్ని నెలలు మాత్రమే ఉన్న వారిని మాత్రం నిబంధనల మేరకు జిల్లాలోనే కొనసాగిస్తూ సీసీఎల్‌ఏ ఇన్‌చార్జి అధికారి ఏఎండీ ఇంతియాజ్ ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఈ బదిలీలు జోన్-3 పరిధిలో జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా తహసీల్దార్లను ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు, ఆ జిల్లాల తహసీల్దార్లను గుంటూరుకు బదిలీ చేశారు. ఆ విధంగా తహసీల్దార్ స్థాయి అధికారులు ఎల్ జానకిదేవి (కలెక్టరేట్), వీ కోటేశ్వరరావు(వెల్దుర్తి), జీ కేశవనారాయణ(కర్లపాలెం) ప్రస్తుత స్థానాలను నిలుపుకున్నారు. తహసీల్దార్లు పీ నగేష్(గుంటూరు తూర్పు), పీ రత్నం(పెదకాకాని), బొప్పరాజు వెంకటేశ్వర్లు(భూ సంస్కరణలు), ఎండీ అఫ్రషున్నిసా బేగం(రాజుపాలెం), డీ కవిత (బాపట్ల), ఎం ప్రమీల(నగరం) బాధ్యతలు చేపట్టి మూడేళ్ల లోపే కావడం వలన వీరిని అలానే కొనసాగించాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి. ఆయా జిల్లాల కలెక్టర్లు తక్షణమే బదిలీ చేసిన తహసీల్దార్లను రిలీవింగ్ చేసి ట్రాన్స్‌ఫర్‌పై వచ్చేవారిని విధుల్లోకి చేర్చుకుని మండలాలు కేటాయించాల్సిందిగా సీసీఎల్‌ఏ ఆదేశించింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ జిల్లా
ఫణీంద్రబాబు	తాడికొండ	బాపట్ల
శ్రీకాంత్	పొన్నూరు	ప్రకాశం
జీ సిద్ధార్థ	ప్రత్తిపాడు	ప్రకాశం
కే సాంబశివరావు	గుంటూరు పశ్చిమ	తిరుపతి
మెహబూబ్ సుభాని	పెదనందిపాడు	బాపట్ల
కే మల్లేశ్వరి	దుగ్గిరాల	బాపట్ల
జీ నాంచారయ్య	కొల్లిపర	తిరుపతి
డీ పద్మనాభుడు	ఫిరంగిపురం	ప్రకాశం
కే రవిబాబు	తెనాలి	నెల్లూరు
కే నాసరయ్య	వట్టిచెరుకూరు	బాపట్ల
కే శ్రీనివాసశర్మ	మేడికొండూరు	తిరుపతి
కే కల్యాణి	తుళ్లూరు	తిరుపతి
జే ప్రసాదరావు	కాకుమాను	ప్రకాశం
ఎం నాగిరెడ్డి	తాడేపల్లి	ప్రకాశం
కే చక్రవర్తి	పిడుగురాళ	ప్రకాశం
జీ కరుణకుమార్	దాచేపల్లి	తిరుపతి
ఎం డానియేల్	గురజాల	ప్రకాశం
జీ రమేష్‌కుమార్	దుర్గి	ప్రకాశం
షేక్ మహ్మద్ హుస్సేన్	మాచర్ల	ప్రకాశం
బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్	మాచవరం	తిరుపతి
కే పుల్లారావు	రెంటచింతల	తిరుపతి
జీ శ్రీనివాస్	కారంపూడి	తిరుపతి
ఎన్ దుర్గేశ్వరరావు	బెల్లంకొండ	నెల్లూరు
ఎస్ సురేష్	సత్తెనపల్లి	ప్రకాశం
జీ విజయశ్రీ	అమరావతి	ప్రకాశం
ఎం క్షమారాణి	పెదకూరపాడు	నెల్లూరు
ఎం భవానీశంకర్	ముప్పాళ్ల	ప్రకాశం
పీ సునీత	రొంపిచర్ల	నెల్లూరు,
కే నగేష్	ఈపూరు	నెల్లూరు
జీ సుజాత	చిలకలూరిపేట	ప్రకాశం
ఏవీ రమణ	నాదెండ్ల	నెల్లూరు
నాగమల్లేవ్వరరావు	యడ్లపాడు	నెల్లూరు
జే మధుబాబు	నూజెండ్ల	ప్రకాశం
బీ కిరణ్‌కుమార్	వినుకొండ	ప్రకాశం
సీహెచ్ రమాదేవి	అచ్చంపేట	నెల్లూరు
ఏవీ సుధాకర్	బొల్లాపల్లి	ప్రకాశం
టీ మస్తాన్ డీఏవో,	సత్తెనపల్లి	ప్రకాశం
ఆర్ యశోధ	పల్నాడు కలెక్టరేట్	ప్రకాశం
కే సుజాత	బాపట్ల కలెక్టరేట్	ప్రకాశం
పీ మెహర్‌కుమార్	అమర్తలూరు	బాపట్ల
డీ వెంకటేశ్వరరావు	భట్టిప్రోలు	బాపట్ల
బీ వెంకటేశ్వర్లు	చెరుకుపల్లి	నెల్లూరు
ఏ శ్రీనివాసరావు	కొల్లూరు	బాపట్ల
డీ మల్లికార్జునరావు	రేపల్లె	ప్రకాశం
కే రవికుమార్	చుండూరు	నెల్లూరు
డీ నాగరాజారావు	వేమూరు	తిరుపతి
సుశీల	కొరిశపాడు	నెల్లూరు
పీ సురేష్‌బాబు	మార్టూరు	నెల్లూరు
టీ రవి	ప్రకాశం	పల్నాడు
నారాయణరెడ్డి	ప్రకాశం	బాపట్ల
ఎస్ వెంకటేశ్వర్లు	ప్రకాశం	పల్నాడు
కేఎస్‌ఆర్ కృష్ణారావు	డీఏవో, ఒంగోలు	పల్నాడు
బీ జయవర్ధన్	కనిగిరి	పల్నాడు
పీ మధుసూదనరావు	చీమకుర్తి	గుంటూరు
ఎస్ ఉషారాణి	జరుగుమల్లి	పల్నాడు
పీ సింగారావు	కొండెపి	పల్నాడు
బీవీ రమణారావు	కొత్తపట్నం	పల్నాడు
ఎండీ నయీంఅహ్మద్	ముండ్లమూరు	పల్నాడు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ జిల్లా
జీ రజనికుమారి	మద్దిపాడు	పల్నాడు
సీహెచ్ ఉష	సింగరాయకొండ	పల్నాడు
కే సంజీవరావు	టంగుటూరు	నెల్లూరు
కే వెంకటేశ్వరరావు	దర్శి	గుంటూరు
ఎం సువర్ణ	దొనకొండ	పల్నాడు
వీ పుల్లారావు	హెచ్‌ఎంపాడు	బాపట్ల
ఎల్ లక్ష్మీనారాయణ	కనిగిరి	పల్నాడు
ఎం జ్వాల నరసింహం	కురిచేడు	పల్నాడు
ఎం హరిబాబు	మర్రిపూడి	పల్నాడు
కే ప్రవీణ్‌కుమార్	పీసీపల్లి	పల్నాడు
అశోక్‌కుమార్‌రెడ్డి	పొదిలి	పల్నాడు
ఎం శ్రావణ్‌కుమార్	పొన్నలూరు	బాపట్ల
ఎన్ వాసు	వెలిగొండ	నెల్లూరు
డీవీబీ వరకుమార్	బెస్తవారిపేట	పల్నాడు
పీ శైలేంద్రకటమార్	కంభం	నెల్లూరు
డీ సీతారామయ్య	గిద్దలూరు	బాపట్ల
బీ రమాదేవి	కొమరోలు	నెల్లూరు
డీ మంజునాథరెడ్డి	మార్కాపురం	పల్నాడు
వీ కిరణ్	త్రిపురాంతకం	బాపట్ల
కే రవీంద్రరెడ్డి	యర్రగొండపాలెం	గుంటూరు
జీ దిలీప్‌కుమార్	రాచర్ల	పల్నాడు
జే ప్రభాకరరావు	చీరాల	పల్నాడు
ఎస్ వెంకటరత్నం	కారంచేడు	నెల్లూరు
పీ బ్రహ్మయ్య	ఇంకొల్లు	పల్నాడు
పీ పార్వతి	చినగంజాం	గుంటూరు
కే రవిబాబు	బల్లికురవ	గుంటూరు
ఆర్ బ్రహ్మయ్య	ఉలవపాడు	బాపట్ల
టీ శ్రీనివాసులు	కందుకూరు డీఏవో	గుంటూరు
షేక్ మహ్మద్ హుస్సేన్	కావలి డీఏవో	పల్నాడు
ఎస్ రామ్మోహన్‌రావు	దుత్తలూరు	పల్నాడు
కే నెహ్రూబాబు	నిజాంపట్నం	నెల్లూరు
కే చంద్రశేఖర్	అల్లూరు	పల్నాడు
డీ శ్రీరామకృష్ణ	కలిగిరి	పల్నాడు
వెంకటరమణరావు	జలదంకి	పల్నాడు
వై నాగరాజు	సంగం	బాపట్ల
పీ లక్ష్మీనరసింహం	అనుమసముద్రంపేట	పల్నాడు
చొప్పా రవీంద్రబాబు	వింజమూరు	బాపట్ల
ఎస్ శ్రీనివాసులురెడ్డి	ఉదయగిరి	గుంటూరు
ఏ నిర్మలానందబాబా	నెల్లూరు అర్బన్	బాపట్ల
సీహెచ్ సుబ్బయ్య	ఇందుకూరుపేట	బాపట్ల
ఈ రమాదేవి	కొడవలూరు	గుంటూరు
వీ సుధీర్	బుచ్చిరెడ్డిపాలెం	గుంటూరు
ఎన్ శ్రీనివాసులు	సైదాపురం	గుంటూరు
ఐ మునిలక్ష్మి	చిల్లకూరు	బాపట్ల
ఎన్ మస్తానయ్య	చిట్టమూరు	గుంటూరు
కే జయజయరావు	తడ	గుంటూరు
కే రాజ్యలక్ష్మి	నెల్లూరు	గుంటూరు
సూర్యనారాయణసింగ్	గిద్దలూరు	గుంటూరు
షేక్ షఫీమాలిక్	నెల్లూరు ఏవో	గుంటూరు
టీ విజయకుమార్	నెల్లూరు కలెక్టరేట్	గుంటూరు
జీ రాఘవేంద్రరావు	నెల్లూరు కలెక్టరేట్	గుంటూరు
పీ శాంతకుమారి	నెల్లూరు కలెక్టరేట్	గుంటూరు
పీ శ్యామలమ్మ	నెల్లూరు కలెక్టరేట్	బాపట్ల
కే స్ఫూర్తి	నెల్లూరు కలెక్టరేట్	బాపట్ల
పీ విజయకుమార్	నెల్లూరు	బాపట్ల
ఎం సుభద్ర డీఏవో,	ఆత్మకూరు	బాపట్ల
పీ అనురాధ	ఎల్ఏ కేఆర్‌టీపీఎస్	బాపట్ల
పీ గీతావాణి	డీఏఈవో సూళ్లూరుపేట	పల్నాడు

రోడ్డు ప్రమాదం.. గంజాయి గుట్టురట్టు

- సీలేరు నుంచి హైదరాబాద్‌కు బైకులపై తరలించే యత్నం
- తిమ్మాపురం వద్ద అదుపు తప్పి పడిపోయిన యువకులు
- గంజాయి ప్యాకెట్లను గుర్తించి పోలీసులకు స్థానికుల సమాచారం
- భారీగా గంజాయి స్వాధీనం.. పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు



తిమ్మాపురం(యడ్లపాడు), జనవరి 31: గంజాయి రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో కార్లు లేదా భారీ వాహనాల్లో ఏదో ఓ మూలన దాచి తరలించేవారు. పోలీసులు, సెబ్ అధికారుల తనిఖీలు అధికం కావడంతో అక్రమార్కులు కొత్త పంథాను ఎంచుకున్నారు. ద్విచక్రవాహనాలపై కిలోల కొద్దీ గంజాయిని అనుకున్న చోటికి అనుకున్న ప్రాంతానికి యథేచ్ఛగా తరలిస్తున్నారు. అందుకు ద్విచక్రవాహనాలను బాగా నడపగలిగిన 18 నుంచి 25 ఏళ్ల యువకులను వాడుకుంటున్నారు. యథేచ్ఛగా జరుగుతున్న గంజాయి రవాణా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంతో వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా సీలేరు నుంచి హైదరాబాద్‌కు రెండు ద్విచక్రవాహనాలపై శివ, శంకర్ అనే యువకులు ట్రావెల్ బ్యాగులలో గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో తిమ్మాపురం ఎస్సీ కాలనీ సమీపంలోకి రాగానే ఓ వాహనం వీరి బైకులకు అడ్డంగా వచ్చింది. దీనితో ముందు వెళుతున్న యువకుడు సడన్ బ్రేకు వేయగా వెనుకగా వస్తున్న మరో యువకుడు ఆగిన బైక్‌ను ఢీ కొట్టాడు. దీంతో బైక్‌లు, గంజాయి ఉన్న బ్యాగులతోపాటు యువకులు ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. స్థానికులు యువకులను, బైక్‌లను లేపి బ్యాగులను ద్విచక్రవాహనాలపై పెడుతుండగా ఓ బ్యాగు నుంచి ఓ ప్యాకెట్ కింద పడింది. ప్యాకెట్‌ను పరిశీలించిన వారు దానిని గంజాయిగా గుర్తించి అక్కడే ఉన్న హైవే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఏడు బ్యాగుల్లోని గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకుల్ని అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ బలరాంరెడ్డి అక్కడికి చేరుకుని రెండు కేజీల చొప్పున గంజాయిని ప్యాక్‌చేసిన 49 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

మరో ఇద్దరు...

శ్రీకాకుళం నుంచి నలుగురు యువకులు గంజాయి బ్యాగులను తీసుకుని హైదరాబాద్‌కు బయలుదేరినట్లు పట్టుబడిన యువకులు పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. జీపీఎస్ ద్వారా హైవే మీద ప్రయాణిస్తూ వచ్చిన యువకులు నలుగురు విజయవాడ వద్ద చీలిపోయినట్లు తెలుస్తోంది. ఒకరు విజయవాడ నుంచి నేరుగా హైదరాబాద్ వెళ్లగా పట్టుబడిన ఇద్దరు యువకులు చిలకలూరిపేట వైపు వచ్చి రోడ్డు ప్రమాదానికి గురైనట్లుగా తెలుస్తోంది. మరో యువకుడు వీరిని అనుసరించే వచ్చాడని అయితే అతడు ఎటు వెళ్ళిందీ తెలియరాలేదు.

వంటోళ్లే వార్డెన్లు

వంట పని చేసే వారే వార్డెన్లు.. కొన్నేళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులే దిక్కు.. ఇష్టారీతిన నియామకాలు.. బదిలీలు.. బిల్లుల డ్రా.. ఒక పద్ధతి లేకుండా గిరిజన వసతిగృహాల్లో పరిస్థితి ఇష్టారాజ్యంగా ఉంది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న గిరిజన విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాల్సిన గిరిజన సంక్షేమ శాఖ అదేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. అందినకాడికి దోచుకునే కేంద్రాలుగా గిరిజన హాస్టళ్లను అధికారులు చూస్తోన్నారన్న విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. రెగ్యులర్ నియామకాలు జరపకుండా ఖాళీలు చూపిస్తే ఉద్యోగులు వస్తారని కాంట్రాక్టు ఉద్యోగులతో పలు హాస్టళ్లను నడుపుతుండటంపై కూడా పలు ఆరోపణలున్నాయి. ఏకంగా ఏసీబీ అధికారులు దాడులు చేసి అవినీతి, అక్రమాలను గుర్తించినా సంబంధిత అధికారులపై చర్యలు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- గిరిజన హాస్టళ్లలో ఇష్టారాజ్యం
- అక్రమ నియామకాలు.. అడ్డదిడ్డంగా బదిలీలు
- ఖాళీలు చూపకుండా కాంట్రాక్టు ఉద్యోగులతో సరి
- లేని విద్యార్థులను ఉన్నట్లు చూపించి బిల్లులు డ్రా
- ఏసీబీ దాడులు జరిగినా చర్యలు శూన్యం

గుంటూరు సిటీ, జనవరి 31:

నేను గుంటూరు హాస్టల్లో లేను. అయినా అక్కడ ఉంటున్నట్లు రికార్డుల్లో చూపి డబ్బులు డ్రా చేస్తున్నారు.
- ముడవత్ హనుమానాయక్, బాణవత్ శంకర్‌నాయక్

తెనాలిలోని గిరిజన వసతి గృహానికి మా దుకాణం నుంచి సరుకులు పంపలేదు. నేను ఎలాంటి సరుకులను ఆ హాస్టల్‌కి విక్రయించలేదు.
- గుంటూరు కలెక్టర్‌కి బెల్లంకొండలోని ఓ దుకాణ యజమాని నివేదన

ఇలాంటి వెలుగుచూసిన ఎన్నో అక్రమాలు, అవినీతి చర్యలతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గోల్డ్‌మెడల్ సాధించింది. అడిగినంత ముట్టజెబితే చాలు వంట మాస్టర్లు, కమాటీలు కూడా వార్డెన్లు అవుతున్నారు. అడిగే వారు లేరన్నట్లు చెలరేగి పోతున్న కొందరు అధికారులు ఎవరి అనుమతి లేకుండానే ఉద్యోగాలు (అవుట్సోర్సింగ్) ఇచ్చేస్తున్నారు. ఉద్యోగుల బదిలీల్లో నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలి అక్రమాలకు తెరలేపారు. ఎప్పుడో చదువుకుని వెళ్లిపోయిన విద్యార్థుల పేర్లు ఇప్పటికీ అటెండెన్స్ రిజిస్టర్‌లో చూపించి లక్షల రూపాయలు నిధులు డ్రా చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఇటువంటి ఉద్యోగులను చివరకు ఏసీబీ పట్టుకుని కేస్ రిజిస్టర్ చేసిన తర్వాత కూడా వారిపై ఏవిధమైన చర్యలు చెప్పట్టకపోవటం గమనార్హం. వాస్తవానికి వార్డెన్ ఉద్యోగం కోసం కొన్ని అర్హతలు నిర్ణయించారు. గిరిజన సంక్షేమ శాఖలో అవేవీ లేకుండానే కొందరు కేర్‌టేకర్ పేరుతో వార్డెన్లుగా చెలామణి అవుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నాగార్జున సాగర్, బాపట్ల, నరసరావుపేట, వినుకొండ తదితర ప్రాంతాల్లోని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో కేర్ టేకర్లు ఉన్నారు. వారి పర్య వేక్షణలోనే ఆ వసతి గృహాలు నడుస్తున్నాయి. వీరంతా గతంలో ఆయా ప్రాంతాల్లో కమాటీలు, వాచ్‌మన్లు, వంటవారిగా పనిచేసిన వాళ్లే. కొంత భాగం వారికి ఉద్యోగోన్నతులు ఇ వ్వాల్సి ఉన్నా తగిన అర్హ తలు కూడా ఉండాలి. అయితే తగిన అర్హతలు లేకుండానే అడ్డదారిలో కొందరికి ఉద్యోగో న్నతలు ఇచ్చి, వసతి గృహాలు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రెగ్యులర్ ఖాళీలు చూపిస్తే ప్రభుత్వం నియామకాలు చేపట్టిన పుడు కొత్త వారు వచ్చే అవకాశం ఉంది. ఆ పని చేయకపోవడంతో చిలకలూరిపేట, పిడుగురాళ్ల, ఈపూరు తదితర ప్రాంతాల్లో దశాబ్దకాలంగా కాంట్రాక్టు ఉద్యోగులే వార్డెన్లుగా ఉంటున్నారు. వీటి వెనుక ఉన్నతాధికారుల లాభాపేక్ష ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి సంవత్సరం రెన్యూవల్ పేరుతో ఒక్కొక్కరు రూ.లక్ష వరకు ముట్టచెపుతు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి బదిలీలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన గుంటూరులో జరగాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా నరసరావుపేటలో జరపడంపై సీఐడీకి ఫిర్యాదులు వెళ్లాయి. అక్కడ చక్రం తిప్పిన ఓ అధికారి కొందరు ఉద్యోగులను వారు కోరుకున్న చోటకి బదిలీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు ఉద్యోగులు జీతాలు ఒక చోట తీసుకుని, ఉద్యోగం మరొక చోట చేస్తుండటం వివాదాస్పదమైంది. గిరిజన సంక్షేమ శాఖలో కొన్ని ఉద్యోగాలు భర్తీ ప్రక్రి య వివాదాస్పదమైంది. సాధారణం గా ఉద్యోగాల భర్తీకి ఉమ్మడి జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వాలి. ఉమ్మడి జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండానే పల్నాడులో ఇద్దర్ని ఉపాధ్యాయు లుగా, ఇద్దర్ని వంట వారిగా నియమించారు. ఇవన్నీ అక్కడి గిరిజన సంక్షేమశాఖాధికారి ఆధ్వర్యంలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గుంటూరులోని గిరిజన హాస్టల్లో తాను లేనప్పటికీ ఉంటున్నట్లు రికార్డుల్లో చూపించి డబ్బులు డ్రా చేస్తున్నారని ముడవత్ హనుమానాయక్ అనే డిగ్రీ విద్యార్థి ఈ నెల 11న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. బాణవత్ శంకర్ నాయక్ అనే మరో విద్యార్థి కూడా ఇదేవిధంగా ఫిర్యాదు చేశాడు. గుంటూరులోని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహంపై ఏసీబీ అధికారులు 2023 జూలై 7న దాడులు నిర్వ హించారు. అక్కడ విద్యా ర్థులు లేకుండానే ఉన్న ట్లు రికార్డుల్లో చూపించి లక్షల రూపాయల నిధు లు డ్రా చేసినట్లు గుర్తించారు. అయినా వార్డెన్‌పై కేసు కూడా నమోదు చేశారు. ఇదే విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ కూడా నిర్ధారించింది. అయితే ఓ వైసీపీ నేత చెప్పాడని సదరు వార్డెన్‌పై ఇంతవరకు ఏవిధమైన చర్యలు తీసుకోలేదు. ఇదే అధికారి సత్తెనపల్లి, తెనాలి వార్డెన్‌గా పని చేసిన సమయంలో కూడా తాను లేని కాలానికి నిధులు డ్రా చేశారన్న అభియోగాలు ఉన్నాయి. తెనాలి వసతి గృహానికి బెల్లంకొండ నుంచి సరుకులు తీసుకువెళ్లినట్లు తప్పుడు బిల్లులు చూపించి నిధులు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి. సదరు దుకాణ యజమాని తాను తెనాలి గిరిజన హాస్టల్‌కి ఏవిధమైన సరుకులు అమ్మలేదని రాత పూర్వకంగా అధికారులకు తెలిపారు. తాజాగా ఇదే విషయాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి గిరిజన నేతలు తీసుకువెళ్లారు. సదరు వార్డెన్‌ను సస్పెండ్ చెయ్యాలని కలెక్టర్ ఆదేశించినా అవేమి జరగలేదు.

గుంటూరులోని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహంలో విద్యార్థులు లేకుండానే ఉన్నారని చూపుతున్నారు. ఆయా విద్యార్థుల పేరుతో బిల్లులు డ్రా చేశారు. వార్డెన్‌పై కేసు కూడా నమోదు చేసి చర్యలు తీసు కోవాలి.
- ఏసీబీ అధికారులు



ఎవరీ పెమ్మసాని?

- గుంటూరు ఎంపీ సీటు ఆయనకేనని ప్రచారం
- ఆయన ఎవరంటూ టీడీపీ కార్యకర్తలు విస్మయం
- గతంలోనూ వచ్చి.. సీటు లేదనగానే వెళ్లిపోయిన వైనం
- గెలిచినా ఓడినా అండగా ఉండే నేత కావాలనే పలువురి భావన
- అందుబాటులో ఉండలేకపోతున్నాననే వైదొలగిన జయదేవ్

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఐ పెమ్మసాని చంద్రశేఖర్.. గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఖరారు.. అన్న ప్రచారంతో ఎవరీ పెమ్మసాని అంటూ వాకబు అటు నాయకులు.. ఇటు కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. రెండు రోజులు క్రితం అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న పెమ్మసాని గుంటూరు ఎంపీ సీటు తనకే ఖరారైందని సన్నిహితులకు చెప్పినట్లు సమాచారం. తెనాలి ప్రాంతంలోని బుర్రిపాలెం పెమ్మసాని స్వగ్రామం. అయితే ప్రస్తుతం ఆ గ్రామంతో ఆయనకు అంతగా దగ్గర సంబంధాలు లేవని సమాచారం. ఆచార్య ఎన్‌జీ రంగా వంటి హేమాహేమీలు ప్రాతినిథ్యం వహించిన గుంటూరు లోక్‌సభ స్థానంపై ఇప్పుడు పలువురు ఆశలు పెట్టుకుని సీటు కోసం పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో పెమ్మసాని పేరు ఖరారైందనే ప్రచారంతో కార్యకర్తలు విస్మయం చెందుతున్నారు. ఆఖరికి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా చేసిన టీడీపీ నేతలు సైతం ఎవరీ పెమ్మసాని అంటూ వాకబు చేస్తున్నారు.

2014 ఎన్నికల సమయంలోనూ..

2014 ఎన్నికల సమయంలో కూడా పెమ్మసాని హఠాత్తుగా అమెరికా నుంచి నరసరావుపేటలో అడుగు పెట్టి సీటు తనదేనని ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఆ ప్రాంత ప్రజలకు కూడా అప్పటి వరకు ఆయన ఎవరో తెలియదు. ఎవరా ఇతను అని వాకబు చేసుకునే లోగానే ఆ సీటు రాయపాటి సాంబశివరావుకు ఖరారు కావడంతో పెమ్మసాని ఆమెరికాకు వెళ్లిపోయారు. 2019 ఎన్నికల సమయంలో కూడా పెమ్మసాని పత్తా లేరు. ఆ సమయంలో ఎన్నికల నాటికి టీడీపీ వ్యతిరేక వాతావరణం ఉందని ముందస్తుగానే గమనించడంతో టిక్కెట్ కోసం ప్రయత్నించిన దాఖలాలు లేవు. ఇప్పుడు జయదేవ్ నిష్క్రమణతో గుంటూరు సీటు బంపర్ ఆఫర్‌గా భావించి పై స్థాయిలో అమెరికా నుంచే ప్రయత్నాలు చేసి సీటు తనకే ఇస్తారనే ఆశతో తిరిగి రాష్ట్రంలో అడుగుపెట్టారు. కాగా పెమ్మసాని పేరు ప్రచారంలోకి రావడంతోనే పార్టీ కోసం కష్టించి పనిచేసే సీనియర్ కేడర్ కొంత అసహనానికి గురవుతున్నారు. ఈ ఐదేళ్ళుగా అధికారంలో ఉన్న వైసీపీ నేతల నుంచి ఎన్నో కష్టాలు, నష్టాలు దాడులకు గురైన పట్టించుకున్న వారిని పరిగణలోకి తీసుకుని సీటు ఇస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ హయాంలో టీడీపీకి చెందిన సీనియర్ నేతలకు మొదలు, సామాన్య కార్యకర్తలు సైతం ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. కష్టకాలంలో పార్టీ కోసం ఎంతో మంది నిస్వార్థంగా స్థానికంగా ఉండి అండగా ఉండటమే కాకుండా కోట్లాది రూపాయలు ఖర్చు చేసుకున్నారు. అలా ఇక్కడే ఉండి పనిచేసిన వారిలో ఎన్‌ఆర్‌ఐలు కూడా ఉన్నారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న జయదేవ్ పార్లమెంటు సమావేశాల్లో క్రియాశీలక పాత్ర వహించినప్పటికీ స్థానికంగా అండగా నిలవలేకపోయారనే భావన ఉంది. అటువంటిది ఇప్పుడు కూడా గెలిచినా, ఓడినా అందుబాటులో ఉండే పరిస్థితి లేని వారికి సీటు ఇవ్వటం తగదనే వాదన వినిపిస్తున్నారు.



గల్లా తప్పుకోవడంతో పలువురు పోటీ..

గత రెండు పర్యాయాలుగా ఇక్కడ నుంచి గెలుపొందిన సిట్టింగ్ ఎంపీ గల్లా జయదేవ్ క్రియాశీలక రాజకీయాలకు గుడ్‌బై చెప్పటంతో ఖాళీ ఏర్పడింది. 2014లో అనూహ్యంగా గుంటూరు బరి నుంచి దిగిన గల్లా జయదేవ్ విజయం సాధించారు. 2019లో తిరిగి ఎన్నికల బరిలో దిగి వైసీపీ గాలిలో సైతం విజయ బావుటా ఎగురవేశారు. విశేషమేమిటంటే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఆరు అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు గెలుపొందినా ఎంపీగా మాత్రం జయదేవ్ గెలిచి ఊహించని విజయాన్ని సాధించారు. అయితే జయదేవ్ మరోసారి గెలిచే అవకాశమున్నా సీటు వదులుకోవడానికి వేర్వేరు కారణాలున్నప్పటికీ. ప్రధాన కారణం గెలిపించిన ప్రజలకు అందుబాటులో లేకుండా ఉండాల్సిన పరిస్థితులు వ్యాపార రీత్యా నెలకొనడమే. అదేవిధంగా వ్యాపారానికి పూర్తి న్యాయం చేయలేకపోతున్నానని భావన కలగటం మూలంగానే రాజకీయాల నుంచి ఆయన తప్పుకున్నారు. దీంతో రాష్ట్రంలో ఏ పార్లమెంటరీ నియోజకవర్గానికి పోటీ పడనంతగా ఆశావహులు రంగంలోకి దిగి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నియోజకవర్గానికి చెందిన ఇంత డిమాండ్ ఉండడానికి ప్రధాన కారణం గత ఎన్నికల్లో టీడీపీ చవిచూసిన ఘన విజయమే అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో పలువురు పేర్లు తెరపైకి వచ్చాయి.

చెవిరెడ్డికే చాన్స్

నెగ్గని బాలినేని మాట

నేడు పార్టీ పదవి - రేపు ఎంపీ టికెట్

గ్రానైట్, పోర్టుపైనే అసలు దృష్టి

ఒంగోలు లోక్‌సభతోపాటు ఎస్‌ఎన్‌పాడు,

కందుకూరు, కావలి పార్టీ బాధ్యతల ఆంతర్యం అదే

జిల్లా వైసీపీ శ్రేణుల్లో విస్మయం

అనుచరులతో భేటీ అయిన మద్దిశెట్టి

ఎవరు అవునన్నా కాదన్నా సీఎం జగన్మోహనరెడ్డి తాను అనుకున్నదే చేశారు. మాగుంటను వద్దనుకోవటంతో పాటు సీనియర్ నాయకులు బాలినేని పట్టుబట్టినా వారి ప్రతిపాదనలను తోసిపుచ్చారు. గత 24 గంటల్లో రకరకాల ప్రతిపాదనల మధ్య చివరకు జగన్ అనుకున్న విధంగానే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డిని రంగంలోకి తెచ్చారు. ఇప్పటిదాకా వైసీపీలో లేనివిధంగా కొన్నిప్రాంతాల పార్టీ బాధ్యతలు అప్పజెప్పారు. రేపో మాపో ఎంపీ అభ్యర్థిగా కూడా ప్రకటించనున్నారు. ఒంగోలు లోక్‌సభ పార్టీ బాధ్యతలతోపాటు అదనంగా ఎస్‌ఎన్‌పాడు, కందుకూరు, కావలి బాధ్యతలు కూడా చెవిరెడ్డికి అప్పగించారు. దీంతో రాజకీయంతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న గ్రానైట్ పరిశ్రమ, పోర్టుల ఆదాయాలను చేజిక్కించుకోవటమే లక్ష్యంగా ముందడుగు వేశారా అన్న అనుమానాలను విశ్లేషకులు వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వైసీపీ అభ్యర్థుల ఐదో జాబితాలో ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నియోజకవర్గాల అంశం ప్రస్తావనకు రాలేదు. అయితే దర్శి ఎమ్మెల్యే మాత్రం అనుచరులతో సమావేశం ఏర్పాటుచేసి అధిష్ఠానానికి హెచ్చరిక పంపారు. కొంతకాలంగా వైసీపీలో అలజడి సృష్టిస్తున్న ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి ఎంపిక వ్యవహారానికి సీఎం జగన్ తాను అనుకున్న పద్ధతిలోనే ఫుల్‌స్టాప్ పెట్టారు. ఎంపీ మాగుంటకే తిరిగి అవకాశం ఇవ్వాలని పట్టుబట్టి అలకబూనిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట ఏమాత్రం నెగ్గలేదు. అదేసమయంలో పార్టీ బాధ్యతలను కూడా విజయసాయిరెడ్డి నుంచి తప్పించి చెవిరెడ్డికి అప్పగించారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డే పోటీచేస్తాడని నాయకులకు స్పష్టం చేసిన జగన్ బుధవారం నుంచి పార్టీ బాధ్యతలు కూడా ఆయనకే ఇస్తున్నట్లు సంకేతం ఇచ్చారు. తీవ్ర అభ్యంతరం చెప్పిన బాలినేనికి బుధవారం ఉదయం ఆ పార్టీ ముఖ్య నాయకులు ఫోన్ చేసి చెవిరెడ్డి ఎంపీ అభ్యర్థిగా వస్తారు, పార్టీ బాధ్యతలు మాత్రం ఎప్పటిలాగే విజయసాయిరెడ్డి చేతిలో ఉంటాయని చెప్పి పంపారు. దాంతోపాటు ఒంగోలులో నివాస స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమానికి అడ్డంకులు లేకుండా ముందుకు సాగనిస్తామని హామీ ఇచ్చారు. కొందరు జిల్లా అధికారుల బదిలీలకు బాలినేని సిఫార్సులను అమలు చేస్తామని చెప్పారు. దీంతో ఒంగోలు వచ్చి తాను మినహా ఎవరూ మాగుంట కావాలని కోరలేదని తానొక్కడినే సీఎంను వ్యతిరేకించాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అభ్యర్థి విషయంలో సీఎం నిర్ణయమే ఫైనల్ అని ప్రకటించారు. పార్టీ బాధ్యతలు కాకుండా ఎంపీ టికెట్‌కే చెవిరెడ్డిని పరిమితం చేస్తారని బాలినేని భావించారు. బుధవారం రాత్రికి అధిష్ఠానం నాయకులు బాలినేనికి ఫోన్ చేసి చెవిరెడ్డికి ఎంపీ టికెట్‌తో పాటు పార్టీ బాధ్యతలు ఇస్తున్నట్లు సమాచారమిచ్చారు. అనుకున్న ప్రకారమే రాత్రి వైసీపీ అధికారిక ప్రకటనలో ఒంగోలు లోక్‌సభతో పాటు ఎస్‌ఎన్‌పాడు, కందుకూరు, కావలి నియోజకవర్గాల పార్టీ కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాయిరెడ్డి ఆ మూడు మినహా మిగిలిన బాపట్ల, నెల్లూరు లోక్‌సభబాధ్యతలను చూస్తారు. అదనంగా గుంటూరు లోక్‌సభ అప్పగించారు.

అసలు లక్ష్యం గ్రానైట్, పోర్టులే

ఇప్పటివరకు ఎక్కడా అనుసరించని విధంగా చెవిరెడ్డికి ఒంగోలు లోక్‌సభతో పాటు అటు బాపట్ల లోక్‌సభలోని ఎస్‌ఎన్‌పాడు, ఇటు నెల్లూరు లోక్‌సభ పరిధిలోని కందుకూరు, కావలి నియోజకవర్గాల కో ఆర్డినేటర్ బాధ్యతలు ఇవ్వటంలో లోతైన లక్ష్యం ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదాయ వనరులున్న ప్రాంతాలను, విభాగాలను తనకు అనుగుణంగా ఉండే కొందరి నేతల చేతిలో జగన్ పెట్టి పాలన సాగిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం జగన్‌కు ఆ కోవలో అనుచరగణంలో చెవిరెడ్డి కూడా ప్రముఖంగా ఉన్నారు. కొంతకాలం నుంచి ఆయన ప్రాతినిధ్యం వహించే తిరుపతి జిల్లా చంద్రగిరి బాధ్యతలను కుమారుడికి అప్పగించి ఆయన మకాంను తాడేపల్లికి మార్చారు. సీఎంకు అందుబాటులో ఉంటూ కొన్ని అంశాలను ఆయన పరిశీలిస్తున్నారు. అందుకే ఆయనను ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి తేవాలన్న లక్ష్యంతోనే ముందుగా పార్టీ బాధ్యతలు అప్పగించారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే ఒంగోలు లోక్‌సభకే ఆయనను పరిమితం చేయకుండా ఎస్‌ఎన్‌పాడును ఆయన పరిధిలోకి తేవటం విశేషం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ మొత్తం ఆ నియోజకవర్గంలోని చీమకుర్తి ప్రాంతంలోనే ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కడప జిల్లాకు చెందిన జగన్ అనుయాయులంతా అక్కడ చేరిపోయారు. మరోవైపు నెల్లూరు లోక్‌సభ పరిధిలోని కందుకూరు, కావలి స్థానాల పార్టీ బాధ్యతలను కూడా చెవిరెడ్డికి అప్పగించారు. రామాయపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతం వాటి పరిధిలో ఉంది. దీంతో ఆ ప్రాంతాల అధికార పెత్తనం కూడా చెవిరెడ్డి చేతిలో ఉండేందుకు వీలుగానే పెత్తనం చెవిరెడ్డికి అప్పగించినట్లు విశ్లేషకుల అంచనా. ఇక బుధవారం సాయంత్రం వైసీపీ ప్రకటించిన అభ్యర్థుల ఐదో జాబితాలో ఒంగోలు లోక్‌సభ లేకపోవటానికి కూడా కొన్ని కారణాలు ఉన్నాయని భావిస్తున్నారు. ముందుగా పార్టీ ఇన్‌చార్జిగా ఈ ప్రాంతంలో పరిచయ కార్యక్రమాలు నిర్వహించి పరిస్థితిని చక్కబెట్టుకోవాలని చూస్తున్నట్లు తెలిసింది. తనకు టికెట్ లేదని తెలిసినా తనదారి తాను చూసుకునే విషయంలో పార్టీ అధికారిక నిర్ణయం వచ్చాకే ముందుకుపోవాలని ఎంపీ మాగుంట నిర్ణయించుకుని ఉన్నారు. దీంతో కాస్తంత జాప్యం చేసి మాగుంటను టీడీపీవైపు నుంచి కూడా రంగంలోకి రాకుండా దెబ్బతీయాలన్న ఉద్దేశం కూడా ఉందని అంటున్నారు.

పట్టాల పేరుతో బాలినేనికి చెక్

ఇంకోవైపు బాలినేని కస్సుబుస్సులాడకుండా చెక్‌పెట్టే ప్రయత్నం కూడా చేసినట్లు తెలిసింది. ఒంగోలులో స్థలాల కోసం సేకరించిన భూమి కొనుగోలుకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. కానీ వాటిని రైతులకు ఇవ్వకుండా మూడు నాలుగు రోజులుగా అధికారులు కాలం గడుపుతున్నారు. బాలినేని మాట వినకపోతే ఈ విషయంలోను చెక్ పెట్టాలన్న లక్ష్యంతోనే అలా చేసినట్లు తెలిసింది. బుధవారం బాలినేని ఒంగోలు వచ్చి ఎంపీ అభ్యర్థి విషయంలో తగ్గినట్లు ప్రకటించిన తర్వాత అధికారులు ఆ ఫైలుపై దృష్టిసారించారు. బుధవారం రాత్రి లేక గురువారం రైతుల అకౌంట్లకు డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకున్నారు. దీనికితోడు పార్టీ కోఆర్డినేటర్‌గా నియోజకవర్గానికి వచ్చి బాలినేనితో పాటు ఇతర వైసీపీ నాయకులను మచ్చిక చేసుకునేందుకు చెవిరెడ్డికి అవకాశం ఇచ్చి తర్వాత ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలని కూడా అధిష్ఠానం వ్యూహం పన్నినట్లు భావిస్తున్నారు. సామదాన దండోపాయాలతో ఎంతటి వారినైనా తనవైపునకు తిప్పుకోవటంలో చెవిరెడ్డి ఘటికుడిగా పేరు. అందుకే ముందుగా ఆయనకు పార్టీ బాధ్యతలు ఇచ్చి ఒంగోలుకు పంపి ఆ తర్వాత ఎంపీ అభ్యర్థిగా ప్రకటించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా ఈ నిర్ణయంతో జిల్లాలోని వైసీపీ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మాగుంట అభిమానులైతే ఇక టీడీపీ జెండా పట్టకతప్పదన్న నిర్ధారణకు వచ్చేశారు. ఆ విషయంలో మాగుంట కూడా తొందరగా నిర్ణయం తీసుకోవాలని ఆయనపై వత్తిడి పెంచారు.

మద్దిశెట్టి వ్యూహం

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఒంగోలు ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డాడు. బుధవారం ఆయన దర్శిలో అనుచరులతో భేటీఅయ్యారు. ఆయనతో ఉన్న ముఖ్య అనుచరులంతా సమావేశానికి హాజరయ్యారు. ఎక్కువ మంది తాడోపేడో తేల్చుకుందాం.. మీరు ఏ పార్టీలో అయినా టికెట్ తెచ్చుకోండి మేము సపోర్టు చేస్తామని తేల్చిచెప్పారు. మద్దిశెట్టి మాట్లాడుతూ తాను ఇప్పటికీ ఎమ్మెల్యేనే. నియోజకవర్గంలో నా అనుచరులను వేధిస్తున్నారు. దానికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటారని పరోక్షంగా బూచేపల్లిని, అధికారులను హెచ్చరించారు. 'మీకు నేను అండగా ఉంటా దర్శిని వదిలిపోను, ఏమి జరుగుతుందో చూడండంటూ' ఆయన అనుచరులను చేజారకుండా చూసుకునే ప్రయత్నం చేశారు. సమావేశానికి హాజరైన ఆయన సోదరులు, ఇతర అంతరంగిక నాయకులు వైసీపీ అనవసరం టీడీపీనో లేక జనసేనలోనే చేరి రంగంలోకి రండి మంచి ఫలితం వస్తుంది. కాదు కూడదంటే ఇండిపెండెంట్‌గానైనా రంగంలో నిలవండి మనసత్తా చాటుదాం అని తేల్చిచెప్పినట్లు తెలిసింది.

నేడు జేసీగా గోపాలకృష్ణ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31 : జిల్లా జేసీగా రోణంకి గోపాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఆయన్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఇప్పటి వరకూ జేసీగా పనిచేసిన డాక్టర్ శ్రీనివాసులు బుధవారం మధ్యాహ్నం రిలీవ్ అయ్యారు.

గ్రానైట్ వ్యాపారుల్లో అలజడి

ప్రభుత్వ వేధింపులపై ఒక్కటవుతున్న వ్యాపారులు

మూగబోయిన ఫ్యాక్టరీలు

వ్యాపారుల ఫిర్యాదులపై కేసు పెట్టని పోలీసులు

పోలీసుల వలయంలో మార్టూరు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ వ్యాపారుల్లో అలజడి ఆరంభమైంది. ప్రభుత్వ వేధింపులకు నిరసనగా తరతమ భేదాలకు అతీతంగా వ్యాపారులు ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో బుధవారం మార్టూరులోని వందకుపైగా గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లలో పనులు నిలిచిపోయాయి. పోలీసుల కేసులను ఎదుర్కొనేందుకు వ్యాపారులు ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. మరోవైపు పోలీసులు.. అటు టీడీపీ ఎమ్మెల్యేపైన, వ్యాపారులపైన కేసులు నమోదు చేసి వ్యాపారులు పెట్టిన కేసులు బుట్టదాఖలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

వ్యాపారులపైనే కేసులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును టార్గెట్‌గా చేసుకొని ప్రైవేట్ సైన్యం ఆధ్వర్యంలో మైనింగ్ అధికారులు మంగళవారం మార్టూరులోని కొన్ని పాలిషింగ్ యూనిట్లలో తనిఖీలు నిర్వహించిన విషయం విదితమే. ఆ సందర్భంగా మైనింగ్ అధికారులతో వచ్చిన ప్రైవేటు వ్యక్తులు తెచ్చిన కర్రలు, కారంపొడిని పోలీసులకు ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో వ్యాపారులు అప్పగించారు. పోలీసులు వ్యాపారులపైనే కేసులు పెట్టి వారు ఇచ్చిన ఫిర్యాదులను పక్కన పడేశారు. అంతేకాక వ్యాపారులపై నమోదు చేసిన కేసుపై వెంటనే చర్యలు ప్రారంభించారు. అందులోభాగంగా ఆరుగురు వ్యాపారులను అరెస్టు చేశారు. అంతటితో ఆగక బుధవారం భారీగా బలగాలను దింపి మార్టూరును పోలీసుల వలయంలోకి తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో భారీగా పోలీసులు అటు వ్యాపారులు, ఇటు టీడీపీ శ్రేణులు నిరసనలకు దిగకుండా అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు.



విజిలెన్స్ అధికారుల కారం ప్యాకెట్‌ను చూస్తున్న ఎమ్మెల్యే ఏలూరి(ఫైల్)

90శాతానికిపైగా ఫ్యాక్టరీల్లో పనులు నిలిపివేత

వ్యాపారులంతా ఏకతాటిపైకి వచ్చారు. మార్టూరులో సుమారు వంద గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. అందులో 90 శాతం పైగా ఫ్యాక్టరీల్లో బుధవారం పనులు నిలిపివేశారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాపారులు ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఒకేబాటలో నడవాలని నిర్ణయించుకున్నారు. పాలిషింగ్ రాయి ఎగుమతిని కూడా ఆపేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడే అవకాశం నెలకొంది.

ఎమ్మెల్యే ఏలూరితో పాటు వ్యాపారంలో ఉన్న టీడీపీ అభిమానులను వేధించే ప్రభుత్వ చర్యల్లో భాగంగా పోలీసులు, మైనింగ్ అధికారుల తనిఖీలు ఒకవైపు కొనసాగుతండగా.. మరోవైపు ఇతర ప్రాంతాల్లో గ్రానైట్ వ్యాపారుల్లో కూడా అలజడి మొదలైంది. మార్టూరులో ఫ్యాక్టరీలకు ముడి సరుకులు ఇచ్చే బల్లికురవ ప్రాంతం, చీమకుర్తి వద్ద ఉన్న ప్రపంచ ప్రఖ్యాతి చెందిన గెలాక్సీ గ్రానైట్ క్వారీ, అలాగే ఉమ్మడి జిల్లాలోని ఇతరప్రాంతాల్లో ఉన్న పాలిషింగ్ ఫ్యాక్టరీల యజమానుల్లో ఈ అంశం తీవ్ర చర్చనీయాశమైంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రానైట్ పరిశ్రమ ఎలాంటి చేయూత ఇవ్వలేదు. జగన్ ముఖ్యమంత్రి కాకముందు పాదయాత్రలోనూ, ముఖ్యమంత్రిగా జిల్లాకు వచ్చిన సందర్భంలోనూ గ్రానైట్ పరిశ్రమల చేయూతకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. పైగా అన్ని రకాల అధనపు భారాలు మోపారు. అనునిత్యం తనిఖీల పేరుతో వేధింపులకు దిగారు. వీటికితోడు టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన నాయకులను వదిలేసి టీడీపీలో ఉన్న ఎమ్మెల్యే రవికుమార్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు వారి క్వారీలు, ఫ్యాక్టరీలు మూతపడేలా చేశారు. మొన్నటికి మొన్న అద్దంకిలో కొత్త ఇన్‌చార్జికి సహకరించడం లేదనే నెపంతో వైసీపీలోనే ఉన్న బాచిన కృష్ణచైతన్య క్వారీలోనూ తనిఖీలు నిర్వహించి గ్రానైట్ రాయి అమ్మకం అనుమతులు నిలిపివేశారు. భారీగా జరిమానా విధించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈనేపథ్యంలో మార్టూరులో మంగళవారం జరిగిన ఘటనతో పరిస్థితి పరాకాష్ఠకు చేరింది. దీంతో గ్రానైట్ వ్యాపారుల్లో అలజడి ప్రారంభమై తరతమ భేదాలకు అతీతంగా ప్రభుత్వ చర్యలకు నిరసించే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఓదార్పు.. భరోసా...

దర్శి, కొండపి నియోజకవర్గాల్లో

భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర

చంద్రబాబు అరెస్టు సమయంలో

మృతి చెందిన వారి కుటుంబాలకు పరామర్శ

ఆర్థిక సాయం అందజేత

భారీగా పాల్గొన్న టీడీపీ, జనసేన శ్రేణులు



దర్శిలో కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

ఒంగోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో కలత చెంది ప్రాణాలు వదిలిన జిల్లాలోని ఆరు కుటుంబాలను నారా భువనేశ్వరి బుధవారం పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి, మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా నిజం గెలవాలి పేరుతో ప్రత్యేకంగా యాత్ర చేపట్టిన భువనేశ్వరి బుధవారం జిల్లాలోని దర్శి, కొండపి నియోజకవర్గాల్లో పర్యటించారు. మంగళవారం సాయంత్రం ముక్తినూతలపాడులో పర్యటించి రాత్రికి ఒంగోలు నగర పరిధిలోని బృందావనం కల్యాణ మండపంలో బస చేసిన ఆమె బుధవారం ఉదయం ఇక్కడి నుంచి నేరుగా దర్శి వెళ్లారు. దర్శి పట్టణంలోని ఐదో వార్డులో మరణించిన పరిశుద్ధరావు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ముండ్లమూరు మండలం శింగన్నపాలెం వెళ్లి అక్కడ హనుమంతరావు కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాత తాళ్లూరు మండలం తూర్పుగంగవరం చేరుకొని అక్కడి ఆశ్రమంలో ఉంటున్న జంపాని నరసింహారావు సతీమణిని పరామర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని గంగవరం వద్ద ముగించిన భువనేశ్వరి అక్కడి నుంచి కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు చేరుకొని అక్కడ మరణించిన దుగ్గినేని అరుణ్‌కుమార్ కుటుంబాన్ని, తర్వాత కొండపి మండలంలోని కె.ఉప్పలపాడులో జంగాల అంజయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని చోట్లా మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల వంతున ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళలు

భువనేశ్వరి పర్యటనలో ఆద్యంతం టీడీపీ, జనసేన శ్రేణులు, ప్రత్యేకించి మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం ఒంగోలులో ఆమె బస చేసిన బృందావనం కల్యాణ మండపం వద్దకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, దర్శి నియోజకవర్గ నేత గోరంట్ల రవి కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌లతోపాటు పెద్దసంఖ్యలో రెండు పార్టీల కార్యకర్తలు భువనేశ్వరిని కలిశారు. నగరానికి చెందిన పలువురు మహిళా డాక్టర్లు ఆమె వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. అనంతరం ముఖ్యనేతలతో కలిసి దర్శి నియోజకవర్గ పర్యటనకు వెళ్లిన భువనేశ్వరికి అక్కడి టీడీపీ మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి. అన్ని గ్రామాల్లో ముఖ్యనేతలు పాల్గొన్నారు. దర్శిలో దివ్యాంగులు పెద్దసంఖ్యలో వచ్చి ఆమెను కలిశారు. అనంతరం కొండపి సెగ్మెంట్‌లోని టంగుటూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్న భువనేశ్వరికి ఎమ్మెల్యే డీఎస్‌బీవీ స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దామచర్ల సత్య నేతృత్వంలో వందలాది మంది పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. టంగుటూరు, కె.ఉప్పలపాడులో పర్యటన ముగిసే వరకు వెంట సాగారు. పలు గ్రామాల్లో భువనేశ్వరిని చూసేందుకు మహిళలు పెద్దసంఖ్యలో తరలి రావడంతోపాటు కలిసేందుకు ఆసక్తి చూపారు. అలాంటి వారికి చిరునవ్వుతో అభివాదం చేస్తూ ఆమె ముందుకు సాగారు. రాత్రికి కందుకూరు సమీపంలోని ఆలావారి కల్యాణ మండపంలో బస చేశారు.

అనుచరులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

కాపాడుకునేందుకు ఎంతవరకైనా పోరాడతాం

తాను ఎమ్మెల్యేను అన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలి

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి, జనవరి 31 : తమ అనుచరులను ఇబ్బందిపెట్టాలని చూస్తే సహించేది లేదని, వారిని కాపాడుకునేందుకు ఎంతదూరమైనా వెళ్తానని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ స్పష్టం చేశారు. దర్శి పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం ఆయన అనుచరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధిష్ఠానం తనకు ఎమ్మెల్యే సీటు ఇవ్వకపోయినప్పటికీ మరో రకంగా అవకాశం కల్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆ వార్త సీఎం జగన్ నుంచి కొద్ది రోజుల్లో వస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు. ఇక్కడ సీటు పొందిన వ్యక్తి అందరినీ కలుపుకుపోవాలని సూచించారు. కొంత మంది బిల్లులను ఆపే ప్రయత్నం చేస్తున్నారని, మరికొందరిపై తప్పుడు కేసులు పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇప్పటికీ ఎమ్మెల్యే అనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. గత 15 ఏళ్లుగా తనకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. దర్శికి వచ్చే ముందు ఆయన ముండ్లమూరు మండలం శంఖరాపురం నుంచి సుమారు 70 వాహనాల్లో ర్యాలీగా ఇక్కడకు వచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నేతలు మద్దిశెట్టి రవీంద్ర, శ్రీధర్, వాసు, ఏఎంసీ చైర్మన్ షకీలా, అమీన్‌బాషా, తాళ్లూరు జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, తాళ్లూరు ఎంపీపీ వెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేణుగోపాల్‌కు మద్దతుగా భారీగా వెళ్లిన అభిమానులు

ముండ్లమూరు, జనవరి 31 : దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు మద్దతుగా మండలంలోని ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పలు వాహనాలు, కార్లలో, ద్విచక్ర వాహనాల్లో దర్శికి తరలి వెళ్లారు. మారెళ్ల నుంచి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కుంచాల నాగరాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అలా వెళ్లిన వారిలో మండల వైసీపీ కన్వీనర్ బిజ్జం వెంకటసుబ్బారెడ్డి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కుంచాల నాగరాజు, వైస్ ఎంపీపీ వేముల జానకిరామయ్య, సర్పంచ్‌లు జనమాల పిచ్చయ్య, నాగేంద్రం, వేముల శ్రీనివాసులు, నలమోలు వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరెడ్డి, బద్రి సుబ్బారెడ్డి, కుమ్మిత వెంకటరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మొదుళ్ల వెంకటసుబ్బారెడ్డి, మానం వెంకటరావు, అన్నపురెడ్డి భిక్షాలరెడ్డి, కట్టా చినవెంకటొట్లు, గంగిరెడ్డి, దుగ్గినేని వెంకట్, అడపాల వెంకటేశ్వర్లు, రవ్వారం గజ్జల రామముసలారెడ్డి, పుల్లంశెట్టి నరేష్, మేడికొండ శేషగిరి, గోపనబోయిన పిలిప్ రాజు, పాలెపోగు గురవయ్య ఉన్నారు.

వైసీపీ సమావేశానికి పలువురు డుమ్మా!

మంత్రి ఎదుట నాయకుల వాదులాట

కలిసికట్టుగా పనిచేయాలని సురేష్ సూచన

కొండపి, జనవరి 31 : కొండపి మండల వైసీపీ కార్యకర్తల సమావేశానికి పలువురు నాయకులు డుమ్మా కొట్టారు. హాజరైన నేతల్లో కూడా కొందరు మంత్రి సురేష్ ఎదుట వాగ్వివాదానికి దిగారు. ఒకరిపై ఒకరు విమర్శలు, ఫిర్యాదులు చేసుకున్నారు. వారిని వారించిన మంత్రి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. స్థానిక కామేపల్లి రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఈ సమావేశం మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకూ జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన మంత్రి సురేష్ పాల్గొని గ్రామాల వారీ సమీక్ష నిర్వహించారు. ఒక్కో గ్రామానికి చెందిన ముఖ్యనాయకులను పిలిచి వారితో అర్ధగంటపాటు చర్చించారు. ఈసందర్భంగా నేతివారిపాలెం గ్రామంలోని ఇరువర్గాలవారు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నట్లు తెలిసింది. కొండపి, కట్టావారిపాలెం గ్రామాల నాయకుల మధ్య కూడా ఇదే పరిస్థితి చోటుచేసుకున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొండపిలోని నాయకులు వెంకయ్యకు చేయనందున అక్కడ టీడీపీకి మెజారిటీ వచ్చిందని కట్టావారిపాలెం గ్రామ నాయకులు మంత్రికి చెప్పగా, కట్టావారిపాలెం నాయకులు వెంకయ్య కోసం బాగా పనిచేసినా ఆగ్రామంలో కూడా టీడీపీకే మెజారిటీ వచ్చిందని కొండపి నాయకులు వ్యంగ్యంగా మాట్లాడినట్లు సమాచారం. కాగా నియోజకవర్గ కేంద్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఏమాత్రం అనువుగాని చోట నాయకుల స్వార్థం కోసం ఇచ్చారని, ఇప్పుడు ఒక్కరు కూడా ఇల్లు కట్టుకోలేదని కొందరు మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ముప్పవరం, వెన్నూరు గ్రామాల్లో శ్మశానంలో ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో లబ్ధిదారులు తీసుకోలేదని చెప్పినట్లు సమాచారం. మరి కొన్ని గ్రామాల్లో కూడా ఇళ్ల నిర్మాణాలకు అనువుగా లేని, గ్రామాలకు దూరంగా ఉన్న స్థలాలను ఎంపిక చేయడంతో పట్టాలు ఇచ్చినా పేదలు ఇళ్లు నిర్మించుకోలేదని పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్తున్నారు. కొండపిలో తాను నడుపుతున్న రేషన్ దుకాణాన్ని సంవత్సరం క్రితం తొలగించారని ఓ యువకుడు మంత్రికి ఫిర్యాదు చేయడంతోపాటు చేతిలోని కాగితాలు విసరడంతో సురేష్ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమావేశానికి ముందు మంత్రి సురేష్‌ను కలిసిన పలువురు వైసీపీ మండల ముఖ్యనాయకులు మాట్లాడుతూ 'మీదగ్గరికి వస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులతో ఎన్నికలు చేయడం కష్టం. ఇప్పటికీ అన్ని గ్రామాల్లో ముఖ్యనాయకులు మీవద్దకు రావడం లేదు. దాన్ని పరిష్కరించుకోండి' అని మంత్రికి సూచించినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో మరింత లోతుగా విశ్లేషిస్తానని మంత్రి వారితో అన్నట్లు సమాచారం. కాగా దాదాపు నాలుగు గ్రామాల నుంచి ప్రధానమైన నాయకులు వివిధ కారణాలు చెప్పి కార్యకర్తల సమావేశానికి దూరంగా ఉండగా, కొన్ని గ్రామాల నుంచి ఓవర్గం నాయకులు గైర్హాజరవడం చర్చనీయాంశమైంది.

ఎన్నికల విధులపై అవగాహన పెంచుకోవాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31: రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నియమించిన నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులపై పూర్తిగా అవగాహన పెంచుకొని అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం సార్వత్రిక ఎన్నికలకు నియమితులైన నోడల్ అధికారులతో జరిగిన సమావేశంలో క లెక్టర్ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ మేనేజ్‌మెంట్, ఎంసిఎంసి, ఎలక్ట్రోరల్స్, ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎనిర్వహించే ముందస్తు విధులకు సంబంధించి నోడల్ అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలన్నారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎన్నికల సిబ్బందికి సమర్థవంతంగా శిక్షణ అవసరమన్నారు. అందుకు అనుగుణంగా అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు నమోదుతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన పెంచేలా స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వచ్చేనెల 10 నాటికి అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రాథమిక చర్యలపై నివేదికను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో ఆర్ శ్రీలత, నోడల్ అధికారులు ఉన్నారు.

పోలేపల్లిలో ఆరు నెలల శిశువు కిడ్నాప్‌నకు యత్నం

అప్రమత్తమైన బంధువులు

పసికందును ఇంటివెనుక పడేసి పరారైన దుండగుడు

దొనకొండ, జనవరి 31 : ఇంటి వరండాలోని ఉయ్యాలలో పడుకున్న ఆరునెలల శిశువు అపహకరణకు యత్నించిన ఘటన మండలంలోని పోలేపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన యద్దనపూడి చిన్నకొండయ్య, సోనియా దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె అయిన ఆరు నెలల శిశువును వరండాలోని ఉయ్యాలలో పడుకోబెట్టి తల్లి బయట కూర్చొని ఉంది. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి సందులో నుంచి వచ్చి ఉయ్యాల్లో పడుకొని ఉన్న శిశువును ఎత్తుకొని పరారయ్యే ప్రయత్నం చేస్తుండగా బాలిక ఏడ్చింది. వెంటనే తల్లి అటువైపు చూసి కేకలు పెట్టింది. వెంటనే దుండగుడు పాపను ఇంటి వెనుక పడేసి పరారయ్యాడు. వెంటనే తల్లి పరిగెత్తి పాపను తీసుకొని ఎటువంటి సంఘటన జరగకపోవటంతో ఊపిరిపీల్చుకుంది. బంధువులు దుండగుడిని పట్టుకునేందుకు వెంబడించగా ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. సమాచారం మేరకు దొనకొండ, త్రిపురాంతకం పోలీసులు గ్రామానికి చేరుకొని జరిగిన సంఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.



వల్లాపల్లి - వలపర్ల రోడ్డు కిరువైపులా ఉన్న తుమ్మ చెట్ల తొలగింపు పనులను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

నాట్స్ ఆధ్వర్యంలో తుమ్మచెట్ల తొలగింపు పనులు

బల్లికురవ, జనవరి 31 : ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ముందుకు వచ్చింది. మండలంలోని వల్లాపల్లి- వలపర్ల రోడ్డు కిరువైపులా అడవి తుమ్మ చెట్లు చిట్టడవిలా అల్లుకున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో వల్లాపల్లి గ్రామపెద్దలు పత్తిపాటి వెంకట్రావు ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రెసిడెంట్ నూతి బాపయ్య చౌదరి దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. దీంతో గుంటుపల్లి గ్రామానికి చెందిన నాట్స్ బోర్డు అఫ్ డైరెక్టర్ అయిన మాదాల రాజేంద్రబాబు తన సొంత నిధులతో రోడ్డు పక్కన ఉన్న తుమ్మ చెట్లను తొలగించేందుకు ముందుకు వచ్చారు. బుధవారం వల్లాపల్లి గ్రామం నుంచి వలపర్ల వరకు రోడ్డు కిరువైపులా ఉన్న తుమ్మ చెట్లను ఎక్స్‌కవేటర్‌తో పూర్తి స్థాయిలో తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన తెలుగు సంఘం నాట్స్ ప్రతినిధులకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మాదాల సాంబయ్య, మందలపు సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

సంతమాగులూరు, జనవరి 31: జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందనలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. సంతమాగులూరు మండల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక స్పందనలో కలెక్టర్ పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అర్జీలకు సంబంధించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. సంతమాగులూరు మండలంలో నిన్నటి వరకు 378 దరఖాస్తులు రాగా వాటిలో కేవలం రెండు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకట రమణ, అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పాణ్యం హనిమిరెడ్డి, చీరాల ఆర్‌డీవో పి. సరోజిని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం తదితరులు

క్రీడలతో మనో వికాసం

● ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల, జనవరి 31 : క్రీడలతో శారీరక దారుఢ్యం, మనోవికాసం పెంపొందుతాయని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం నేషనల్ లెవెల్ షూటింగ్‌బాల్ పోటీలను నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే బలరాం, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావులు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ లెవెల్ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ముందుగా ఎమ్మెల్యే బలరాం జాతీయజెండాను ఎగురవేశారు.వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ మల్లెల లలితరాజశేఖర్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చీమకుర్తి బాలకృష్ణ, చిలుకోటి శ్రీనివాసరావు, షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఐ. బాబూరావు, పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టీడీపీకి చెందిన గ్రానైట్ యజమానులకు రిమాండ్

మార్టూరు, జనవరి 31 : మార్టూరులో పోలీసులు అరెస్ట్ చేసిన టీడీపీ మద్దతుదారులైన గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆరుగురికి బుధవారం అద్దంకి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి ప్రియదర్శిని ఫిబ్రవరి 13 వరకూ రిమాండ్ విధించారు. బుధవారం ఉదయం 7 గంటలకు మార్టూరు స్టేషన్ నుంచి అద్దంకి కోర్టుకు తీసుకెళ్లిన గ్రానైట్ పరిశ్రమల యజమానులకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎంతో ఉత్కంఠగా కోర్టులో న్యాయాధికారి తీర్పుకోసం వేచి ఉండగా ఎట్టకేలకు రాత్రి 12 గంటల సమయంలో తీర్పును ప్రకటించారు. పోలీసులు కోర్టుకు హాజరుపరిచిన గ్రానైట్ పరిశ్రమ యజమానుల్లో మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ప్రసాద్, కామినేని జనార్దన్, షేక్ రజాక్, మిన్నెకంటి రవికుమార్, అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు ఉన్నారు. నెల్లూరు విజిలెన్సు ఏడీ బాలాజీనాయక్‌ తాను మంగళవారం మార్టూరులోని అనంత గ్రానైట్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా విధులకు ఆటంకం కలిగించారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు ఏడుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులపై స్టేషన్‌లో కేసు పెట్టారు. వారిలో ఆరుగురుని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచారు. న్యాయాధికారి తీర్పు అనంతరం వారిని మార్టూరు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాత్రి ఒంగోలులోని జైలుకు తరలించారు.

టీడీపీలోకి చేరికల పరంపర

అద్దంకి, జనవరి 31: అద్దంకి నియోజకవర్గంలో టీడీపీలోకి చేరికల పరంపర రోజురోజుకు పెరుగుతున్నది. వైసీపీ నేతలతోపాటు క్యాడర్ కూడా మరింత ఉత్సాహంగా టీడీపీలోకి చేరుతున్నారు. ఎమ్మెల్యే రవికుమార్‌కు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఉన్న వ్యక్తిగత పరిచయాలతో పాటు ఏదో ఒక సందర్భంలో వ్యక్తిగతంగా, ప్రభుత్వం నుంచి లబ్ధి పొంది ఉండటంతో టీడీపీలో చేరికలకు మరింత దోహదపడుతున్నాయి. ఇప్పటికే అన్ని మండలాల నుంచి పలువురు గ్రామస్థాయి నేతలు, క్యాడర్ ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి టీడీపీలోకి చేరేందుకు సిద్ధం అయినప్పటికి రవికుమార్ మాత్రం కండువాలు వేయటం కంటే అందరూ కలిసికట్టుగా పనిచేసి మంచి మెజార్టీ సాధించే విధంగా కృషి చేయాలని చెప్పి పంపుతున్నట్లు సమాచారం. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాచిన కృష్ణచైతన్య గత నాలుగున్నర సంవత్సరాల నుంచి పనిచేసి కొందరు టీడీపీ నేతలను వైసీపీలోకి చేర్పించారు. హనిమిరెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా రావటంతో టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన నాయకులు ఇప్పుడు సొంతగూటికి తిరిగి వచ్చేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా పోయాయి. దీనికి తోడు హనిమిరెడ్డి తో గ్రామస్థాయి నేతకు అంతగా పరిచయాలు లేకపోవటం క్యాడర్ దూరం కావటానికి కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికే సంతమాగులూరు మండలం నుంచి పెద్ద సంఖ్యలో నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. చంద్రబాబునాయుడు సమక్షంలో చేరే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నారు. బల్లికురవ మండలం మాజీ జడ్పీటీసీ, బీసీ నేత తన్నీరు ఏడుకొండలు ఇటీవల ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. గొర్రెపాడు, వి.కొప్పెరపాడు తదితర గ్రామాల వైసీపీ నేతలు కూడా రవికుమార్‌ను కలిశారు. పంగులూరు మండలంలో వైసీపీ నేత, కాంట్రాక్టర్ బోరెడ్డి ఓబుల్‌రెడ్డి ఇటీవల రవికుమార్‌ను రేణింగవరంకు ఆహ్వానించి తన అనుచరులతో కలిసిటీడీపీ కండువా కప్పుకున్నారు. మరికొన్ని గ్రామాల వైసీపీ నేతలు కూడా ఆయా గ్రామాలలో కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని రవికుమార్ ను ఆహ్వానించారు. ఆ సందర్భంగా టీడీపీలో చేరేందుకు సిద్ధం అవుతున్నారు. అద్దంకి పట్టణంలో వార్డుల వారీగా వైసీపీ నేతలు, క్యాడర్ పెద్ద సంఖ్యలో చిలకలూరిపేట వెళ్ళి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎన్నికల నోటిఫికేషన్ తరువాత పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధం అవుతున్నారు. దీంతో అద్దంకి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ బలం మరింత పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.


ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేత బోరెడ్డి ఓబుల్‌రెడ్డి (ఫైల్)


ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న అద్దంకి పట్టణంలోని 17 వ వార్డు వైసీపీ నేతలు (ఫైల్)

ఉద్యోగ నియామకాలపై విచారణ

పర్చూరు, నూతలపాడు జూనియర్ కళాశాలలో విచారణ చేపట్టిన అధికారి

పర్చూరు, జనవరి 31: నిబంధనలకు విరుద్ధంగా పర్చూరు, నూతలపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టారని కొందరు కమిషన్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత కళాశాలలకు వారం రోజుల వ్యవధిలోపు విచారణ చేపట్టనున్నట్లు అధికారులు నోటీసులు జారీచేశారు. దీంతో బుధవారం స్థానిక భవనం అంజిరెడ్డి అండ్ తులాబంధుల అర్జునయ్య(బీఏఆర్ అండ్ టీఏ) కళాశాలలో బాపట్ల జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.ఎర్రయ్య విచారణ చేపట్టారు. గతంలో ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి ప్రస్తుతం యద్దనపూడి జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న జి.రత్నకుమారి, ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న చింపారెడ్డిని విచారించారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా విషయాలు సేకరించారు. అలాగే నూతలపాడు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీదేవిని విచారించి వివరాలు సేకరించారు. నూతలపాడు జూనియర్ కళాశాలలో బీఎస్ అండ్ వీకేఆర్ఎం కళాశాలలో కనీసం పదికి మించి విద్యార్థులు లేకపోయినా 8 మంది సిబ్బందిని నియమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే పర్చూరు జూనియర్ కళాశాలలో ఇదే పరిస్థితి ఉన్నట్లు ఫిర్యాదు చేశారు.

3న ప్రతిభామూర్తుల సభ

అద్దంకిటౌన్, జనవరి 31: ఏపీఎస్ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో సాయంత్రం 6 గంటలకు ప్రతిభ మూర్తులు-మధురస్మృతులు (28వ) సభ జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ నటించిన సీతా రామకల్యాణం సినిమాపై సమీక్ష జరుగుతుందని తెలిపారు.

సమష్టిగా సమస్యలను పరిష్కరించుకుందాం

కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ శ్రీనివాసరావు

చీరాల, జనవరి 31 : మున్సిపల్ పరిధిలోని సమస్యలన్నీ సమష్టి అడుగులతో పరిష్కరించుకుందామని, అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దామని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో బుధవారం చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. అజెండాలో మొత్తం 43 అంశాలు ఉండగా అందులో ఒక అంశాన్ని వాయిదా వేశారు. మూడు అంశాలను రద్దు చేశారు. 40వ అంశానికి సంబంధించి పొలిమేర రోడ్డులోని ఓ భవన నిర్మాణం నిబంధనలను అతిక్రమించిందని ఇచ్చిన నోటీసులలో పేర్కొన్న వివరాలకు, వాస్తవ కొలతలకు వ్యత్యాసం ఉందని సదరు భవన నిర్మాణదారుడు కోర్టులో వెల్లడించిన విషయాలను పూర్తిస్థాయిలో పరిశీలించి తన నివేదికను నిర్ణీత కాలవ్యవధిలో కోర్టుకు సమర్పించాలని స్టాండింగ్ కౌన్సిల్ తరపు న్యాయవాది వివరించారు. అందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో పలు అంశాలను చిన్నపాటి చర్చలతో ఆమోదించారు. తరువాత టేబుల్ అజెండాగా పొందుపరిచిన అంశాన్ని కూడా కొద్దిపాటి చర్చ తో ఆమోదించారు. పలు అంశాల ఆమోద క్రమంలో కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకరరావు, మించాల సాంబశివరావు, పాపిశెట్టి సురేష్ తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. వాటికి చైర్మన్ శ్రీనివాసరావు, డీఈ ఏసయ్య సమాధానం చెప్పారు. సమావేశం ప్రారంభంలో కమిషనర్ విజయసారథి తనను తాను కౌన్సిల్‌కు పరిచయం చేసుకున్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరావు

కమిషనర్‌కు పూర్తిస్థాయిలో సహకరిస్తాం

పట్టణ అభివృద్ధికి సంబంధించి నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ విజయసారథికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు తెలిపారు. అందుకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

చినగంజాం, జనవరి 31 : బాలికలు చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలని పెదగంజాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.దేవదత్తం అన్నారు. పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బుధవారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. నరసరావుపేటలో 29వ తేదీన జరిగిన స్కూల్ గ్రేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో బాపట్ల జిల్లా జట్టులో పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని మరుప్రోలు తులసి, 9వ తరగతి విద్యార్థిని చంద్రికలు పాల్గొన్నట్లు హెచ్ఎం తెలిపారు. క్రికెట్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్‌లను అందజేశారు. విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.అనిల్‌కుమార్‌లను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డి.నారాయణరెడ్డి, బి.నాగేశ్వరరావు, ఎ.వీరాస్వామి, పి.బ్రహ్మయ్య, కే.నాగరాజు, ఎన్.శ్రీరమణ, ఎన్.రమణమూర్తి, జి.హవీలాదేవి, రికార్డు అసిస్టెంట్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఉన్నతమైన వ్యక్తిత్వంతో ఆదర్శంగా నిలిచారు

అద్దంకిటౌన్, జనవరి 31: 38 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడుగా పని చేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఆదర్శ ఉపాధ్యాయుడు శృంగారపు నాగేశ్వరరావు అని, ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరికి ఆదర్శంగా నిలిచారని హెచ్ఎం సీహెచ్ శ్రీనివాసమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న శృంగారపు నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోరంట్ల పద్మావతి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కామేపల్లి నాగేంద్రమ్మ హనుమంతరావు, ఎంఈవోలు డి.గంగాధరరావు, బి. సుధాకరరావు, విద్యాకమిటీ చైర్మన్ శాంతి పలువురు ఉపాధ్యాయులు పాల్గొని నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు.


ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న హెచ్ఎం ఉపాధ్యాయులు


దుద్దుకూరు పాఠశాలలో ఈశ్వరవాణి, కోటేశ్వరరావు దంపతు లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఈశ్వరవాణి కృషి అభినందనీయం

ఇంకొల్లు, జనవరి 31: విద్యార్థులను తీర్చిదిద్దటంలో ఈశ్వరవాణి కృషి అభినందనీయమని పర్చూరు ఉపవిద్యాశాఖాధికారి ఆర్.శ్రీనివాసరావు కొనియాడారు.మండలంలోని దుద్దుకూరు ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తూ ఉద్యోగవిరమణ పొందిన సందర్భంగా బుధవారం జరిగిన సన్మానసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈశ్వరవాణి,కోటేశ్వరరావు దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు పి.రాఘవయ్య,శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసాచార్యులు, సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామప్రముఖులు కోమటి బాలయ్య, రాయిణి తిరుపతిరాయుడు, సమత, ఉదయకుమారి, ఆదినారాయణ, ఉపాధ్యాయసిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో కూడిన విద్య అవసరం

ఇంకొల్లు, జనవరి 31: ఆధునిక సమాజంలో అవగాహనతో కూడిన విద్యా అవసరమని మండల విద్యాశాఖాధికారి వి.రాఘవరావు అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో మేడూరి సత్యనారాయణ రచించిన విద్య అనుభవాలు-భావాలు గ్రంథావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మేడూరి సత్యనారాయణ రచించిన గ్రంథాన్ని ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉదయకుమారి, ఉపాధ్యాయులు చిలుకూరి హనుమంతరావు,రావి నాగేశ్వరి, ఎం.సత్యనారాయణ, కరి కమలేశ్వరరావు, ఆవుల హనుమంతరావు మేడూరి సత్యనారాయణను అభినందించారు మేడూరి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం కేసులో పలువురు విచారణ

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 31 :మండల పరిధిలోని కీర్తివారిపాలెంలో మహిళ ఆత్మహత్యాయత్నం కేసులో ఈపూరుపాలెం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామంలోని ఓ వ్యక్తికి చెందిన పొలాన్ని ఇరువురికి రిజిస్ట్రేషన్ చేశాడు. ఈక్రమంలో చోటుచేసుకున్న వివాదం పలుమార్లు పెద్దల వద్ద పంచాయితీ జరిగినా పరిష్కారం కాలేదు. ఇది కాస్త శృతిమించడంతో ఎలికా జ్యోతి మంగళవారం ఒంటిపై కిరోసిన్ పోసుకుని బలవన్మరణానికి యత్నించింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి అనంతరం వైద్యుల సలహామేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు నమోదయిన కేసులో ఈపూరుపాలెం పోలీసులు సుమారు ఆరుగురిని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. అయితే జ్యోతి పరిస్థితి విషమంగానే ఉంది.

మెగా డీఎస్సీ కాదు..దగా డీఎస్సీ

ఆపేరుతో నిరుద్యోగులకు జగన్ మొండిచేయి

చీరాలటౌన్, జనవరి 31 : రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది మెగా డీఎస్సీ కాదని అది పెద్ద దగా డీఎస్సీ అని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి గుమ్మల రామన్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెయింట్‌మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ పాదయాత్ర సమయంలో స్వయంగా రాష్ట్రంలో సుమారు 23 వేల మంది నిరుద్యోగ యువత ఉన్నట్లు చెప్పారన్నారు. కానీ 6 వేలకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్స్ వెల్లడించి నిరుద్యోగులను పెద్ద ఎత్తున మోసగించినట్లు ఆరోపించారు. వాస్తవానికి ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 10 లక్షల నిరుద్యోగులు ఉన్నట్లు వివరించారు. అంతేకాకుండా ఉద్యోగ విరమణ పొందిన వారు, డెత్‌లు ఇలా అనేక ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఈ ఐదేళ్లలో కనీస జాబ్ క్యాలెండర్ లేకపోవడం శోచనీయమన్నారు. కనీసం 25 వేలకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి సాయి, భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు లక్ష్యాలపై ఏకాగ్రతను పెంచుతాయి

విద్యార్థులు పోటీలలో పాల్గొనడం వలన లక్ష్యాలపై ఏకాగ్రతను పెంచుకోవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో వేమనపద్య పఠనం పోటీలను నిర్వహించారు. సుమారు 20 పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొనగా వేటపాలెం మండలం కొత్తపేటకు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని వడ్డేపల్లి గాయత్రి, ద్వితీయ బహుమతి మంతెన హర్షి సాధించారు. నిర్వాహకులు వారికి బహుమతులు అందజేశారు.వలివేటి మురళీకృష్ణ, గుంటుపల్లి సుబ్బారావు, బత్తుల బ్రహ్మారెడ్డి, బీరంసుందరరావు పాల్గొన్నారు

వెంకట సుబ్బయ్య మృతదేహానికి నివాళులు

మేదరమెట్ల ,జనవరి 31: సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు కోయి వెంకట సుబ్బయ్య గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం మేదరమెట్లలో సుబ్బయ్య మృతదేహానికి వైసీపీ అద్దంకి ఇన్‌చార్జి పాణెం చిన్న హనిమిరెడ్డి, అద్దంకి ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెంకట సుబ్బయ్య మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంకట సుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.


మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైసీపీ అద్దంకి ఇన్‌చార్జి పాణెం చిన్న హనిమిరెడ్డి

లింగ వివక్ష తగదు

సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి


విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి

పర్చూరు, జనవరి 31: లింగ వివక్ష చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. వీధి బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ బాలయోగి విద్యార్థినుల గురుకుల పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయాధికారి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ వీధి బాలలు ఎక్కడైనా కనబడితే ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే చట్టాలపై విద్యార్థినులు అవగాహన కల్గి ఉండాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంతరార్థాన్ని గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో స్వేచ్ఛా జీవితం


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

చీరాలటౌన్, జనవరి 31 : ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. బుధవారం వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఈపూరుపాలెం లైట్ హౌస్ చిల్డ్రన్స్ హోంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో పోక్సో యాక్ట్, బాల కార్మిక నిరోధక చట్టం వంటి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు సతీష్‌రెడ్డి, సురేష్, పీఎల్‌వీ మతీన్, నిర్వాహకులు జాన్ రాబర్ట్, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కమిషనర్‌కు సన్మానం

అద్దంకి, జనవరి31: అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై రామచంద్రాపురం వెళ్తున్న శ్రీనివాసులును బుధవారం పాలకవర్గం ఘనంగా సన్మానించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న మేనేజర్‌ను సన్మానించారు. చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు. బదిలీపై నూజివీడు నుంచి అద్దంకి వస్తున్న అబ్దుల్ రషీద్ గురువారం మధ్యాహ్నం బాధ్యతలు తీసుకోనున్నారు.


కమిషనర్ శ్రీనివాసులును సన్మానిస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు

కమిషనర్ బాధ్యతల స్వీకరణ

చీరాల, జనవరి 31 : నూతన మున్సిపల్ కమిషనర్‌గా విజయసారథి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రేపల్లె నుంచి బదిలీపై చీరాల మున్సిపాలిటీకి కమిషనర్‌గా నియమితులయ్యారు. ముందుగా కమిషనర్ స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణ అభివృద్ధికి పూర్తిస్థాయిలో అంకితభావంతో పనిచేస్తానని కమిషనర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరాంకు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సహోద్యోగులు, సిబ్బంది బొకేలు అందజేసి స్వాగతం పలికారు. తెలిపారు. సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం కౌన్సిల్ సాధారణ సమావేశంలో పాల్గొన్నారు.

చినగంజాం ఎంపీడీవో గుంటూరుకు బదిలీ

చినగంజాం, జనవరి 31 : చినగంజాం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కే.స్వరూపరాణి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈవోపీఆర్డీ ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం సాయంత్రం ఆమె రిలీవ్ అయినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో తెలిపారు.

వాసవీ క్లబ్ నూతన కమిటీ ఎంపిక


వాసవీ క్లబ్ నూతన కమిటీ సభ్యులు


మార్టూరు, జనవరి 31: మార్టూరు వాసవీ క్లబ్ నూతన కమిటీ సభ్యుల ఎంపిక బుధవారం స్థానిక ఆర్య వైశ్య కమ్యూనిటీ భవనంలో జరిగింది. అధ్యక్షులుగా మోదడుగు మురళి, సెక్రటరీగా శ్రీరాం పవన్, ట్రెజరర్‌గా అర్వపల్లి సురేంద్రలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా సుదర్శన్, సాయి, చంద్రకళలు విచ్చేయగా స్థానిక నాయకులు శ్రీరాం శివ, పొత్తూరి శివ తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు ఎంపీడీవో బదిలీ

పంగులూరు, జనవరి 31 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పంగులూరు ఎంపీడీవో బి.రామాంజనేయులు బదిలీ అయ్యారు. ఆయన్ను నెల్లూరు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడగా బుధవారం ఆయన విధుల నుంచి రిలీవయ్యారు. బదిలీపై వెళుతున్న ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను సిబ్బంది కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో రమేష్, ఈవోఆర్డీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు సునీత, వందనం, శ్రీనివాసరావు, పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపీడీవోను సత్కరిస్తున్న సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

అద్దంకిటౌన్, జనవరి 31: పట్టణంలోని గరటయ్య కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సూపర్‌వైజర్ రమాదేవి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉన్న సమయంలో కేంద్రంలో ఉన్నకొన్ని కోడిగుడ్లు మురిగిపోవడంతో వాటిని రేణంగివరం రోడ్డులోని చెత్తకుండిలో పడవేశారని దీనిపై వార్తలు రాగా దానిపై పరిశీలించేందుకు కేంద్రానికి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉండాల్సిన పౌష్టికాహారం, గుడ్లు ఇతర వస్తువులను, సంబంధిత రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న వస్తువులు, రికార్డులలో ఉన్నవి ఎటువంటి వ్యత్యాసం లేదని తెలిపారు.


14 మద్యం బాటిళ్లు స్వాధీనం

చీరాలటౌన్, జనవరి 31: రైల్వే ప్లాట్‌ఫాంపై మద్యంకలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి 14 మద్యం బాటిళ్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతకొద్ది రోజులుగా కదిలే రైళ్లల్లో, ప్లాట్ ఫాంలపై రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే బుధవారం ఇరువురు వ్యక్తులు చీరాల ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సోదాలు చేశారు. వారి వద్ద 14 ఫుల్ బాటిల్స్ మద్యం సీసాలు పట్టుబడ్డాయి. వెంటనే వారిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరావు ఎస్సై కొండయ్య హెచ్చరించారు.

తహసీల్దార్ బదిలీ

పంగులూరు, జనవరి 31: మండల తహసీల్దార్ ఐ.పద్మావతి బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సమీపిస్తున్న తరుణంలో సీఈసీ ఆదేశాల మేరకు తహసీల్దార్ పద్మావతిని మచిలీపట్నం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు అందాయి.





సోమశిలలో 25.716 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం, జనవరి 31: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి జలాశయంలో 25.716 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నిన్న గోప్యత...
నేడు హడావిడి !

- అసైన్‌మెంట్ పట్టాల వ్యవహారంలో అవకతవకలు ?
- గ్రామసభలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక
- పట్టాలు కూడా పంపిణీ
- గ్రామసభలు పెట్టినట్లు చూపే ప్రయత్నం
- వైసీపీ నాయకుల ద్వారా సంతకాల సేకరణ
- భవిష్యత్‌లో విచారణ జరిగితే ఇరుక్కుంటామనే...?

నెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వేలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అయితే అందులో పారదర్శకత ఎంత అన్నదే అసలు ప్రశ్న. గ్రామసభలు పెట్టడం, లేదా లబ్ధిదారుల జాబితాను స్థానికంగా బహిర్గతం చేయడం వంటివి చేయలేదు. ఈ క్రమంలో జిల్లాలో అసైన్‌మెంట్ పట్టాల పంపిణీలో అవకతవకలు జరిగాయని మొదటి నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనర్హులకు కూడా భూమిని కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఎమ్మెల్యేలు చెబుతున్న లెక్కలకు, అధికారులు చెబుతున్న లెక్కలకు పొంతన ఉండడం లేదు. దీంతో అసైన్‌మెంట్ లబ్ధిదారుల జాబితాపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయినా ఉన్నతాధికారులెవరూ ఈ ఆరోపణలపై స్పందించలేదు.

● జరగపోయినా జరిగినట్లు...

గ్రామసభలు పెట్టకుండా లబ్ధిదారుల జాబితాను తయారు చేయడం నిబంధనలకు విరుద్ధం.దీంతో ఇప్పుడు తహసీల్దార్లు హడావిడిగా గ్రామసభలు పెట్టినట్లు చూపించే ప్రయత్నాలు చేస్తున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేయడం, వారికి పట్టాలు పంపిణీ చేయడం జరిగిపోయాక భవిష్యత్‌లో వచ్చే ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని వారు ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారి అసైన్‌మెంట్ జాబితా తయారీపై విచారణ జరిపితే ఇరుక్కుంటామని వారు భయపడుతున్నట్లు సమాచారం. గ్రామసభలు పెట్టకపోవడమే తప్పయితే ఇప్పుడు పెట్టకుండానే పెట్టినట్లుగా చూపించే ప్రయత్నాలు జరుగుతుండడం మరో పెద్ద తప్పు అని రెవెన్యూ వర్గాలే చర్చించుకుంటున్నాయి. గ్రామాల్లోని వైసీపీ నాయకుల ద్వారా ఆ గ్రామంలో గ్రామసభ పెట్టినట్లుగా పలువురి సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. వారితో పాటు స్థానిక సర్పంచి ద్వారా తీర్మానం తీసుకొని అంతా పారదర్శకంగా జరిగినట్లు చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రెవెన్యూ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నెల 31 నాటికి తహసీల్దార్ల బదిలీ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చే తహసీల్దార్లు తప్పులు చేసేందుకు భయపడతారు. దీంతో గత పది రోజులుగా పలు మండలాల్లోని తహసీల్దార్లు గ్రామసభలు పెట్టినట్లు సంతకాల సేకరణ పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది.



● గ్రామసభలతోనే పారదర్శకత

అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ గత నవంబరు నుంచి ప్రారంభమైంది. అంతకుముందు ఆరు నెలల నుంచే అర్హుల జాబితా సిద్ధం చేయడం మొదలైంది. మూడు వర్గాల వారికి పట్టాలు పంపిణీ చేశారు. భూమి లేని నిరుపేదలు ఎవరైతే ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారో వారితోపాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయడం మొదటిది. ఇనాం భూములను సాగు చేసుకుంటున్న కులవృత్తుల వారికి పట్టాలు అందించడం రెండోది. ఇక ఎవరైతే అసైన్‌మెంట్ పట్టాలు పొంది ఇరవైఏళ్లు పూర్తి చేసుకున్నారో వారికి ఆ భూమిపై పూర్తి హక్కులు కల్పిస్తూ ఒరిజినల్ పట్టాలు పంపిణీ చేయడం మూడోది. ఇలా ఈ మూడు విభాగాల్లో సుమారు 40 వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందులో మొదటి విడతలో కొత్తగా 4,313 ఎకరాల్లో అసైన్‌మెంట్ పట్టాలను 4,017 మందికి అందించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ మొత్తంలో అత్యధికంగా సర్వేపల్లి నియోజకవర్గంలోనే లబ్ధిదారులున్నారు. నిబంధనల ప్రకారం భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలంటే ముందుగా గ్రామసభలు నిర్వహించాలి. ఆ గ్రామంలోని భూమిని తొలుత ఆ గ్రామంలోని భూమిలేని వారికి పంపిణీ చేయాలి. వారికిపోను మిగిలితేనే ఇతర ప్రాంతాల వారికి ఇవ్వాలి. అలానే భూమి ఉన్న వారికి కొత్తగా భూమి ఇవ్వకూడదు. గ్రామసభలు పెట్టి దరఖాస్తుదారుల వివరాలను ప్రజలకు తెలియజేస్తే వారు అసైన్‌మెంట్ పట్టాలకు అర్హులా.. కాదా.. అన్నది వారు తెలియజేస్తారు. గతంలో అసైన్‌మెంట్ పట్టాలు పొందిన వారే ఇప్పుడు ఆ భూమిని సాగు చేసుకుంటారా.. లేదా..? అన్నది తెలుస్తుంది. అప్పుడు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. కానీ గ్రామసభలు పెట్టకపోవడంతో ఎవరికి భూములు పంపిణీ చేశారన్న విషయం స్థానికులకు తెలియడం లేదు. అయితే చాలా చోట్ల ఇతర ప్రాంతాల వారికి, భూమి ఉన్న వారికి అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఇక రెండో విడత కింద మరికొంతమందితో లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదించారు. అయితే అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు ఎక్కడా కూడా ప్రత్యక్షంగా జరగకపోవడం గమనార్హం.


గడప గడపకు..
పనులకు బిల్లులేవి ?

- వర్కులు చేయాల్సిందేనని ఎమ్మెల్యే ఒత్తిడి
- ముందుకురాని కాంట్రాక్టర్లు
- అయోమయంలో అధికారులు

కావలి, జనవరి 31: కావలిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులు చేయించడం అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. నిధులు త్వరగా వస్తాయనే నమ్మకంతో తొలుత కొన్ని పనులు పూర్తి చేసినా ఇంకా ఆ బిల్లులు కాంట్రాక్టర్ల చేతికి అందలేదు. దీంతో మలివిడత పనులకు వారు వెనుకంజ వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ వస్తుందనే ప్రచారం జరుగుతుండటం, ఈలోపు అధికారుల బదిలీలు ఉండడంతో పనులు చేసి బిల్లులు ఆగిపోతే ఎలా ? అనే ఆందోళనతో కాంట్రాక్టర్లు ముందుకు రావటంలేదు. అయితే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, తన అనుచరులతో కలిసి ఇటీవల మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గడప గడపకు కార్యక్రమంలో మంజూరైన పనులను ఎట్టి పరిస్థితిలోనూ పూర్తి చేయాల్సిందేనని ఆ సమావేశంలో ఆదేశాలు ఇచ్చారు. చేసిన పనులకు చేసినట్లు బిల్లులు పెడితే వాటిని వెంటనే ఇప్పిస్తానని కూడా హామీ ఇచ్చారు. దీంతో అధికారులు క్వాలిటీ కంట్రోల్ చెకింగ్ లేకుండా, నాణ్యతను పరిశీలించకుండానే కావలి మున్సిపాలిటీలో పూర్తి చేసిన పనులకు బిల్లులు పెట్టారు. వాటిని ప్రభుత్వానికి అందచేసినా ఇంతవరకు నిధులు రాలేదు. దీంతో మలివిడత పనులు చేసినా బిల్లులు వస్తాయో... రావోనన్న భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రావటంలేదు. కొందరు వైసీపీ నేతలు తమకు అనుకూలురైన ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో అయితేనే తాము పనులు చేస్తామని చెబుతుండగా, అది వీలు పడదని సంబంధిత అధికారులు అంటున్నారు. కాగా ఎన్నికల తరువాత ప్రభుత్వం మారితే పరిస్థితి ఏమిటన్నది కూడా కాంట్రాక్టర్లు బేరీజు వేస్తున్నారు.

● కావలికి రూ.11.20 కోట్లు

గడప గడపకు మన ప్రభుత్వం కింద కావలి మున్సిపాలిటీ పరిధిలోని 28 సచివాలయాలకు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున మొత్తం రూ11.20 కోట్లు మంజూరు చేశారు. మున్సిపాలిటీలో అత్యవసరమైన 239 పనులు గుర్తించారు. వాటిలో ఇప్పటికి 24 పనులకు అనుమతులు లభించాయి. తొలివిడతగా రూ.1.84 కోట్ల విలువైన పనులు పూర్తి చేయగా, వాటికి ప్రభుత్వం రూ.86 లక్షలు విడుదల చేసింది. వాటి బిల్లులను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా ఇంకా కాంట్రాక్టర్లకు నిధులు అందలేదు. మరో రూ.2 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరికొన్ని పనులు టెండర్ల దశలో ఉన్నాయి. అయితే ప్రస్తుతం చేసిన పనులకే బిల్లులు రాకపోవటంతో కొత్త పనులు ఎప్పుడు చేయాలి ? వాటికి బిల్లులు ఎప్పుడు వస్తాయి ? ఒకవేళ ప్రభుత్వం మారితే మన పరిస్థితి ఏమిటి ? అనే ఆందోళనలో కాంట్రాక్టర్లు, వైసీపీ నాయకులు ఎవరూ సాహసం చేయటం లేదు. దీంతో గడప గడపకు పనులు ఈ ప్రభుత్వ హయాంలో పూర్తి చేయటం సాధ్యమేనా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గడప గడపకు.. కార్యక్రమంలో భాగంగా కావలి కనకదుర్గమ్మ గుడివీధిలో వేసిన సీసీ రోడ్డు

ధైర్యంగా ఉండండి..
పార్టీ అండగా ఉంటుంది !

- చంద్రబాబు మాటగా చెప్పమన్నారు...
- ఏ కష్టం వచ్చినా మా దగ్గరకు రావొచ్చు !
- బాబు అరెస్టుతో మరణించిన వారి కుటుంబాలకు భువనేశ్వరి భరోసా
- నేడు గుడ్లూరు, కొండాపురం మండలాల్లో పర్యటన



టెంకాయచెట్లపాలెంలో సుందరరావు భార్యాపిల్లలను ఓదార్చుతూ..

ఉలవపాడు, జనవరి 31: "పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం ఎలాంటి బాధలను, కష్టాలను అనుభవిస్తుందో తెలుసు.. మీరు అధైర్యపడొద్దు.. ధైర్యంగా ఉండండి.. మీ కుటుంబాలకు అన్నివిధాలా టీడీపీ అండగా ఉంటుంది.. మనమంతా కుటుంబ సభ్యులమే.. చంద్రబాబు మాటగా చెప్పమన్నారు".. అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆమె ఉలవపాడు మండలంలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మనస్తాపంతో గుండె ఆగి చనిపోయిన కరేడు పంచాయతీ పరిధి టెంకాయచెట్లపాలెం మత్స్యకార కుటుంబానికి చెందిన వాయిల సుందరరావు కుటుంబ సభ్యులను తొలుత పరామర్శించారు. మృతుడి భార్య పద్మ, ఐదేళ్ల కుమారుడు గోవర్ధన్, తల్లిదండ్రులను ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బడిఈడు రాగానే పిల్లవాడి చదువు బాధ్యతను పార్టీ చూసుకుంటుందని, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తామని చెప్పి రూ. 3 లక్షల చెక్కును వారికి అందచేశారు.

● పింఛన్ ఇప్పించండి

తనకు ఓ కన్ను కనపడదని, పింఛను ఇవ్వడం లేదని, టీడీపీ ప్రభుత్వం వస్తే పింఛను ఇప్పించాలని మృతుడి సుందరరావు తల్లి భువనేశ్వరిని కోరారు. రాబోయే మన ప్రభుత్వంలో తప్పకుండా పింఛన్ తీసుకుంటారని ఆమె భరోసా ఇచ్చారు. భువనేశ్వరిని చూడటానికి వచ్చిన మండల ప్రజలకు ఆమె అభివాదం చేయగా.. జై టీడీపీ, జై చంద్రబాబు.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఆత్మకూరు ఎస్సీ కాలనీకి చెందిన ఎండ్లూరి చినకోటయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని ముచ్చటించారు. చినకోటయ్య భార్య యలమందమ్మకు రూ.3 లక్షల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమ సమస్యలను ఆమెకు చెప్పుకున్నారు. స్పందించిన భువనేశ్వరి "మీకున్న సమస్యలు ఒక కాగితంపై రాసి మీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావుకు ఇవ్వండి. పార్టీ అండగా ఉంటుంది' ..అని వారికి భరోసా ఇచ్చారు.

● ఘన స్వాగతం

తొలుత సింగరాయకొండ బైపాస్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భువనేశ్వరి రాకకోసం ఎదురు చూడగా, సాయంత్రం 5.45 గంటలకు ఆమె చేరుకున్నారు. కందుకూరు టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులతో ర్యాలీగా ఆయా గ్రామాలకు బయలుదేరారు. దారి పొడవున గ్రామాల్లో భువనేశ్వరిని చూసేందుకు, ఆమెతో సెల్ఫీ దిగేందుకు మహిళలు పోటీ పట్టారు. ఆమె వెంట నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, ఉన్నం నళినిదేవి తదితరులు ఉన్నారు.



ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామ ఎస్సీ కాలనీలో మృతుడు ఎండ్లూరి చినకోటయ్య భార్య యలమందమ్మకు రూ. 3లక్షల చెక్కును అందిస్తున్న నారా భువనేశ్వరి



టెంకాయచెట్లపాలెంలో విక్టరీ సింబల్ చూపుతున్న భువనేశ్వరి

కందుకూరులో రాత్రి బస

కందుకూరు, జనవరి 31: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలంలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి బుధవారం రాత్రి కందుకూరు సమీపంలోని ఆలావారి కల్యాణ మండపంలో బసచేశారు. ఉలవపాడు మండలంలో పర్యటన అనంతరం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఆమె ఆలావారి కల్యాణ మండపానికి చేరుకున్నారు. బసకు సిద్ధంగా ఉంచిన బస్సులోకి వెళ్లారు. కాగా గురువారం ఉదయం గుడ్లూరు, కొండాపురం మండలాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు.



మార్గమధ్యంలో విద్యార్థినులతో కరచాలనం చేస్తున్న నారా భువనేశ్వరి



ఉలవపాడు మండలం కరేడు ర్యాంపు వద్ద భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

'ఆసరా'పై నిరాసక్తి

- సభ నుంచి వెనుతిరిగిన పొదుపు మహిళలు
- అడ్డుకున్న వీఏవోలు
- బతిమలాడుకున్న వెలుగు సిబ్బంది
- మరికొందరి బెదిరింపు

సీతారామపురం, జనవరి 31: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ మైదానంలో బుధవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రెండు రోజులుగా సంఘ బంధం కార్యాలయ సీసీలు, వీవోఏలు మండలంలో తిరిగి పొదుపు మహిళలంతా సమావేశానికి రావాలని ఒత్తిడి తెచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ఉంటుందని, 12 గంటలలోపే అందరిని తరలించారు. రెండుగంటలకు రావాల్సిన రాజగోపాల్‌రెడ్డి నాలుగు గంటలకు వచ్చారు. దీంతో పొదుపు మహిళలు అసహనానికి గురయ్యారు. సమావేశం ప్రారంభమైన 10 నిమిషాల నుంచే అందరూ వెనుతిరగడం మొదలు పెట్టారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడక ముందే సగంమంది మహిళలు వెళ్లిపోయారు. దీంతో ఆయన అధికారులపై అసహనం ప్రదర్శించారు. కాగా సమావేశం నుంచి వెళుతున్న పొదుపు మహిళలను వీఏవోలు అడ్డుకున్నారు. అదే సమయంలో వెలుగు సిబ్బంది కూడా వారిని బతిమలాడుకోవడం కనిపించింది. 'మీరు సమావేశం నుంచి వెళ్లిపోతే రుణమాఫీ మంజూరు సమయంలో సంతకాలు పెట్టం... అంటూ మరి కొందరు బెదిరింపులకు దిగారు. మొత్తం మీద ఆసరా చెక్కుల కార్యక్రమంపై పొదుపు మహిళలు ఆసక్తి కనబరచపోవడం చర్చకు దారితీసింది.



పొదుపు మహిళలను అడ్డుకున్న వీవోఏలు



సభలో కూర్చోమని బతిమలాడుతున్న వెలుగు సిబ్బంది

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

నెల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు పోస్టుల్లో అధికారులను నియమించింది. తిరుపతి ఏపీఐఐసీలో పనిచేస్తున్న ఎం. శ్రీనివాసులను టీజీపీ రాపూరు యూనిట్ ఎస్‌డీసీగా బదిలీ చేసిన ప్రభుత్వం, ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన సీహెచ్ పద్మావతిని సివిల్ సప్లయాస్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది.

● తహసీల్దార్‌లు...

నెల్లూరు(హరనాథపురం) : జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను బదిలీ చేస్తూ అదనపు సీసీఎల్‌ఏ, కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన తహసీల్దార్లలో టీ. శ్రీనివాసులు, ఎస్‌కేఎండీ హుస్సేన్, ఎస్.రామ్మోహన్, పీ హేమంత్‌కుమార్, కే చంద్రశేఖర్, డీ శ్రీరామకృష్ణ, ఏపీ రమణరావు, వై. నాగరాజు, పీ. లక్ష్మీనరసింహం, చొప్పా రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రావు, ఏ నిర్మలానందబాబా, సీహెచ్ సుబ్బయ్య, ఎం.పద్మజ, వీ. లావణ్య, ఈ.రమాదేవి, వీ సుధీర్, బీ సోమ్లానాయక్, కే రాజ్యలక్ష్మి, ఆర్ సూర్యనారాయణసింగ్, సుందరమ్మ, షేక్ షఫీమాలిక్, టీ విజయకుమార్, జీ రాఘవేంద్రరావు, పీ శాంతకుమారి, పీ శ్యామలమ్మ, కే స్ఫూర్తి, పీ విజయకుమార్, ఎం.సుభద్ర, పీ. అనురాధ, పీ గీతావాణి, ఎస్.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్‌ఐలకు స్థానచలనం

నెల్లూరు(క్రైం), జనవరి 31: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖలో పనిచేస్తున్న పలువురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ల (ఆర్‌ఐలు)ను బదిలీ చూస్తూ బుధవారం రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా నుంచి ముగ్గురు ఆర్‌ఐలు బదిలీ కాగా, ఇతర జిల్లాల నుంచి నలుగురు ఆర్‌ఐలకు జిల్లాకు రానున్నారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రాంతం
డి శ్రీనివాసరెడ్డి	నెల్లూరు	బాపట్ల
షేక్ మౌలుద్దీన్	నెల్లూరు	బాపట్ల
వై పౌల్‌రాజు	నెల్లూరు	తూర్పుగోదావరి
కె హరిబాబు	పీఎస్‌డబ్ల్యూ విజయవాడ	నెల్లూరు
జే రాజారావు	గుంటూరు	నెల్లూరు
కె థామస్‌రెడ్డి	గుంటూరు	నెల్లూరు
కె నాగరాజు	సీఏఆర్ విజయవాడ	నెల్లూరు

పోలింగ్ ఏజెంట్లను
నియమించుకోండి

- రాజకీయ పార్టీలతో కలెక్టర్



నెల్లూరు (హరనాథపురం), జనవరి 31: రాజకీయ పార్టీల వారు పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2,317 పోలింగ్ స్టేషన్లకు 2,317 మంది బీఎల్‌వోలను, 232 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్ల తుది జాబితాపై వస్తున్న ఫిర్యాదులను ఈసీ నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. సమావేశంలో డీఆర్వో లవన్న, వైసీపీ నేత వై. మురళీరెడ్డి, టీడీపీ నాయకుడు ఎస్కే రసూల్, బీజేపీ నేత బీ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకుడు బాల సుధాకర్, సీపీఎం నేత దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణం

● నాలుగేళ్లుగా కొనసాగుతున్న పనులు

ఉదయగిరి, జనవరి 31: మండలంలోని అనేక పంచాయతీల పరిధిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ భవనాలు నత్తనడకన సాగుతున్నాయి. మండలంలో ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, ఆర్‌బీకేకు రూ.21 లక్షలు, హెల్త్ సెంటర్‌కు రూ.17 లక్షలు కేటాయించారు. ఉదయగిరి సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాలు ఒకే చోట నిర్మిస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. అలాగే నేలటూరు సచివాలయ పరిధిలోని భవనాలకు నిధుల లేమితో పనులకు గ్రహణం పట్టింది. నాలుగేళ్లుగా నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో పనులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. పాత భవనాల్లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. బిల్లులు సకాలంలో చెల్లించి పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయా సచివాలయాల ప్రజలు



ఉదయగిరిలో అసంపూర్తిగా హెల్త్ సెంటర్ నిర్మాణం

కోరుతున్నారు. అర్థాంతరంగా ఆగిన భవనాలు అసాంఘీక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కులగణన సర్వే పరిశీలన



కులగణన సర్వే పరిశీలిస్తున్న డీబీసీడబ్ల్యువో

ఆత్మకూరు, జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో, మండలంలో చేపట్టిన కులగణన సర్వే 89 శాతం పూర్తయిందని డీబీసీడబ్ల్యువో వై వెంకటయ్య తెలిపారు. బుధవారం ఆయన సచివాలయ సిబ్బంది, వాలంటీర్లుతో కలిసి మున్సిపాల్టీ పరిధిలో పలు కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి డాక్యుమెంట్లు చూపించవలసిన అవసరం లేదని మౌఖికంగా తెలియజేయాల్సిన అంశాలను మాత్రమే నమోదు చేస్తారని ఆయన తెలిపారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

చేజర్ల, జనవరి 31: మండలంలోని పెరుమాళ్ళపాడు ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల, సచివాలయ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్ వాసు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుండే సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ ప్రసాద్, అధ్యాపకులు ఎమ్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

సంగం, జనవరి 31: స్థానిక ఎంపీడీవోగా పనిచేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన గోపీని కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీవోపీఆర్డీ రమేష్, కార్యాలయ సిబ్బంది, సెక్రటరీలు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో బుధవారం జరిగిన నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొన్న నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీమతి శాంతకుమారి

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 31: నర్రవాడలో శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మ ప్రచార వారోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు మండలంలోని బండ కిందపల్లి గ్రామ శ్రీసీతా రాములస్వామి ఆలయంలో అష్టోత్తర పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు కల్యాణోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. గ్రామోత్సవం చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు బెల్లంకొండ పెద్దభద్రయ్య, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ఆత్మకూరు, జనవరి 31 : పట్టణంలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో అబ్యాస్ అకాడమీ వారు ఈనెల 7న నిర్వహించిన సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సాట్)లో రాష్ట్ర ర్యాంకు సాధించిన విద్యార్థులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రగతి ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ అమరావతి, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించి అభినందించారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ఏఎస్ పేట, జనవరి 31: నియోజకవర్గ స్థాయిలో బుధవారం ఆత్మకూరులో ఎంఎంటిఎస్ స్టేజ్- 2 పరీక్షలలో ఠాగూర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ రమణరెడ్డి తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి కే మోహన్ నరేంద్ర ప్రథమ స్థానం, వి యషిత ఐదవ స్థానంలో నిలిచారని తెలిపారు. వారిని హెచ్ఎం దొరస్వామిరెడ్డి, కరస్పాండెంట్ రమణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి

ఉదయగిరి రూరల్, జనవరి 31: నెల్లూరులో ఈనెల 5,6వ తేదీల్లో నిర్వహించే ట్రెజరీ క్రీడా పోటీలకు ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయ ఉద్యోగులను క్రీడల్లో పాల్గొనాలని ఆహ్వానించి అనంతరం గోడ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ట్రెజరీ ఉద్యోగులు

పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోడ సుబ్రహ్మణ్యం, ఉప ఖజానాధికారులు చిట్టేటి మమత, దయాకర్, సీనియర్ అకౌంటెంట్‌లు బొమ్మతట్టు శ్రీహరి, కిశోర్‌కుమార్, క్రీడా కమిటీ సభ్యులు నరేంద్ర, చంద్ర, మాలకొండరావు, ఆదిత్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అల్పాహారానికి ఆర్థిక చేయూత

ఉదయగిరి రూరల్, జనవరి 31: మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందించేందుకు బుధవారం దాతలు చేయూతనందించారు. 60 రోజులపాటు జరిగే స్టడీ కార్యక్రమానికి సాయంత్రం సమయంలో అల్పాహారం అందించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థులు కల్లూరి రవిరెడ్డి, దేవసాని జనార్ధన్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు ఫణిరాజ్, సుబ్బారెడ్డిలు సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

బీజేపీ అభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

వరికుంటపాడు, జనవరి 31: మండలంలో ప్రతిఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం నూతన మండల కమిటీ అధ్యక్షునిగా ఏనుగు ప్రభాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకొని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు, మండల ఇన్‌చార్జి నారాయణరెడ్డి, శివారెడ్డి, పరంధామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యం : ముప్పాళ్ల

ఉదయగిరి రూరల్, జనవరి 31: ప్రజాసేవ చేసేందుకే జైభారత్ పార్టీ పెట్టినట్లు ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పాళ్ల శ్రీరామరాజు పేర్కొన్నారు. బుధవారం ఉదయగిరి పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే పార్టీ ధ్యేయమన్నారు. మద్యపాన నిషేధం బాధ్యత మహిళల చేతికే ఇవ్వడం జరుగుతుందన్నారు.జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి కూడా ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్టీ కోర్సులతో ఉజ్వల భవిష్యత్

ఆత్మకూరు, జనవరి 31 : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు మల్టీ కోర్సులను అభ్యసించాలని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ డైరెక్టర్ డాక్టర్ జె శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉన్నతవిద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు భవిష్యత్‌లో పనికివచ్చే మల్టీ కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ అడ్మిషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ షణ్ముఖకుమార్, ఏఎస్ఆర్, బిఎస్ఆర్ జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు ఎం సుబ్బారెడ్డి, శ్రీనివాసులునాయుడు, ఎస్వి జూనియర్ కళాశాల చైర్మన్ కె అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

చేజర్ల: మండలంలోని బిల్లుపాడు, యనమదల గ్రామాలలో బుధవారం ఆత్మకూరు శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ పీర్ల పార్థసారథి, గోతం వెంకటసుబ్బయ్య, వీరరాఘవరెడ్డి, నోటి సుందరరామిరెడ్డి, తిరపతిరెడ్డి, సుధాకరరెడ్డి, నాగార్జున, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆసరా మహిళలకు చెక్కుల పంపిణీ

ఉదయగిరి, జనవరి 31: మహిళా సాధికారతే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చెక్కులు అందజేశారు. అలాగే ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీపీ మూలె పద్మజావినయ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీఎం ఖాజారంతుల్లా, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, ఇత్తడి రమణయ్య, అడసుమల్లి వెంకటేశ్వర్లు, అక్కి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

ఉదయగిరి రూరల్, జనవరి 31: మండలంలోని కృష్ణంపల్లి, జీ.చెరువుపల్లి గ్రామాలకు చెందిన వంశీ, రామరాజులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొన్న నియోజకవర్గ టీడీపీ నాయకులు, కాకర్ల ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ బుధవారం తన ప్రతినిధులతో వారికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి తుమ్మల భాస్కర్, కిరణ్‌చౌదరి, జల్సాయాదవ్, హరీష్‌యాదవ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

4న వరికుంటపాడు మండల సమావేశం

వరికుంటపాడు, జనవరి 31: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

'ఉపాధి'లో అవకతవకలు

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం
● రూ.89,069 రికవరీకి అధికారుల ఆదేశం

లింగసముద్రం, జనవరి 31 : మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.9.39 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ పనులపై గత 10 రోజులుగా గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి కూలీలను విచారించారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో యూ.శేషుబాబు అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డీ వెంకట్రావు పాల్గొన్నారు. గ్రామాల్లో డీఆర్పీలు గుర్తించిన లోపాలను, అవకతవకలను గ్రామ పంచాయతీల వారీగా చదివి వినిపించారు. అంగిరేకులపాడులో గంటా శ్రీను, ఆయన భార్య లక్ష్మీ హైదరాబాద్‌లో ఉండగా వారు 5 వారాలు పనులకు వచ్చినట్లు నమోదు చేసి రూ.10,952 డ్రా చేశారు. అలాగే చెన్నై, హైదరాబాద్‌లో ఉంటున్న గల్లా సాయిరామ్ రూ4,343, గంటా రఘరామయ్య రూ.4,657, మాలపాటి మహేంద్రల పేరుతో రూ.8,984 స్వాహా చేశారని చెప్పారు. ఇదే గ్రామంలో రూ.5,89,253తో నిర్మించిన వరదకట్ట మట్టిని ఎత్తుకెళ్లడంతో ఆ నిధులు నిరుపయోగమయ్యాయి. ఇద్దరు వలంటీర్లు నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులకు వెళ్లినట్లుగా గుర్తించారు. పెదపవనిలో కూడా షేక్ అలియాజ్, రహంతుల్లా మరో ఇద్దరు పనికి వెళ్లకపోయినా వారి పేరుతో రూ.3,200 స్వాహా చేశారు. ఇదే గ్రామంలో చెరువుల్లో చేసిన పనుల్లో కొలతల్లో వచ్చిన తేడాలతో రూ.5,40,000 అదనంగా ఖర్చు చేసినట్లు చెప్పారు. లింగసముద్రంలో దిడ్డి మాల్యాద్రి అనే రైతు నిమ్మ మొక్కలు వేయగా, ప్రసుత్తం ఆ పొలంలో మొక్కలు లేవు. దీంతో రూ.42,800 దుర్వినియోగమైనట్లు పేర్కొన్నారు. తిమ్మారెడ్డిపాలెంలో కేసంరెడ్డి వెంకటరామిరెడ్డి ఈ పథకంలో జామ మొక్కలు వేశారు. కానీ కాపు కాయలేదనే కారణంతో వాటిని తొలగించి,



ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

మిరపపైరు సాగు చేశారు. దీంతో రూ.17,000 దుర్వినియోగమైనట్లు చెప్పారు. చాలా గ్రామాల్లో చెరువులు, కాలువల్లో పూడిక తీతలు, మొక్కలు లేకపోవడం లాంటి వాటిల్లో రూ.30 లక్షలు తేడా వచ్చినట్లు గుర్తించారు. దీనికి సిబ్బందిపై రూ.15 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. అలాగే నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయకుండానే రూ.1,20,000 స్వాహా చేశారని తెలిపారు. ఈ అవకతవకలకు సంబంధించి సిబ్బంది నుంచి రూ.89,069 రికవరీకి ఆదేశించినట్లు పీడీ వెంకట్రావు చెప్పారు. వీటిలో అంగిరేకులపాడు ఎఫ్ఏ నుంచి రూ.40,824, రికవరీకి ఆదేశించినట్లు చెప్పారు. త్వరలో ఈ మొత్తాన్ని ఎఫ్ఏల నుంచి రికవరీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవీవీ సురేషబాబు, ఏపీడీ మృదుల, అంబుడ్స్‌మెన్ ఎం వెంకటరామిరెడ్డి, ఎస్ఆర్పీ కె వెంకయ్య, ఏఈ ఎ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పొగతో వలయాకారం!

● వింతగా చూసిన ప్రజలు

అల్లూరు, జనవరి 31 : అల్లూరులో బుధవారం వింత చోటు చేసుకుంది. సాయంకాల సమయంలో ఆకాశంలో పొగతో రెండు వలయాలు ఏర్పడ్డాయి. ఈ వలయాలు అసలు ఏమిటని ముందుగా ఆందోళన చెందిన ప్రజలు తీక్షణంగా పరిశీలించగా పొగతో కూడుకున్నవిగా భావించారు. పొగ ఎటువంటి



ఆకాశంలో పొగతో ఏర్పడిన వలయాకారం

ఆకారంలో ఉన్నా ఒక్క నిమిషంలోపు సాధారణంగా మారిపోతోంది. కానీ ఇవి 20 నిమిషాల పాటు ఉండడంతో ప్రజలు ఆశ్చర్యంగా చూశారు. చివరకు అల్లూరు సబ్‌స్టేషనులో రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు చెలరేగడంతో అందులో నుంచి వచ్చిన పొగ వలయాలుగా ఏర్పడి గ్రామంపైకి రావడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. కొద్దిసేపటికి అవి గాలిలో కలసిపోయాయి. అందరూ దీనికి ఆసక్తిగా చూడడంతో చర్చనీయాంశంగా మారింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరులోని 133 కేవీ సబ్‌స్టేషనులో ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపాలతో బుధవారం సాయంత్రం కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉండే సీటీ ఒక్కసారిగా పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనతో అల్లూరుతోపాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు అసహనానికి గురయ్యారు.

ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యత : ఆర్టీవో

కావలి రూరల్, జనవరి 31: రహదారి ప్రమాదాలు అరికట్టడం అందరి బాధ్యత అని ఆర్టీవో వై.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలల్లో భాగంగా పట్టణంలోని లారీ ఒనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం యూనియన్ అధ్యక్షుడు మండలి



మాట్లాడుతున్న ఆర్టీవో సుధాకర్‌రెడ్డి

క్రిష్ణారావు అధ్యక్షతన వివిధ వాహనాల డ్రైవర్లకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డ్రైవర్లు వాహనాలు నడుపుతూ గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేసి ఆగిన గుండె కొట్టుకునేలా చేసే విధానంపై వైద్యులు చైతన్య, రేవంత్, రమ్యలు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రైవర్లకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా లారీ యూనియన్ నాయకులు ఆర్టీవో, రవాణాశాఖ అధికారులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుందరరావు, ఏఎంవీఐ కరుణాకర్, లారీ యూనియన్ నాయకులు రంగారెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్, నరేంద్ర, వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, సద్గుణ, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు డబ్బు లేదు.. దమ్ముంది

● కలిగిరిలో జయహో బీసీ సదస్సు

కలిగిరి, జనవరి 31: రాష్ట్రంలో బీసీలను ఆదరించేది ఒక్క తెలుగుదేశంపార్టీ అని, బీసీలకు డబ్బు లేదు.. కానీ దమ్ముందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పీ చెంచల బాబు యాదవ్, బీసీ రాష్ట్ర ముదిరాజ్ సాధికారక కన్వీనర్ పీఎల్ రావు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం కలిగిరి, జలదంకి మండలాల బీసీ నాయకులతో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ ఓట్లతో గద్దెనెక్కిన వైఎస్ జగన్ బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి బీసీలను ఆర్థికంగా అణిచివేశాడన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ తన సామాజిక వర్గానికి చెందిన వారికే అత్యున్నత పదవులు కట్టబెట్టుకొని బీసీలకు మొండి చేయి చూపాడన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీల సత్తాను చూపి ఉదయగిరి నియోజకవర్గంలో బొల్లినేని వెంకటరామారావుని ఎమ్మెల్యేగా చేసుకోవడంతోపాటు, సీఎంగా చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలిగిరి, జలదంకి టీడీపీ మండల కన్వీనర్లు బిజ్జం క్రిష్ణారెడ్డి, పీ.మధురెడ్డి, బీసీ నాయకులు ఉప్పు భాస్కర్, ఎస్కే సుభాన్, జ్ఞానేంద్ర, గంజాం రాఘవేంద్ర, కాకు మహేష్, శ్రీకుర్తి రవీంద్రబాబు, మొక్కా బాబు తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

పని మాకు.. ఫలితం మరొకరికా?

● వైద్యాధికారికి ఏఎన్ఎంల మొర

వలేటివారిపాలెం, జనవరి 31 : అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు చేసేది ఏఎన్ఎంలు.. ఇన్సెంటివ్ ఇచ్చేది మాత్రం ఎంఎల్‌హెచ్‌పీలకా అని ఏఎన్ఎంలు ప్రశ్నించారు. ఈ మేరకు.. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివకు ఏఎన్ఎంలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ వర్క్, ఆర్‌సీహెచ్ పోర్టల్ మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆన్‌లైన్ సేవలు మొత్తం ఏఎన్ఎంలు మాత్రమే చేస్తునట్లు పేర్కొన్నారు. ఇక నుంచి మేము ఆన్‌లైన్ సేవలు చేయదలుచుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంలు లావణ్య, విజయకుమారి, కళ్యాణి, రాజేశ్వరి, బాలకోటమ్మ, విజయమ్మ, వాసంతి, అనీత, ప్రమీల, రత్నకుమారి, చెంచులక్ష్మి, అంజని, శ్యామల పాల్గొన్నారు.



డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

ఆరుతడి పంటలు వేసుకోండి

కావలి, జనవరి 31: చెరువులో నీరు తక్కువగా ఉన్నందున వరి నాట్లు వేస్తే నష్టపోతారని, ఆరుతడి పంటలు వేసుకోవాలని మండల వ్యవసాధికారి లలిత, నీటిపారుదల శాఖ ఏఈ జంపాని కిరణ్ రైతులకు సూచించారు. వారిద్దరు బుధవారం కావలి రూరల్ మండలంలోని సిరిపురం, చలంచర్ల గ్రామాల్లో పర్యటించారు. అక్కడ రైతులు ఇంకా వరి నాట్లు వేస్తుండటంతో చెరువులో నీరు తక్కువగా ఉన్నందున వరినాట్లు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి నీటి లభ్యతపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం చెరువులో నీరు తక్కువగా ఉన్నందున ఇప్పుడు వరినాట్లు వేస్తే నీరు చాలదని పంటలు పండక పెట్టుబడులు పెట్టి రైతులు నష్ట పోవద్దని తెలిపారు. ఆరు తడిపంటలు వేసుకోవాలని సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ వ్యవసాయసహాయకులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కందుకూరు పట్టణ ఎస్ఐగా ఆనంద్‌భాస్కర్ బాధ్యతల స్వీకరణ



కందుకూరు, జనవరి 31: కందుకూరు పట్టణ ఎస్ఐగా ఆనంద్‌భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన హనీఫ్ సంక్రాంతి పర్వదినం సందర్భంగా జూదరుల వద్ద అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావటంతో జిల్లా ఎస్పీ తక్షణం వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు దిశ పోలీసుస్టేషన్ నుంచి బదిలీ అయిన ఆనంద్‌భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

కందుకూరు, జనవరి 31: కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జరిగిన బదిలీలలో భాగంగా కందుకూరులో 4ఏళ్ల 4నెలలు సుదీర్ఘకాలం పనిచేసిన ఎస్.మనోహర్ స్థానంలో బద్వేలు కమిషనర్‌గా ఉన్న కృష్ణారెడ్డిని ఇక్కడ నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బిట్రగుంట, జనవరి 31: బోగోలు మండలంలోని పలు కుటుంబాలను కావలి టీడీపీ నాయకుడు కావ్య కృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. కోవూరుపల్లికి చెందిన టీడీపీ నేత ఇందుపూరు ధనంజయరెడ్డి కుమారుడు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బోగోలు వైసీపీ సీనియర్ నాయకుడు తూపిరి పెంచలయ్య ఉత్తర క్రియల్లో పాల్గొన్ని సంతాపం తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు నాయకులు ఐ.రామురెడ్డి, తిరుపతిరెడ్డి, ఎల్.నాటకరాణిభాస్కర్, ఎస్.రంగయ్య, తదితరులు ఉన్నారు. అలాగే తూపిరి పెంచలయ్య ఉత్తర క్రియల్లో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్.మాల్యాద్రి, సర్పంచులు పీ.అనిత, సురేష్‌గౌడ్, యు.మాచర్ల, మాజీ సర్పంచి కే.కృష్ణయ్య, పాల్గొన్నారు. అలాగే కావలి, అల్లూరు, దగదర్తికి నేతలతోపాటు పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో కుక్కల స్వైరవిహారం

లింగసముద్రం, జనవరి 31 : మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాఠశాలలో విచ్చలవిడిగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. దీంతో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది హడలిపోతున్నారు. ఇటీవల ఒక బాలికను కుక్క కరవడంతో ఆ బాలికను తలిదండ్రులు ఇంటికి తీసుకెళ్లి చికిత్స చేయించుకున్నారు. రెండు రోజుల క్రితం పాఠశాల గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరిని కుక్క కరిచింది. అలాగే బుధవారం పాఠశాల స్వీపర్ ఒకరిని కుక్క కరవగా ఆమె లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకొని వెళ్లింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు వారి తలిదండ్రులు కోరుతున్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

కందుకూరు, జనవరి 31: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవన నిర్మాణం కోసం కోవూరు గ్రామసర్పంచు ఆవుల మాధవరావు బుధవారం రూ.28,216 విరాళంగా అందజేశారు. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు నలబోతుల మురళి, కాటా చెంచురామయ్యలకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గాండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతులు

కావలిటౌన్, జనవరి 31: రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన గణిత శాస్త్ర పోటీల విజేతలకు బుధవారం సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. జనతాపేటలోని విశ్వశాంతి పాఠశాలలో ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి విశ్రాంత వసతిగృహ సంక్షేమ అధికారి షేక్ ఖాదర్‌బాషా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ ఎన్‌వీ రమణయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కణ్యాణి, ఖాదర్‌బీ, రఘునందనరావు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకును సందర్శించిన విద్యార్థులు

లింగసముద్రం, జనవరి 31 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు బుధవారం స్థానిక కెనరాబ్యాంకును సందర్శించారు. వృత్తివిద్య కోర్సులో భాగంగా స్కూల్‌లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం, ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ కోసం ఒకేషనల్ ట్రైనర్ ఎం.పాండురంగారావు ఆధ్వర్యంలో బ్యాంకును సందర్శించారు. ఆ బ్యాంకులో జరిగే కార్యకలాపాలను బ్యాంకు అధికారులు వారికి వివరించారు. ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్సార్ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించడం వలన వారి శిక్షణ నైపుణ్యాలు మెరుగుపడడమే కాకుండా, భవిష్యత్‌లో ఇవి వారికి ఎంతగానో దోహదపడతాయన్నారు.